# సుజనరంజని - విశ్వశాంతి మంజీరం

## సిలికానాంధ్ర 'ఆంధ్రసాంస్కృతికోత్సవ' ప్రత్యేక సంచిక

### సంపాదకులు

కూచిభొట్ల శాంతి

తాటిపాముల మృత్యుంజయుడు

### సంపాదకవర్గం

తమిరిశ జానకి

కస్తూరి ఫణిమాధవ్

### సిలికానాంధ్ర కార్యనిర్వాహకవర్గం

కూచిభొట్ల ఆనంద్ - ఛైర్మన్

కొండిపర్తి దిలీప్ - వైస్ ఛైర్మన్

చమర్తి రాజు - మనబడి కులపతి

మాడభూషి విజయసారధి - అధ్యక్షుడు

కోట్ని శ్రీరాం - ఉపాధ్యక్షుడు

వంక రత్నమాల - కార్యదర్శి

కాజ రామకృష్ణ - సంయుక్త కార్యదర్శి

మంగళంపల్లి రాజశేఖర్ - కోశాధికారి

# ఆంధ్ర సాంస్కృతికోత్సవ కార్యవర్గం

దశిక సూరజ్ – ఛైర్మన్

శ్రీనివాస శ్రీపాద – కన్వీనర్

Fund Raising and Coordinators

రవి చివుకుల

వంశీకృష్ణ నాదెళ్ళ

వంశీ ప్రఖ్య

వసంత మంగళంపల్లి

స్నేహ వేదుల

యామిని పొట్టి

రామకృష్ణ వెంగలసెట్టి

వంశీ ఇందవరపు

నిరుపమ చేబియం

ఏడిది నరసింహ మూర్తి

వాణీ గుండ్లపల్లి

అనూష కూచిభొట్ల

కృష్ణ ఖండవిల్లి

ఫణి మాధవ్ కస్తూరి

సమీర్ మాండలిక

మానస రావు

శాంతివర్ధన్

శ్రీనివాస్ అన్నం

Event Management & Ticketing

ఆనంద్ కూచిభొట్ల

దిలీప్ కొండిపర్తి

విజయసారధి మాఢభూషి

రాజు చమర్తి

రాజశేఖర్ మంగళంపల్లి

శ్రీరాం కోట్ని

రత్నమాల వంక

రామకృష్ణ కాజ

దీనబాబు కొండుభట్ల

సూరజ్ దశిక

శ్రీనివాస్ శ్రీపాద

మృత్యుంజయుడు తాటిపాముల

శాంతి కూచిభొట్ల

Volunteers

రవీంద్ర కూచిభొట్ల

అనిల్ అన్నం

శాంతి అయ్యగారి

సుధాకర్ బొమ్మ

ఆనందవర్ధన్ బండి

రావు చెన్న

రమేష్ వంక

శ్రీనివాస్ పేరి

శారద కాశీవఝల

కిరణప్రభ

స్వరూప్ గుడిసె

శశాంక కల్వల

అసావేరి రావు

వెంకట్ మాకిన

సృజన మద్దాలి

అనిరుధ్ కస్తూరి

**పుస్తక ముఖచిత్రం** :

మర్లంపూడి ఉదయ్.

**పుస్తక రూపకల్పన :**

కృష్ణ చెన్నాప్రగడ, AgnaTech.com

హైదరాబాద్.

# శాంతి వాక్యం

**- కూచిభొట్ల ఆనంద్**



ప్రతి సంవత్సరం అక్టోబర్ నెల వచ్చిందంటే సిలికానాంధ్ర కుటుంబంలోని పిల్లలకు, పెద్దలకు ఉత్సవం వేడుకలతో ఒకటే హడావుడిగా ఉంటుంది. ఈ పదమూడవ ఆంధ్ర సాంస్కృతికోత్సవ సంరంభంలో పాల్గొంటున్న సాంస్కృతిక సైనికులందరికి హృదయపూర్వక అభినందనలు. ఈసారి ఆంధ్ర సాంస్కృతికోత్సవ ప్రత్యేక సంచిక సుజనరంజని విశ్వశాంతి మంజీరం మకుటంగా ప్రచురిస్తున్నాము. కనుక, నేను ఈసారి ఆనందవాక్యం బదులు శాంతివాక్యం వ్రాస్తున్నాను.

విశ్వశాంతి స్థాపన కోసం ఎంతోమంది ఇప్పటి వరకు కృషి చేసారు, చేస్తున్నారు. దీనికి మౌలికంగా కావల్సింది మనం మన చుట్టుపక్కల పరిసరాలను శాంతియుత సహజీవనానికి అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేయడం మొదటిమెట్టు.

సిలికానాంధ్ర జగమంత కుటుంబం. మన సంస్కృతీ సంప్రదాయాలను వారసత్వంగా అందిపుచ్చుకోవటంతో పాటు ప్రపంచంలోని భిన్న సంస్కృతులను వారివారి సంప్రదాయలను అంతే గౌరవంగా చూడగలిగితే ప్రపంచశాంతిని సుస్థిరంగా నిలుపుకోవచ్చు. అయితే, ఇది ఒక ఉద్యమ స్ఫూర్తితో ప్రతి ఒక్కరు అహర్నిశలు పాటుబడి సాధించుకోవాల్సిన విషయం.

సిలికానాంధ్ర కుటుంబంలో ప్రతి యేట వందలాది మంది ప్రతిభావంతులు కార్యకర్తలుగా తెలుగు సంస్కృతీసంప్రదాయాలను భావితరాలకి అందిచటం కర్తవ్యంగా లక్ష్యశుద్ధితో పాటుపడుతున్నారనటంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. ఈ విశ్వశాంతి భావనను సాకారం చేసుకోవటం అందరి క్రియాశీలక భాగస్వామ్యంతోనే సుసాధ్యం అవుతుంది. అందుకు సిలికానాంధ్ర కుటుంబ సభ్యులందరికి ఆహ్వానం పలుకుతున్నాను. ఇప్పటివరకు అపూర్వ విజయ పరంపరలో అండగా నిలబడిన ఎందరో మహానుభావులు, అందరికి వందనాలు.

భవదీయుడు,

**కూచిభొట్ల ఆనంద్**

వ్యవస్థాపక అధ్యక్షుడు మరియు ఛైర్మన్

సిలికానాంధ్ర

# మనశ్శాంతియే విశ్వశాంతి

**– కొండిపర్తి దిలీప్**



సిలికానాంధ్ర సంస్థ స్థాపించి పుష్కర కాలం దాటిందని గుర్తుచేసుకుంటే ఆశ్చర్యం, ఆనందం కలుగుతున్నాయి. ఎల్లప్పుడు నిత్యనూతనంగా ఉండే సిలికానాంధ్రకు అప్పుడే పన్నెండు సంవత్సరాలు వచ్చాయంటే ఆశ్చర్యం, ఆ సంస్థ ద్వారా తెలుగువారికి చేసిన సేవలు తలుచుకుంటే ఆనందం కలుగుతాయి. కొద్దిపాటి సమయం తీసుకొని గతాన్ని పునరావలోకం చేసుకుంటే అందమైన అనుభూతులు మదిలో మెదులుతాయి.

మన కళ్లముందే పుట్టిన పిల్లలు పెరిగి పెద్దవారవుతున్నారు. సిలికానాంధ్ర ద్వారా తెలుగు సంస్కృతికి సంబంధించిన ఎన్నో విషయాలు నేర్చుకొంటున్నారు. ఆంగ్లంతో సమానంగా తెలుగుభాషపై పట్టు సాధిస్తున్నారు. వక్తృత్వ వ్యాసరచన పోటీల్లో పాల్గొంటున్నారు. సశాస్త్రీయంగా అన్నమాచార్యుల కీర్తలను రాగాలాపన చేస్తున్నారు. వేదికలపై కూచిపూడి నాట్యంలో ప్రావీణ్యతను ప్రదర్శిస్తున్నారు. ఇన్ని కళలకు పుట్టినిల్లైన సిలికానాంధ్ర అమెరికాలో ఈ తరం పిల్లలకి తల్లిలాంటిది. భావితరాలకి తెలుగు సంస్కృతిని పదిలంగా అందించాలనే ఉన్నతాశయంతో ప్రారంభించబడింది. సంస్కృతి మానవుని జీవన సరళిని వివిధ పార్శ్వాల్లో ప్రభావితం చేస్తుంది. వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తుంది. జ్ఞాన, శీల సంపదలను పెంపొందిస్తుంది. మానసిక పరిణితికి తోడ్పడుతుంది. ఈ పరిణామాల వల్ల మంచి చెడులను, సత్య అసత్యాలను తెలుసుకొనే విచక్షణా జ్ఞానం పెరుగుతుంది. ఎదుటి వారిపట్ల ప్రేమాభిమానాలు చూపుతారు. సంఘానికి, దేశానికి, ప్రపంచానికి మంచి పౌరులుగా తీర్చిదిద్దబడతారు.

అలాంటి పౌరుని మనస్సు శాంతికి నిలయమవుతుంది. మనుషులందరు బాగుంటే ప్రపంచ శాంతి వెల్లివిరుస్తుంది. సర్వమానవ సౌభ్రాతృత్వానికి కారణమవుతుంది. కింద చెప్పబడిన శాంతిమంత్రం అక్షరాలా నిజమవుతుంది.

**ఓం సహ నావవతు | సహ నౌ భునక్తు |సహ వీర్యం కరవావహై | తేజస్వినా వధీతమస్తు మా విద్విషావహై |**

**ఓం శాంతిః శాంతిః శాంతిః శాంతిః!**

**కొండిపర్తి దిలీప్**, వైస్ చైర్మన్,

సిలికానాంధ్ర

# అధ్యక్షుని పలుకులు

**- మాడభూషి విజయ సారథి**



తెలుగు సాహితీ సాంస్కృతిక సంప్రదాయ స్ఫూర్తితో జగమంతా తెలుగు కుటుంబంగా వెలుగొందుతున్న సిలికానాంధ్ర 'ఆంధ్ర సాంస్కృతికోత్సవం'కు విచ్చేసిన కుటుంబ సభ్యులందరికి హార్ధిక స్వాగతం పలుకుతున్నాను.

తెలుగు సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తూ, తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే విశేష కార్యక్రమాలను నిర్వహించడంలో సిలికానాంధ్ర అందెవేసిన చెయ్యిగా పేరొందింది. అన్నమయ్య లక్షగళార్చన, అంతర్జాతీయ మంగళ వాద్య సమ్మేళనం, అంతర్జాతీయ కూచిపూడి సమ్మేళనం మొదలుగాగల కార్యక్రమాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తూ పెక్కుసార్లు గిన్నీసు రికార్డులను కూడా నెలకొల్పింది.

ప్రాచీన భాష హోదా కలిగిన తెలుగుభాషకు ప్రపంచభాష గా వన్నె తెచ్చే దిశలో నిర్విరామ కృషి చేస్తోంది సిలికానాంధ్ర. దైనందిక జీవన వ్యవహారాల్లో, సమాచార సాంకేతిక రంగాల్లో తెలుగు భాషా వినియోగానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, సాంకేతిక నిపుణులు, మేథావులు, భాషా శాస్త్రవేత్తలు, భాషాభిమానుల సమన్వయంతో ఒక నవీన భాషోద్యామాన్ని మొదలుపెట్టింది.

ఆరేళ్ల క్రితం ప్రారంభించిన 'మనబడి ' అంచెలంచెలుగా ఎదిగి అమెరికాలోనే కాకుండా ఇతర దేశల్లోకి విస్తరించి వేలాది మంది పిల్లలకు తెలుగుభాషను సమర్థవంతంగా బోధిస్తున్నది. ఈ ఒరవడిలోనే సిలికానాంధ్ర మరొక చారిత్రాత్మకమైన కార్యానికి నాంది పలికి 'సిలికానాంధ్ర విశ్వవిద్యాలయం (Univesity of SiliconAndhra) ప్రారంభించింది. తెలుగు సంస్కృతి, తెలుగుకళలు, తెలుగుభాషాశాస్త్రాలను విశ్వవ్యాప్తం చేయాలన్న సదుద్దేశంతో ప్రారంభించబడిన ఈ విశ్వవిద్యాలయంలో వచ్చే విద్యాసంవత్సరం నుండి తరగతులు ప్రారంభమవుతాయి.

తెలుగు సాహితీ సాంస్కృతిక సంప్రదాయ స్ఫూర్తితో సుజనరంజని – అంతర్జాతీయ అంతర్జాల మాస పత్రిక గత పది సంవత్సరాలుగా వెలువడుతోంది. ఇది ప్రపంచవ్యాప్తంగా తెలుగు భాషాభిమానులని, సాహితీ ప్రియులను, అన్ని వర్గాల పాఠకులను విశేషంగా ఆకట్టుకుంటూ వస్తోంది.

నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తూ మరింత చక్కటి కార్యక్రమాల నిర్వహణతో తెలుగు భాషా సంస్కృతీ దీప్తి జగమంత వెలుగొందే విధంగా కృషి చేస్తాను. ఈ దిశలో మీ అందరి సహాయ సహకారాలని ఆశిస్తున్నాను.

ధన్యవాదాలతో,

**విజయసారథి మాఢభూషి**

అధ్యక్షుడు, సిలికానాంధ్ర

# తెలుగుతల్లి ఒడి - సిలికానాంధ్ర మనబడి

- **చమర్తి రాజు**



సిలికానాంధ్ర జగమంత తెలుగు కుటుంబం. సిలికానాంధ్ర గత పన్నెండు సంవత్సరాలలో తెలుగు సాహితీ, సాంస్కృతిక సంప్రదాయ స్ఫూర్తితో అనేక అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలను నిర్వహించి మన తెలుగు ఖ్యాతిని ప్రపంచమంతటా చాటుతున్నది. ఎనిమిది గిన్నీసు ప్రపంచ రికార్డులను కూడా సాధించింది.

సిలికానాంధ్ర కార్యక్రమాలలో మకుటాయమానమైనది 'సిలికానంధ్ర మనబడి'. భాషాసేవయే భావితరాల సేవ అనే నినాదంతో, మన మాతృభాషను ప్రాచీన భాష స్థాయి నుంచి ప్రపంచ భాష స్థాయి వరకు తీసుకెళ్ళాలన్న ధ్యేయంతో సిలికానాంధ్ర 2007 లో మనబడి తరగతులను ప్రారంభించింది. గత ఆరు సంవత్సరాలలో మనబడిలో వేలాది మంది పిల్లలు మన మాతృభాషను నేర్చుకున్నారు. ఈ పిల్లలు చదవడం మరియు వ్రాయడమే కాకుండా చక్కగా తెలుగులో మాట్లాడుతున్నారు. 2013-14 విద్యా సంవత్సరంలో 2800పైగా పిల్లలు తెలుగు నేర్చుకుంటున్నారు. మనబడి తరగతులు ఇప్పుడు అమెరికాలో 30 రాష్ట్రాలలోనే కాకుండా ఉక్రెయిన్, కెనడా, హాంకాంగ్, కువైట్ మరియు నార్వే దేశాలలో నిర్వహించబడుతున్నాయి. 4 నుంచి 6 సంవత్సరాల పిల్లలు బాలబడి తరగతులలోనూ, 6 సంవత్సరాల పైబడిన పిల్లలు ప్రవేశం, ప్రసూనం, ప్రకాశం, ప్రమోదం మరియు ప్రభాసం అనబడే 5 దశలలో తెలుగు చక్కగా నేర్చుకుంటున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అధికారికంగా గుర్తించిన ఏకైక బోధనా కార్యక్రమం సిలికానాంధ్ర మనబడి. మనబడిలో ఉత్తీర్ణులైన పిల్లలు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గుర్తింపు పట్టాలు కూడా పొందుతారు.

మన పిల్లల్ని తెలుగు భాషా కోవిదులుగా తయారు చెయ్యడామే కాకుండా, వారిని భావి ప్రపంచ తెలుగు నాయకులుగా తీర్చిదిద్దడానికి సిలికానాంధ్ర మనబడి ఎన్నో కార్యక్రమాలని పిల్లల కోసం ఏర్పాటు చేసింది. 'మనబడి బాలానందం' రేడియో కార్యక్రమాలు, ఏడాదికొకసారి జరిగే 'మనబడి సాంస్కృతికోత్సవాలు', 'తెలుగు మాట్లాట', 'భాషా జాతీయ పోటీలు'(పదరంగం – తెలుగు స్పెల్లింగ్ – బీ, తిరకాటం – తెలుగు జిపర్డీ), అంతర్జాల పత్రిక 'బాల రంజని' మరియు 'బాల గురువులు' లాంటి కార్యక్రమాలతో మన పిల్లల మనసుల్లో భాషాస్ఫూర్తిని సురక్షితంగా నింపి, భావి తెలుగు నాయకులుగా మన పిల్లలని తీర్చిదిద్దే ఏకైక కార్యక్రమం సిలికానాంధ్ర మనబడి.

సిలికానాంధ్ర మనబడి తరగతులు కేవలం తెలుగు నేర్పించే దేవాలయాలు కాదు, తరాల మధ్య అనుబంధాల వారధిని నిలిపే ప్రేమాలయాలు!. తెలుగు భాష వైభవాన్ని కొన్ని వేల సంవత్సరాలు నిలిపే నాయకులని తయారుచేసే కర్మాగారాలు! ఇది ఒక మంచి అవకాశం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. పిల్లలని మనబడిలో చేర్పించండి. తెలుగు భాష నేర్పించండి.

సిలికానాంధ్ర విజయాలకు కారణమైన దాతలకు, కళాకారులకు, కళాభిమానులకు, కార్యకర్తలకు, భావితరాన్ని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, పిల్లలకు, పిల్లలను ప్రగతి పథంలో నడిపించే అధ్యాపకులకు మా అభినందనలు.

మీ

**చమర్తి రాజు**

డీన్, సిలికానాంధ్ర మనబడి

# రథసారథుల సందేశం

- సూరజ్ దశిక, శ్రీపాద శ్రీనివాస, కన్వీనర్



హోరాహోరీ జీవన పోరాటంలో భాగంగా సముద్రాలు దాటి, ఖండాలు దాటి, మన పురాణాల్లో చెప్పినట్టుగా పుష్పక విమానాల్లో టికెట్టు కొని ఈ పాశ్చాత్య దేశంలో వాలిపోయాం. మాయాబజార్ పెట్టె, అదేనండీ, 'లాప్ టాప్' లో అంతర్జాల మహేంద్రజాలంలో పడి కొట్టుమిట్టాడుతున్న మనందరికి తెలుగుతనం అనుభూతి పరిమళాలను ఆస్వాదించటానికి వచ్చిన 'తెలుగు సాంస్కృతికోత్సవం' సందర్భంగా సిలికానాంధ్ర తరపున అభినందనలు.

'ఇల్లు కట్టి చూడూ, పెళ్లి చేసి చూడూ' అన్న సామెత ద్వారా ఆ పనుల్లో ఉన్న శ్రమ ఎంత కఠోరమైనదో ఇట్టే తెలుస్తుంది. ఆ సామెతలో, 'ఆంధ్ర సాంస్కృతికోత్సవం చేసి చూడూ' అన్న మాట కూడా చేర్చొచ్చు. మా ఉద్దేశంలో ఓ పెళ్ళిని ఘనంగా చేయటానికి కావాల్సిన శ్రమ 'ఆంధ్ర సాంస్కృతికోత్సం' చేయడానికి కావాలి. వచ్చేది రెండు వేలకు పైగా ఆత్మీయ అతిధులు. ఎనిమిది గంటలకు పైగా వారిని వివిధ కార్యక్రమాలల్తో అలరిస్తూ ఆనంద పరచాలి. పదహారణాల తెలుగింటి విందు భోనం పెట్టాలి. చిన్నా పెద్దలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

మరి ఇన్ని పనులు స్వచ్ఛంగా, ప్రేమానురాగాలతో చేయాలంటే మాటలా. దాదాపు మూడొందల మంది సిలికానాంధ్ర సైనికులు, ఔత్సాహిక కళాకారులు మూడు నెలలూ అలుపెరగక పని చేస్తారు. మెదడుకు పదును పెడుతూ కార్యక్రమాల్లో కొత్తదనం నింపటానికి ప్రయత్నిస్తారు. వడ్రంగి, కమ్మరి పనులుగా మొదలు బ్రష్షులను చేతబూని రంగులు కూడా అద్దుతారు. వారిలో దాగి ఉన్న కళలకు, ఆసక్తులకు ఓ రూపం కల్పిస్తారు. అన్నట్టు, పోపుల పెట్టెలో సువాసనలతో, తాళింపులలోని ఘుమాయింపులతో నోరూరించే పదార్థాలు వండడంలో కూడా సిద్ధహస్తులే. ఈ పనులన్నింటిని పకడ్బందీగా ఆచరణలో పెట్టి, విజయవంతంగా నిర్వహిస్తే, వేదికపై ఓ మాంత్రికుడు ఊహించని వింతలు చేస్తూ అలరించినట్టు ప్రేక్షకులు ఆశ్చర్యానందాలకు లోనౌతారు.

ఏ మాటకామాటే చెప్పుకోవాలి. కార్యక్రమం ముగియగానే, అప్పటివరకు పడ్డ శ్రమ, ఒంటి నొప్పులు 'ఉష్ కాకి ' లా ఇట్టే మాయమౌతాయి. మరుసటి ఏడు 'ఆంధ్ర సాస్కృతికోత్సవం' ఎప్పుడొస్తుందా అని ఎదురుచూపులు మొదలౌతాయి. అంతటి ఆకర్షణ శక్తి కలిగి ఉన్నది ఈ సాంస్కృతికోత్సవం.

ఈ సంవత్సరపు సాంస్కృతికోత్సవ రథసరధులుగా మేము ప్రతి నిమిషం మనసు పెట్టి చేసాం. సైనికులమందరూ నిస్వార్థంగా తమ వంతు కృషి చేసారు. మరెందుకు ఆలస్యం. న్యాయనిర్ణేతలు మీరే. చూడండి. ఆనందించండి. అభిప్రాయాలు నిష్కర్షగా తెలియజేయండి.

మీ

**– సూరజ్ దశిక, ఛైర్మన్**

**– శ్రీపాద శ్రీనివాస, కన్వీనర్**

# విషయ సూచిక

1. విషయ సూచిక - 1- 2
2. సంపాదకీయం - 3
3. విశ్వ క్షయాన్నివిడనాడేదే విశ్వ ప్రేమ అంటే – డా. నారాయణ గరిమెళ్ళ – 4
4. ఓం శాంతిః ! విశ్వ శాంతిః !! – నాగరాజు రామస్వామి – 5
5. విశ్వశాంతి పరిమళం – పద్మ ఆయల – 6
6. ప్రపంచ శాంతి – సారాంశము – తరిని సాయి పద్మనాభుని 6
7. కాలవిలాపం – ముప్పళ్ళ శ్రీ రామచంద్ర మూర్తి – 7
8. ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః – జె.కె. భారవి – 8
9. మనిషి – డా. వాసా ప్రభావతి – 9
10. విశ్వశాంతి – జంగం(సింహాద్రి) జ్యోతిర్మయి –10
11. నిశ్శబ్దపుటందాలు – తమిరిశ జానకి – 11
12. ఆహ్వానం – డా. మంగళగిరి ప్రమీలాదేవి – 12
13. నేను – నువ్వు – అద్వైతం– వంశీ ప్రఖ్య – 13– 14
14. ఏ విశ్వ శాంతి – డా . మీగడ రామలింగస్వామి – 15
15. విశ్వశాంతి – జంధ్యాల కుసుమకుమారి – 16
16. ప్రపంచ శాంతి – సి.వి.ఆర్. సత్యశ్రీ –17
17. శాంతి భారతం…? – కొత్తపల్లి రాములు – 18
18. విశ్వశాంతి – విశ్వప్రేమ – ధూర్జటి – 19
19. వ్యక్తిగత శాంతి లేకుండా ప్రపంచ శాంతి.. – సద్గురు – 20 – 22

20. ప్రియమిత్రుడా! – మోహన్ లాల్ కరంచంద్ గాంధీ – 23
21. ప్రపంచ శాంతి– తరిని సాయి పద్మనాభుని (పదవ తరగతి) – 24 – 25
22. నా ఉద్దేశంలో విశ్వశాంతి – తాటిపాముల మృత్యుంజయుడు – 26 – 28
23. సంప్రదాయమే – శాంతికి మూలం.
– విద్వాన్ తిరుమలెద్దింటి. నరసింహాచార్యులు. –29 – 34
24. వెళ్ళొస్తానండీ! – సత్యం మందపాటి – 35 – 40
25. విశ్వ శాంతి విశ్వ ప్రేమ – కాజ మాధురీ – 41 – 44
26. ఒక చావు – ఎన్నో పెళ్లిళ్ళు – తాటిపాముల మృత్యుంజయుడు – 45–49
27. ఓ విశ్వప్రేమికా...వినాయకా – గరిమెళ్ళ సుజాత – 50 –51
28. శాంతి నిలయం – ఉమా దేవి అద్దేపల్లి – 52–56
29. ఉత్తిష్టత జాగ్రత ప్రాప్యవరాన్నిబోధత! – హైమా శ్రీనివాస్ – 57 – 63
30. వృక్షో రక్షతి – ప్రతాప వెంకట సుబ్బారావు – 64 – 65
31. దూర్జటి దూషణాభాషణభూషణాలు – రావు తల్లాప్రగడ –66 – 68
32. కాలం కత్తెరలో – ఆకెళ్ళ – 69 – 73
33. అనుమానితుడు – ఆర్. శర్మ దంతుర్తి – 74 – 76
34. భారతదేశం – పెయ్యేటి శ్రీదేవి – 77 – 81
35. విశ్వశాంతి – విశ్వప్రేమ – రాధిక – 82–84
36. విశ్వశాంతి – విశ్వప్రేమ – పిల్లలమట్టి కృష్ణ కుమారు – 85–86

## సంపాదకీయం

- కూచిభొట్ల శాంతి, తాటిపాముల మృత్యుంజయుడు





**మానవ మేధస్సే విశ్వశాంతికి మూలం**

'విశ్వశాంతి – విశ్వప్రేమ' అన్న అంశం తీసుకొన్నప్పుడు రచనలు విరివిగా వస్తాయా అన్న సంశయం కలిగింది. ఎందుకంటే ఆ అంశం పరిధి చాలా విస్తృతమైనది. మొదట్లో కొంతకాలం అన్నీ కవితలే రావడం మొదలెట్టాయి. మరి కథలు, వ్యాసాలు, ఇంకా ఇతర ప్రక్రియల్లో రచనలు రావేమోనని భయం వేసింది. రోజులు గడిచిన కొద్దీ పలు రకాల రచనలు రావడం జరిగింది.

ఈ ప్రత్యేక సంచికలో దరిదాపు నలభై రచనలు కవిత, కథా, వ్యాసాల రూపంలో ఉన్నాయి. అన్నింటినీ చదివి అవగాహన చేసుకుంటే తెలిసే విషయం ఏమిటంటే విశ్వశాంతి, విశ్వప్రేమ అనేవి అందలేనంత ఎత్తులో ఉన్న మధురఫలమేమికాదు. అది ప్రతి మనిషి అందుబాటులో ఉన్నమరియు ఆచరణ యోగ్యమైన విషయమే అని తెలుస్తున్నది. కాని, దాన్ని అందుకోవాలంటే కృషి చేయాలంతే. అది తెలుసుకోలేక, మనం 'చంకలో బిడ్డను పెట్టుకొని ఊరంతా వెదికిన చందాన' శాంతి కోసం విశ్వమంతా గాలిస్తున్నాం. 'ఇల్లలుకుతూ ఒక ఈగ తన పేరు మరిచిపోయింది' అన్న సారూప్యతతో ఒక వ్యాసం ఈ సంచికలో వేసాం. 'యద్భావంతద్భవతి' అన్న సూక్తి నుంచి మనం అన్వయించుకోవలసింది ఏమిటంటే 'ప్రపంచం శాంతి యుతంగా ఉంటే ఎంత బాగుంటుంది'అన్న బావన భావంగా ఉండి పోకుండా, ప్రతి మనిషి ఆచరించి, అనుసరించటం వల్ల విశ్వశాంతి లభిస్తుంది అన్న భావం మాకు స్ఫురుంచింది. ఆడిగినంతనే స్పందించి రచనలు అందించిన ప్రపంచ నలుమూలల నుండి రచయితలు, రచయిత్రులకు మా కృతజ్ఞతలు. భారతదేశం నుండి సహకారం అందించిన కస్తూరి ఫణిమాధవ్ గారికి, తమిరిశ జానకి గారికి, పేజీలను అందంగా తీర్చిదిద్దిన కృష్ణ చెన్నాప్రగడ గారికి, వారి Agnatech బృందానికి, శ్రద్ధ తీసుకొని అచ్చుతప్పులను సరిదిద్దిన టెక్సాస్ వాసి అయిన జొన్నలగడ్డ శారదాదేవి గారికి పత్రికా ముఖంగా కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాము. ముఖపత్రాన్ని రమణీయంగా తీర్చిదిద్దిన చిత్రకారుడు, మర్లంపూడి ఉదయ్. ఈ సుజనరంజని ప్రత్యేక సంచికలో విశ్వశాంతి మంజీర రవళీనాదం ఇప్పటివరకు శాంతిస్థాపనకు పాటుపడిన ఎందరో మహానుభావులకు అంకితమిస్తున్నాము.

**– కూచిభొట్ల శాంతి**

**– తాటిపాముల మృత్యుంజయుడు**

సంపాదకులు

## విశ్వ క్షయాన్నివిడనాడేదే విశ్వ ప్రేమ అంటే

- డా. నారాయణ గరిమెళ్ళ

అపురూపంగా కురిసిన
నీటి బిందువు కూడా
ఏ గొంతునూ తడపక ముందే
గ్లోబల్వార్మింగ్ కి ఆవిరైపోయానంటుంది.

ఎక్కడ చూసినా
విఘటనం చెందడమెలాగో తెలియని
మీనమేషాలు లెక్కలేస్తూ
మరీ కూర్చున్న
ప్లాస్టిక్ వ్యర్ధాలే...
గాజుముక్కల శిధిలాలే...

పూరిల్లులు కాంక్రీటుగా
రూపాంతరం చెందినందుకో...
సెల్లవర్లు కలిసి
ఉరితాడు పేనుతున్నందుకో...
పురుగుల మందుతో సహా
ఆ మాత్రం పిట్ట-తిండితోనే
సరిపెట్టుకోమని శపించినందుకో...
పిచ్చుకజాతి
ఆత్మహత్యకు
ఒడిగట్టింది.

ప్లాస్టిక్కూ పురుగుల మందూ కలసిన
పశుకళేబరాలు తింటున్నప్పుడు
ఎక్కిళ్ళకు గొంతులు ఎండి
పూడుకుపోయినందుకు
రాబందు జాతీ
వీడ్కోలు చెప్పేస్తోంది...

ఫ్యాక్టరీ వదిలిన వ్యర్ధాలో
రెజినో కొవ్వు పూసలు పూసలుగా
విషాహారాన్ని అందించినందుకు
విషాహారాన్ని అందించినందుకు
చేప జాతీ కళ్ళు తేలోస్తోంది

ఎన్నెన్ని జాతులో
బారులు తీరి మరీ
వధ్యశిలకేసి తలలు కొట్టుకోవాలని
తాపత్రయ పడుతున్నాయి.

ఇప్పుడు డార్వినుంటే
జీవ పరిణామాన్ని
ఆదర బాదరగా
తప్పుల తడకలుగా
వ్రాసేసుకు కనుమూసేవాడు.

ఇప్పుడు డార్వినుంటే
జీవ పరిణామాన్ని
ఆదర బాదరగా
తప్పుల తడకలుగా
వ్రాసేసుకు కనుమూసేవాడు.

సమస్త విశ్వానికీ
చెల్లుచీటీ పాడేస్తున్నవాడెవడో
తన అంతిమ ఘడియలకు
తనే దగ్గరౌతుంటాడు.

ఇప్పటికైనా
ఎప్పటికైనా
ఏ జాతినీ
ఏమార్చనిదే
విశ్వప్రేమ అంటే....
భూమిని ఆదర్శంగా చూపి...
గ్రహాలన్నిటినీ చక్కదిద్దేదే
విశ్వప్రేమ అంటే.

## ఓం శాంతిః ! విశ్వ శాంతిః !!

- నాగరాజు రామస్వామి

ముక్కున గడ్డి పరక
ముడుచుకున్న రెక్క
ఎగరదు విగ్రహ విహంగం
ఎరుగదు నింగి శాంతి కపోతం

ఝుండా వందనం దినం --
పాపం పసిపిల్లలు వాళ్ళకేం తెలుసు
పతాకం ఎన్ని హిమాలయాలను మోస్తున్నదో
ఎన్ని నిట్టూర్పు కెరటాలకు ఎగురుతున్నదో

అంతర్జాతీయ సదస్సుల పర్వమ్--
అసలు రంగును పొక్కనీయకుండా
ఆకసాన్ని అవనికి దింపేద్దాం అంటున్న
బృహత్తర రాజకీయ బృందం
అంతిమంగా మిగిలేది వివర్ణ అనవత కేతనం

స్వార్థం సహస్ర ముఖాలుగా బుసకొడుతున్న నాడు
స్వజనం లోనే సయోధ్య కుదరక
కుటుంబ వ్యవస్థ కుప్ప కూలుతున్న నేడు
వసుధైక కుంటుంబాన్ని, సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని,
విశ్వైక ప్రేమను , విశ్వ శాంతిని కలకనడం
ఒకె యుటోపియన్ స్వప్నం,
ఒక యూనికార్న్ మెకం,
ఒక శశ విషాణం .

అయినా అన్యథా శరణం నాస్తి
అందాకా నీవు--
ఏదో ఒక రోజు
ప్రతి మనిషి మహాత్ము డవుతాడు
ప్రతి మదర్ థెరసా అవుతుంది
వసుధను విశ్వ శాంతి వరిస్తుంది
అంటూ --- అనుకుంటూ --- కుంటూ ---
యుటోపియన్ డ్రీంను ఈడ్చుకుంటూ
నిరాసక్త నిర్లిప్త శాంతి మంత్రంలా
నిర్జీవ యంత్రంలా
నడుస్తూ పో ---నడుస్తూనే పో --- స్తూనే పో
--- పో --- పో ---

let charity begin at home

ఎక్లా చాలో, ఎక్లా చాలా, ఎక్లా చాలో రే !!

## విశ్వశాంతి పరిమళం

**- పద్మ ఆయల**

విశ్వశాంతి ఓ పరిమళమై ప్రయాణించనీ
ఓ మేఘమై ఈ భువనమంతా వర్షించనీ
వెన్నెలలా ఈ భువిని పరచుకోనీ
ఆ శాంతి తాకితే
నిర్మల సౌఖ్యం
జీవనాడులలో ప్రవహించదా?
స్వార్థం స్వేదబిందువులలా
హరియించదా?
కరుణశ్వాసయై
ప్రేమ హృదయమై
త్రికాలజ్ఞానసంపన్నులై
జీవరాశులు సుభిక్షులై
మరల మరల శాంతిని
పలవరించి
తరచి తరచి
సుఖించనీ సుఖించనీ

## ప్రపంచ శాంతి - సారాంశము

**- తరిని సాయి పద్మనాభుని**

1. మానవాళి మారణ ఆయుధాలు తయారు చేయడము, అమ్మడము మరియు వాడడము నిషేధించాలి.
2. ప్రజలు గాంధీ, నెల్సన్ మండేలా, మార్టిన్ లూథర్ కింగ్ మరియు లార్డ్ బుద్ధ పద్దతులు అనుసరించాలి .
3. ప్రజలు భూమి, నీరు మరియు డబ్బు కోసం తగాదా పెట్టుకోకూడదు
4. ప్రజల్లో దోపిడీ ఆలోచన ఆగిపోవాలి.
5. అభివృద్ధి చెందిన దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు సహాయం చేయాలి
6. శాంతితో జీవనము గడిపే వారు ఆరోగ్యంగా జీవిస్తారు.

## కాలవిలాపం

- ముప్పళ్ళ శ్రీ రామచంద్ర మూర్తి

ఎన్నో యుగాలు దాటి పయనిస్తున్నాన్నేను
భూమ్యాకాశాల్లానే మీరూ ఎప్పటికీ కలవరు
నాలో మార్పే కానీ మీలో అణుమాత్రం లేదు
అదే అసమానతల మధ్య అణిగి నలిగి పోతున్నారు

స్త్రీని నేనంటారు, పురుషుడు వాడంటారు
కులమని ఒకడంటే మతమని మరియొకడు
భాషని ఇంకొకడు, జాతని వేరొకడు.... రకరకాల విబేధాలు
ప్రతియుగమూ, ప్రతిదినమూ, ప్రతిక్షణమూ యుద్ధాలే
మీరక్తపు మడుగుల్లో నేను మలినమవుతున్నా

మీకు తెల్సు నేను మీకందరికీ సమమని
అనాగరికత అన్నారని నాగరికత మోసుకొచ్చా
ఎందరో యుగకర్తల్ని నాతో నడిపించు కొచ్చా

ఏం సాధన ఒరిగింది? ఏమైందా నాగరికత?
రాకెట్లతో , క్షిపణులతో నింగికెగసి పోయిందా?
యంత్రాల మధ్య పడి నలిగి నశించిందా?

స్వార్థపు మంటల నడుమ నల్లగ మసిబారుతుందా?
క్రొత్త క్రొత్త చదువులతో స్పర్థను పెంచేస్తుందా?
రంగురంగుటద్దాల్లో కామాన్ని కొలుస్తుందా? లేకా,
అనాగరిక చరిత్రలే నయమనిపించేస్తుందా?

శ్రీ శ్రీ ల మహాప్రస్థానాలూ, గురజాడల గేయాలూ
గాంధీల ఉద్యమాలూ , బుద్ధుని ప్రబోధాలూ
నా గత చరిత్రలో మున్నాళ్ల ముచ్చట్లే
గోడకు కొట్టిన బంతికీ మీకూ తేడా ఏంలేదు

ఇకనైనా,

నాగరికానాగరికాల వక్రరేఖల్ని త్రుంచండి
అశాంతి కార్ఖానాల్లో కత్తులింక నూరకండి

కట్టల కట్టల మీ చెత్త చరిత్రల భారం
సమానత్వ జ్వాలలలో దహించి వేయండిక
ఎప్పటికీ, ఏనాటికైన, విధానాలు ఏమైనా

ఆచరణకు కష్టమైనా , పరిష్కారమొకే ఒకటి
సమానత్వధోరణే సర్వత్రా శ్రేయస్కరం

అందుకే,

నాముస్ముందు పయనంలో, సంతోషంతో
సరికొత్త చరిత్ర పుటలు నాలో కలిపేయండి
మంచిమనస్సుతో మానవమేధస్సుతో
ఏభేదం ఎరుగని భాషతోటి వ్రాయండి
శాంతి ప్రగతుల ఒక గట్టి అట్ట వేయండి
నాభవిష్యత్ చరిత్రకు గర్వ కారణం కండి

## ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

- జె.కె. భారవి

ఓం శాంతి ఓం శాంతి శాంతి శాంతీ అని
సింహమై గర్జించె సిలికాను వ్యాలి

లోకా సమస్తా సుఖినోభవంతు అని
స్లో"గన్స్"తో కదిలింది ` కాళీ`

అశ్వరథ శరభ కదలండి లెండీ అంటు
శ్రీశైల భ్రమరాంబ శంఖమూదింది

ఓంకార నాదాల ఓరుగల్లులో
భద్రకాళమ్మ శ్రీరస్తు చిందులేసింది

కాశీ విశాలమ్మ కాగడాల్ వెలిగించ
కంచి కామాక్షమ్మ 'కాహళులే' మ్రోగించ

కొల్లాపురీ లక్ష్మీ కోక బిగియించి
మధుర మీనాక్షమ్మ మంగళం పాడింది
కనకదుర్గా దేవి కను సైగచేసింది
చాముండి జయకేతనం ఎగరవేసింది

విశ్వశాంతికి దారి సిలికాను క్రాంతి అని
అలంపురీ జోగుళాంబ దీవించింది.

## చాటింపు

స్వార్థ ప్రయోజనాలకు మరిగి

రాక్షస ప్రవృత్తిలో రగిలి

విశ్వశాంతిని 'కిడ్నాప్' చేసి

బ్లాక్ హోల్లో బంధించి

బ్లాక్ మెయిల్ చేస్తున్న

బడా చోరుల

బద్మాష్ ల బండారాలు బట్ట  బయలు చేద్దాం

## మౌనం విడనాడండి ప్లీజ్

జీసస్

సోక్రటీస్

అబ్రహాంలింకన్

జేమ్స్ గార్ ఫీల్డ్

విలియం మెక్ కిన్లే

గాంధీ 'ఇందిరాగాంధీ' రాజీవ్ గాంధీ..

నిన్న గాక మొన్న

కనెక్టి కట్ స్కూల్లో

పాలు గారే పసిబిడ్డలు ఇరవై ఎనిమిది మంది..

ఇలా, ఎందరెందర్నో చంపుకుని

'శాంతి' గుండెల్లో బాకులు దించాం!!!

ఓ మేథావుల్లారా!

మౌనం వీడనాడండి!

ఇకనైనా నాగరీకులం అవుదాం..ప్లీజ్..!

## మనిషి

- డా. వాసా ప్రభావతి

తనచుట్టూ ఉన్న సమాజపు
భవనాల అంచులపై పరుగులు పెడుతూ
తన చుట్టూ ఉన్న ఆలోచనా బంధాలతో
ఆటలాడుతూ
తన కొరకే కాక
అందరి కోసం ఆలోచించి
ఆచరించే వాడు మనిషి!

స్వార్థం నోరుతెరచి
నిప్పులు కక్కుతుంటే
దేశ ప్రగతి చేతులు చాచి పిలుస్తుంటే
పరుల కోసం పరుగులెత్తేవాడు
అందరిలో తానొక్కడై నిలిచేవాడు
అందరి భుజాలు తట్టి
ముందుకు నడిపేవాడు మనిషి!
అజ్ఞానం చుట్టూ ఆవరించి ఉన్నా
విజ్ఞానపు దీపం వెలిగించాలని

ఆ వెలుగు వెంట అందరిని నడిపించాలని
ఆటంకాల అగ్నిశిఖలను ఆర్పుకుంటూ
అవరోధాల పెను తుఫానులు దాటుకుంటూ
ఫలోన్ముఖుడయ్యే వాడు మనిషి!

తనచుట్టూ ఎగసిపడే ధూళిరేణువులతో
బరువెక్కిన కనురెప్పలను
ఏ చల్లని హృదయ తరంగమో విచ్చేసి
కమ్ముకుపోయిన ధూళిని తొలగించి
తన జ్ఞానేంద్రియాన్ని మేలు కొలపాలని
విశ్వగీతం ఆలపించాలని
విశ్వశాంతికై తపించే గీతమయ్యేవాడు మనిషి!

## విశ్వశాంతి

- జంగం(సింహాద్రి) జ్యోతిర్మయి

విశ్వశాంతి పావురం
వేదభూమి భారతం
మతసహనం మతమైన
మా జనానికి వందనం....

రోగము దుఃఖము మరణము
చూసి రోసి సన్యసించి
సిద్ధార్థుడు బుద్ధుడయ్యె
అహింసావాది అయ్యె
అసతోమా సద్గమయా
అన్నదయా బుద్ధగయా
ఆ కరుణా మూర్తికిదే
అర్పించెద వందనం........ .'విశ్వశాంతి పావురం'

సంగ్రామపు భూమిలోన
నెత్తుటి మడుగులు చూసి
సామ్రాట్టే తల్లడిల్లె
అహింసా వాది అయ్యె
అతని ధర్మ చక్రమే
మన పతాక చిహ్నమాయె
అవనిలోన కీర్తిగన్న
అశోకునికి వందనం........... .'విశ్వశాంతి పావురం'

మూడు పదులు నిండకనే
మోహ ముద్గరమ్ము తోటి
అద్వైతము చాటినారు
జగద్గురువు శంకరులు
సౌందర్య లహరిలోన
భక్తి నావ నడిపెనతడు
ఆదిశంకరాచార్య
అందుకొనుము వందనం.......'విశ్వశాంతి పావురం'

అమెరికా వేదికపై ఆర్ష ధర్మ ఔన్నత్యం
చాటి చెప్పెనొక యువకుడు
పరమ హంస ప్రియ శిష్యుడు
కాషాయపు ఠీవి తలచి
గర్వించును భరతజాతి
వివేకానంద స్వామి
విఖ్యాతికి వందనం...... 'విశ్వశాంతి పావురం'

ప్రపంచాన్ని శాసించిన
ఆంగ్లేయుల నెదిరించిన
సత్యాహింసలతోటి
స్వాతంత్ర్యం సాధించిన
మన బాపూ బోసినవ్వు
భరతమాత సిగపువ్వు
మహనీయా మహాత్మా
మనసారా వందనం...... 'విశ్వశాంతి పావురం'

యుద్ధోన్మాదము వద్దని
పంచశీల ప్రకటించెను
గులాబీ బాలలను
గుండెలలో హత్తుకొనెను
శాంతి దూత జగతికి మన
తొలి ప్రియతమ ప్రధాని
పండిత నెహ్రూ నీకిదే
ప్రియమారా వందనం.....'విశ్వశాంతి పావురం'
సేవచేయు మనసులేక
ప్రార్థించే పెదవులేల?
కరుణ చూపి ఆదుకోని
కరములేల? కన్నులేల?
అన్న ప్రేమమూర్తి తెలుసా?
ఆమె మదర్ థెరిస్సా
భరత రత్నమై నిలచిన
ఆ అమ్మకు వందనం.....'విశ్వశాంతి పావురం'

# నిశ్శబ్దపుటందాలు

- తమిరిశ జానకి

శాంతి దూతిక అల్లుకున్న నిశ్శబ్దరాగ మాలిక

అమ్మ మనసులా పరిమళ భరితం

అమ్మ చూపులా చల్లని దీవెన

అమ్మ ఒడిలా భద్రమె భద్రం!

శబ్దంతో తుత్తునియలు ఆ నిశబ్దం!

జారిపడిన అగాధపులోతుల అరాచకం!

అమ్మగుండె వ్రక్కలు! వెతకుతోంది నలు దిశలా

కోల్పోయిన నిశబ్దపుటందాలు!

శాంతి కాముక భావాల చరణాలు చెల్లాచెదురు!

చరిత్ర పుటలు చర్వితచర్వణమై

రెపరెపలాడుతున్న ప్రపంచ శాంతికి

కాపుగా కరములెత్తిన మాదిరి

కాంతి కిరణాలబాటలో

నడిచే వృక్షాలుగా కదలిపోవాలి మనం!

కొమ్మల సేద తీరు పక్షిగణాల

కువకువల వలె మనసుల నలరించగలగాలి

స్థిరత్వాన్ని పొందిన వేర్లవలె పాదుకుని

ప్రపంచ శాంతి ఫలాన్ని అందివ్వగలిగితే

అంతకన్న ఏముంది

భరతమాత ఋణం మనం తీర్చుకోగలిగేది?

## ఆహ్వానం

- డా. మంగళగిరి ప్రమీలాదేవి

శాంతి దేవత వస్తున్నది
పదండి స్వాగతాంజలి ఘటిద్దాం!
శ్వేత కపోత విహంగాన్ని కరకమలంలో ధరించి
అమలిన హృదయంతో శాంతి దేవత వస్తున్నది!
అశేష జనులకూ ఆప్తురాలే ఆమె
పచ్చని పచ్చిక బయలునే కాదు
నీటిలోనూ ఆకాశంలోనూ
ఆమె అడుగిడిన అణువణువూ
అంతా ఆనందమే
ఆమె చూపు సారించాలే గానీ
ప్రతిచోటూ కాదా నందనవనం!
చైతన్యపు రథమ్మీద మనోవీధిలో పయనిస్తూ
మమతల ప్రాంగణంలో మనుగడ సాగించాలని
వస్తున్నది ఆమె ఇక శూన్యమే మృత్యు ప్రాంగణమంతా!
యుద్ధాలూ, అణుబాంబుల తయారీలు
జాతి విద్వేషం, విధ్వంసం నిషేధాల వర్ణమాలను
మనచేత దిద్దించాలని
ఆనందాల అక్షరమాలతో అలంకరించాలని వస్తున్నది!
హస్తంలో సామరస్య మధుపాత్ర
అందరికీ భాగముంది అందులో
అందుకొందాము అందరమూ! కదలిరండి!
ఏకమవుదాము ప్రపంచమంతా ఒకటిగా
పయనిద్దాం మానవతా హారంగా
శాంతి దేవత గళసీమనలంకరించగా!

## నేను - నువ్వు - అద్వైతం

- వంశీ ప్రఖ్య

తెల తెలవారుతుండగా
మిల మిల మెరుస్తున్న సాగరతీరాన
మసక మసక చీకటిలో
ఇసుక తిన్నెల మీద
గుండె లోతుల్లోంచి దమ్ముతీసుకుని
మండే సూరీడు వైపు
పందెపు గుఱ్ఱంలా పరిగెడుతున్నాను.

ఒంటరిగా సంద్రాన్నే ఒడిసిపట్టే నన్ను
తుంటరిగా పిలుస్తూ జంటగా చేరిందో గొంతు
"ఏమోయ్ మనిషీ!
ఏమిటా పరుగు?
ఏమిటో నీ జోరు...
సూరీడుని మింగేందుకు ఎగిరిన శూర హనుమలా
శక్తులు సమగూడిన సంద్రపు సునామిలా
ఏ తీరులో నీ గమనం, ఏ తీరమో నీ గమ్యం
ముజ్జగాలనూ ముట్టడిస్తావో
మధ్యలోన వదిలేస్తావో" –
మెల్లగా గిల్లుతూ పలికింది.
సరిగా చూద్దును కద,
అలవోకగా పరిగెడుతోంది.
అలవాటే అన్నట్లుంది.
అపరిచితమైనా ఆనుపానులు తెలిసినట్లుంది.
సందర్భానికి సాయమో –
అసందర్భపు ప్రేలాపనో...
అయినా..

ఈ కొత్త కోయిలకేం తెలుసు నేనేంటో?
ఈ ఉత్త మాటలకేం తెలుసు నేనెంతో??
హద్దులు చెరిపే పరుగులో
చుక్కలు చేరెడి తంత్రంతో
నిత్యం ప్రతిసృష్టి చేస్తూ
బ్రహ్మగ మారిన నా గూర్చి తెలియనట్లుంది.

విజ్ఞాన సారపు సాగరం
విజయాలతో మిల మిలా వెలుగుతుంటే
మనిషితనపు ఇసుక తిన్నెలపై
సమస్యల జడివానలోనూ జారక నిల్చి ఉన్నా.

ఆవలనున్న అగ్నిగోళాన్ని
ఆశల దారాలతో
అవనీ తలంపై లాక్కొచ్చే యజ్ఞంలో
అపుడే ఓ అంకం పూర్తయింది.
ఇక శ్రమలోనే విశ్రమిస్తూ సాగామా
అదృష్టాధ్వం మనదే!
ఆశించిన వెలుగుల తూణీరాలు మనకే!
ఇంతలోనే ఈ దెప్పిపొడుపులేంటో!!

నా మాటే విన్నట్లుంది –
అవునంటూ తలలూపింది –
" చిన్నా..
మట్టిని పిండి ముజ్జగాల వ్యాహ్యాళికి వెళ్ళావ్..
అణువణువులో అందాలను అద్భుతంగా దర్శించావ్..
తంత్రిలో తూములుకట్టే తంత్రమే నేర్చావ్..
ఇక...
ఎక్కడికీ నీ పయనం?
ఏ కడనో నీ విశ్రమం??"

ఆప్యాయంగా అడిగిందా గొంతు..
ఇంకా పొడిగిస్తూ–

"నీ పరుగుపాటకు పల్లవి నేనే
నిను సృష్టించిన విరించిని నేనే...
గుర్తించవా?
నీతో ఆడుతూ అలుస్తూ మురుస్తూ
గర్విస్తూ గమనిస్తూ అనుగమిస్తున్నా..
కన్నా..

ఎపుడైనా ఆగేనా నీ పరుగు?"
అనునయించింది దైవం.
"నీకు అర్థం కానిది ఒకటున్నది.
నీ అర్చనలో శాంతి పరలోకాన ఉన్నది.
ఈ లోకాన –
చక్రమే చరితను మార్చినా అది నీ సృష్టి నైజం...
గాలిలో శక్తులు పొందినా అది నీ రహస్యం...
నా ఆలోచన అణ్వస్త్రం, అయినా అది నీ నియమం...
ఎన్ని ఛేదించినా భగవాన్,
అది నీ సృష్టి విలాసం....
అందులోన ఏమున్నది నాకు గర్వం?
నాదైన సృష్టిన ఉన్నది అసలు సాంత్వనం.
నాదే అయినప్పుడున్నది విజయోత్సాహం."
అసలు సంగతి చెప్పాను
మనసు లోగుట్టు విప్పాను.

నవ్వుతూ తలూపింది నా నేస్తం..
నావైపు అందిస్తూ అభయ హస్తం...
"ఆశల బేహారివి, బృందావన విహారివి..
అమృతం నీ ఉత్సాహం..
నానృతం నీ ఉత్థానం..
అయినా కన్నా..
గుర్తించలేదా?
నాలోని యుక్తి నీవు
నీలోని శక్తిని నేను.
నీ విద్వత్ వెలుగుల దర్శించిన క్రీడ నేను –
నా విద్యుత్ వలయాల పుట్టిన నీడ నీవు.
ఎవరనగలరు మనం ఇరువురమని?
నీవు–నేను అన్న ద్వైతాన్ని?
ఎవరాపగలరు మన పరివారాన్ని?
నర నారాయణ సైన్యాన్ని?
ఖరమల్లే భారాన కృంగిపోక
శిఖరమై ప్రకృతితో పాదపూజలందుకో!"

గీతాసారం బోధపడింది
అద్వైతం అవగతమయింది.
ఒకే ఒక్కడినై ఎదిగేందుకు సోపానం కనిపించింది.

# ఏ విశ్వ శాంతి

- డా . మీగడ రామలింగస్వామి

ఏ విశ్వ శాంతికై ఎందఱో ఋషి వరుల్

శాస్త్రాలు లిఖియించి విస్తరించే

ఏ  విశ్వ ప్రేమకై ఎందఱో కవివరుల్

కావ్యాలు రచియించి ఘనత దాల్చే

ఏ విశ్వ శాంతికై  ఎందఱో గుణనిధుల్

మార్గాలు చూపించి  మంచి పెంచే

ఏ విశ్వ ప్రేమకై ఎందఱో బుధవరుల్

ధర్మాలు చూపించి దారిచూపె

వాటిననుసరించినవారు ప్రథములైరి

వాటిననుసరించనివారలధములైరి .

కాన, విశ్వప్రేమను పంచగల్గినపుడే

వెలుగు విరజిమ్ము  నీ మీద విశ్వశాంతి ..

# విశ్వశాంతి

- జంధ్యాల కుసుమకుమారి

'నా' నుంచి 'మన దాకా

అటుపై 'అందరి  దాకా

సాగే ప్రస్థానం విశ్వ భావన

సర్వ జన ప్రియ సౌభాగ్య కామన

పొరుగు వారి పచ్చదనం కనులకింపు కావాలి

ఇరుగు వారి ఇష్ట సిద్ధి  ఎదనెలిమిని నింపాలి

అదియె ఐకమత్యమునకాలంబనం

దేశపుటెల్లలు దాటి కావాలది విస్తరణం

పంచిన కొలదీ పెరిగేదీ

వంచనకది తల వంచనిదీ

ప్రతిఫలమేమీ కోరనిదీ

విశ్వ ప్రేమయై వెలుగునదే

మానవతను మించు హితము మతములలో లేదనీ

మతములన్నిటి తలపు సౌహార్ద్రమ్మేయని

మదిని నిండుగ నమ్మితే

విలసిల్లు విశ్వశాంతి

తొలగి పోవు విద్వేష వియద్ద్యూతి

# ప్రపంచ శాంతి

- సి.వి.ఆర్. సత్యశ్రీ

ప్రపంచ శాంతి – ఆకాంక్ష అందరిది!
మదిని ప్రశాంతత – ఉన్నదెందరికి?

పిల్లల నగుమోము చూసి సంతసింతురు కాని
కనరేమి ర్యాంకులకై చేసె పోరాట ఘోష
పెరిగి పెద్దయ్యాక అగుపడదు చేజారిన పసితనం
ఆహ్లాద బాల్యమె – వేయును ప్రపంచ శాంతికి బాట!!

ఒంటరి నిర్దాక్షిణ్యపు వృద్ధాప్యపు మరకలు
అంటవు, పట్టవు కాలానికి పరుగిడె వారసులకు
భీభత్సాలే జరుగును – అంతరాత్మల క్షోభతో
మనసు కల్లోలాలకు – పొంగుకొచ్చేను నదీనదాలు
వృద్ధుల సంతృప్తి నిండిన కన్నులె
ప్రపంచ శాంతికి నిండగు ఉషోదయం!!

తప్పు చెప్పిన వాని తన్ని తగలేయు కాలమిది
పరుల ప్రాణమంటె లెక్కలేదు విస్ఫోటక ప్రవృత్తికి
ధర్మాధర్మ బేధము, మంచి చెడులసలే లేవు
పైరు తొలిదశలో పురుగుమందు జల్లినట్లు, చిన్ననాటి
నుండి స్వచ్ఛత, సచ్ఛీలత, వినయ, విధేయతల
సువాసనలతో మనసులు నిండితే ప్రపంచపు అంబరాన
వెల్లివిరిసి పరుగులిడేను 'శాంతి' స్వేచ్ఛా విహంగమై!!

## శాంతి భారతం...?

- కొత్తపల్లి రాములు

కనిపించే తెల్ల మల్లెపూలు కల్ల
కలికాలం ఇది కలికాలం
కాటుక కారు చీకటి కప్పుకొని
కనపడకుండా కనుమరుగవుతున్నది...ఆ...శాంతి కపోతం

మచ్చలేని తెల్లని మనసుల నిండా
కల్మషాల రంగులు పులుముకున్న
కర్కషుల కాఠిన్యం ...ఓ ...అశాంతి వధ

అశాంతి ఆక్సిజన్ లా వ్యాపించి
భగభగమని మండిస్తుంది భంగపడ్డ భారతిని
బలి పీఠం ఎక్కిస్తుంది అశాంతి ధూతల భారతీయం

అశ్రుధారలతో దాహాన్ని తీర్చుకొనే ఓ అభాగ్య దరిద్రుడా
ధరణి భారతి దాహాన్ని తీర్చే దెవ్వడురా?
నా తల్లి భారతి శాంతి ఆకలిని తీర్చేదెవ్వరురా?

కుతంత్రాల కురుక్షేత్రం
ఆగిపోలేదురా .....!
దాని వారసత్వపు జాడలు
జవసత్వాలు నింపుకుంటున్నాయి....

నివురుగప్పిన నిప్పులా
రగులుకుంటూనే ఉంది
ఆ కురుక్షేత్ర భారతం
నేటికీ....ఈనాటికీ ...

కరుడుగట్టిన జాతిజనులు
అశాంతి ధూతలుగా
రణరంగపు రక్కసి
చంకనెక్కి సంబురపడుతున్నారు
ఆకసాన ఎగిరే
శాంతి కపోతాలు

వేటగాడి వేటుకు
గాయపడుతూనే ఉన్నాయి

అవని భారత హోమంలో
సమిధలౌతున్నాయి
శాంతి ధూతలౌతున్నాయి ...!

# విశ్వశాంతి - విశ్వప్రేమ

- ధూర్జటి

" సహనావవతు సహనౌభునక్తు – సహవీర్యం కరవాహహై

తేజస్వినా వధీ తమస్తు – మా విద్విషావహై...

ఓం శాంతిః శాంతిః శాంతిః"

అంటూ ప్రపంచానికి శాంతి వచనాలనందించిన కర్మభూమిగా భారతదేశానికి ఎంతోపేరు. అంతటి ఘనత గాంచిన భారతదేశ పౌరులుగా... ఆలోచిస్తే – ప్రపంచంలో అసలు శాంతిని కనుగొనగలమా? అంతెందుకు దేశంలో కనుగొనగలమా, దేశంలోనే కాదు, సమాజంలో, సమిష్టిగానే కాదు, ఒక్కవ్యక్తిని చిత్తశాంతితో బ్రతుకుతున్నాడని చెప్పగలమా?

ఓ విద్వాంసుడన్నట్లు ఒక ఈగ ఇల్లలలుక్కుంటూ తన పేరుని తన ఉనికినే మరచిపోయి అందరినీ అడగడం మొదలుపెట్టిందిట...

అలాగే మనిషికూడా తన ఉనికిని, తనదైన స్వాభావికమైన జీవతత్వాన్ని మరిచిపోయి ఉన్నచోటున కాక ప్రపంచమంతా గాలిస్తున్నాడు...

అవే...'శాంతి – ప్రేమ' అనే సుగుణాలు.

★★★

# వ్యక్తిగత శాంతి లేకుండా ప్రపంచ శాంతి ఒక మిథ్యే

- సద్గురు

**మీరు ప్రశాంత వాతావరణాన్ని సృష్టించేందుకు నిరంతరంగా పని చెయ్యకపోతే, ప్రతీ ఇల్లూ, ఇంటి చుట్టుపక్కల ఉన్న ప్రతీ ప్రదేశమూ ఒక యుద్ధ క్షేత్రం అయ్యే అవకాశం ఉంది**

**– సద్గురు.**

మానవులకు ప్రసాదింపబడిన శక్తి సామర్థ్యాలన్నింటి వలన, భూమి మీద ఉన్నఅంత్యంత సామరస్య జీవులు మానవులే అని మీరు అనుకోవచ్చు. కాని మీరు ఇప్పటివరకూ చరిత్ర చూసినట్లయితే, ప్రపంచం వాస్తవానికి ఎప్పుడూ శాంతియుతంగా లేదు. ప్రజలు ఆహారం కోసం, సంపదల కోసం, విశ్వాసం కోసం, నమ్మకాల వ్యవస్థల కోసం, సరిహద్దుల కోసం పోరాడుతూనే ఉన్నారు. మనం ఎప్పుడూ పోరాడటానికి ఒక సాకు ఏర్పరచుకుంటాము. ఇప్పుడు మనుషులు ఉన్న విధానం వల్ల, మీరు ప్రపంచంలోని ఒక సమస్యను తీసివేస్తే, వేరొకటి సృష్టించబడే అవకాశం ఉంది.

ప్రపంచమంటే ఒక గోళం కాదు. ప్రపంచం అంటే దాని ప్రజలు. మనం వ్యక్తిగత మార్పుకై కృషి చెయ్యకపోతే, మనం వ్యక్తిగత శాంతిని చేకూర్చే మార్గాలను అన్వేషించకపోతే, ప్రపంచ శాంతి గురించి మాట్లాడడం అనేది కేవలం ప్రపంచంలోని మరొక వినోదమే అవుతుంది.

ఇప్పుడు మనం ప్రపంచంలో కల్పిస్తున్న పరిస్థితిని చూస్తే, మనం ఈ గ్రహంపై శాంతి అన్నది లేకుండా చేసేందుకు పునాదులు వేసాము. దీనిలో అనేక అంశాలు ఉన్నాయి.

ఒక ముఖ్యమైన అంశం ఏమిటంటే మనం అర్ధశాస్త్రాన్ని మానవ జీవితంలోని అతి ముఖ్య భాగంగా చేస్తున్నాము. ఒకసారి మీరు ఆర్థికశాస్త్రాన్ని అతిముఖ్య విషయంగా చేస్తే, పోరాటం అనేది తప్పనిసరి. ఈ గ్రహంపై వనరులు పరిమితంగా ఉండడంవల్ల, మన జీవితాలు ఆర్థికం అనే ఇంజను చేత నడపబడడంవల్ల, యుద్ధం అనేది తప్పనిసరి, శాంతి అనేది అసాధ్యం అవుతుంది.

ఆర్థిక శ్రేయస్సును సాధించే ప్రయత్నంలో, నేటి సమాజాలు అపారమైన హింసతో నిండి ఉంటున్నాయి. అసలు మన ఉనికే హింసగా మారింది. అసలు మనం కదిలే విధానమే, జీవితంలో మనం పనులు చేసే విధానమే హింసగా మారుతోంది. అప్పుడప్పుడు అది వీధిపై ఒలికే అవకాశం ఉంది. మీరు మిమ్మల్నొక వ్యక్తిగా భావించి చూస్తే, రోజులో ఎన్ని క్షణాలు మీరు మీ ప్రక్కన కూర్చున్నవ్యక్తిని సంహించలేకుండా ఉన్నారు. మిమ్మల్ని మీరు వెనక్కు లాగిపట్టుకునే ప్రయత్నం కొంత కాలం మాత్రమే పని చేస్తుంది. ఎక్కడో ఒక చోట అది పేలుతుంది.

ఇప్పుడు విశ్వ సమాజం ప్రమాదకరమైన పునాదిపై కూర్చుంది. శాంతి అనేది ప్రజలు తమలోపల తాము కూడా రుచి చూడలేదు. ఇక మనం సాంఘిక మరియు ప్రపంచ పరిస్థితుల్లో ఎలా ఆశించగలం?

మనం ఈ ప్రపంచ సమాజం నిర్మించబడి ఉన్న పునాదులను మార్చేందుకు కృషి చెయ్యకపోతే, శాంతి అనేది సంభవం కాదు.

విశ్వ శాంతిని తెచ్చేది శాంతియుత మానవుల్ని ఉత్పత్తి చేసేందుకు చేసే ఒక జీవితకాల కృషే గాని, సూక్తులూ, నినాదాలు కాదు. మనం సమాజం యొక్క అన్ని స్థాయిల్లో శాంతియుత మానవుల్ని, తమలో ఏదో కొంత పరిపూర్ణత కలవారిని సృష్టించేందుకు కృషి చేస్తే, వారు తప్పకుండా సమాజంలోని పెద్ద భాగాలు శాంతిపూరితం అయ్యేలా చేస్తారు. శాంతి అంటే కేవలం యుద్ధాన్ని నివారించడం గురించే కాదు. శాంతి అంటే ప్రపంచంలో శాంతియుతంగా జీవించే ఒక క్రియాశీల సంస్కృతిని స్థాపించడం .

**అంతర్గత శాంతి యొక్క నిజ స్వభావం ఏమిటి?**

సాధారణంగా ఈ ప్రపంచంలో, ప్రజలు శాంతిని గురించి మాట్లాడేటప్పుడు, అది కేవలం వారి అహాన్ని ఏదోవిధంగా సంతృప్తి పరిచేందుకే అయివుంటుంది. ఈ శాంతి ఎందుకూ పనికిరాదు. ఇది శాంతి కాదు. శాంతి అంటే మీరు సృష్టించేది ఏదో కాదు. శాంతి అంటే జరిగేదేదో కాదు. శాంతి అంటే ఎల్లప్పుడూ ఉండేది. అసలు మన ఉనికే శాంతి. ఉపరితలంపై జరిగేదంతా అలజడే. శాంతి సముద్రం లాంటిది. సముద్ర ఉపరితలంపై కలత ఉంటుంది, కాని లోతుకు వెళితే అది పూర్తిగా ప్రశాంతంగా ఉంటుంది. మీరు ఆ లక్షణం మీలో కలిగి ఉంటేనే, మీకు నిజమైన శాంతి తెలుస్తుంది.

**విరోధాలకు మూలకారణం ఏమిటి?**

మీకు సజీవ అనుభవం కాని విషయాలను మీరు నమ్మడం మొదలుపెట్టిన క్షణం, మీరొక సహజ విరోధి అవుతారు. అసలు నమ్మడంలో జ్ఞానం ఏముంది? నమ్మడం వలన కేవలం మీ అహానికి సౌకర్యంగా ఉంటుంది. మీరు గర్వాన్ని పెంచుకునే ఒకే ఒక మార్గం ''నాకు తెలుసు" అనుకోవడం అవునా? "నాకు తెలియదు" అనడం అహానికి పెద్ద నష్టం. మీరు "నాకు తెలియదు" అన్నప్పుడు, మీరు గొడవ పడలేరు. అప్పుడు మీరొక చాలా అణకువగల, అద్భుతమైన మనిషి అవుతారు. చూడండి, మీరు నేడు చాలా శాంతిమయులు, మంచి వ్యక్తి కావచ్చు. కాని రేపు ఎవరైనా మీ నమ్మకాన్ని సవాలు చేసినప్పుడు, కోపం మీ లోంచి పుట్టుకొస్తుంది ఎందుకంటే మీరు నమ్మేదానితో మీరు చాలా లోతుగా గుర్తించబడి ఉంటారు. మీరు గుర్తించబడిన క్షణం, మీ గుర్తింపు మీ నమ్మకాల వ్యవస్థతో పాటు ప్రశ్నించబడుతూ ఉంటుంది. అప్పుడు మీ మనుగడ ప్రవృత్తి మిమ్మల్ని అధిగమిస్తుంది, ఇక మీరు పోరాడతారు. మనం ప్రపంచానికి

శాంతిని చేకూర్చడం గురించి మాట్లాడుతూ పోతున్నాము. నేను యునైటెడ్ నేషన్స్‌లో జరిగిన మిలీనియం పీస్ సమ్మిట్‌కు ప్రతినిధిగా వెళ్ళినప్పుడు, మేము మతాల మధ్య ఐకమత్యం, శాంతిని తేవడం గురించి మాట్లాడాము.

సహించాల్సిన, క్షమించాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? మీరు ఎవరిదో తప్పని, మీది ఒప్పని అనుకుంటారు. అప్పుడు మీరు అతను రక్షింపబడాలని అనుకుంటారు.

అతను మీరు రక్షింపబడాలని ఆలోచిస్తాడు. మీరు ఇరువురూ మీకు నిజంగా తెలియని విషయాలను నమ్ముతారు. మీరు "నాకు తెలియదు" అని గుర్తిస్తే, మీరు పోరాడలేరు. మీలోకి మీరు శాంతిని తీసుకువచ్చే సామర్థ్యం మీరు కలిగిలేనప్పుడు, ప్రపంచానికి శాంతిని తెచ్చే సామర్థ్యం మీరు కలిగివుండే మార్గమే లేదు, కదా?

**ప్రపంచ శాంతి ఒక వ్యక్తిగత బాధ్యత**

మీరు ఈ చిన్న మనస్సును శాంతిమయం చేయలేనప్పుడు, మీరు ప్రపంచాన్ని శాంతిమయం చేయగలరా? మీరు ప్రపంచంలో చూసేదంతా మీ మనసులో జరిగేదానిని ప్రతిబింబించే ఒక

పెద్ద ప్రదర్శనే. మీ మనసులో జరగనిది, ప్రపంచంలో జరిగేది ఏదైనా ఉందా? ఇప్పుడు ఈ యోగ శాస్త్రం అనేది లోనికి చూసే మార్గం. మీరు దేనితోనైనా గుర్తించబడితే, మీరు లోనికి చూడలేరు ఎందుకంటే మీరు గుర్తించబడిన క్షణం, అన్ని తలుపులు మీకు మూసుకుపోతాయి. మీరు ఆలోచించే, అనుభూతి చెందే విధానం మీరు దేనితో గుర్తించబడ్డారు అన్న దానిపై ఆధారపడుతుంది. ప్రస్తుతానికి, ఉదాహరణకి, మీరు మిమ్మల్ని "నేను అమెరికన్ని", అని గుర్తించారనుకోండి. ఇక అప్పుడు, ఒక పరిస్థితి ఏర్పడితే, మీరు అనుభూతి చెందే విధానం, దానికి స్పందించే విధానం ఒక నిర్దిష్ట పద్ధతిలో ఉంటుంది. ఆ క్షణంలో దేశ ప్రయోజనాన్ని బట్టి అలా ఉండటం మంచిదే కావచ్చు, కాని దానికి ప్రతిచర్య చేసే బదులు మీరు మరింత తెలివిగా స్పందించవచ్చు. మీరు గుర్తించబడినప్పుడు, మీరు కేవలం ఒక ప్రతి చర్యగా మారతారు. మీకు వేరొక విధంగా ఆలోచించే అవకాశం ఉండదు. మీకు అవతలి వ్యక్తి దృక్కోణాన్ని చూసే సామర్థ్యం ఉండదు. సమస్య ఎక్కడినుంచీ మొగ్గతొడుగుతోందో చూసే సామర్థ్యం మీకు ఉండదు. రు. మీరు అనేది లేదా మీ ప్రవర్తన మీ తెలివి నుంచీ రావడం మంచిది, ప్రతిచర్య నుంచీ కాదు. మీరు అనేది లేదా మీ ప్రవర్తన మీ జ్ఞానం నుంచీ రావాలంటే, మీరు మొదట విషయాలను వాటి గుర్తింపు ద్వారా కాకుండా, అవి కేవలం ఎలా ఉన్నాయో అలా చూడగలగాలి. మీరు దేన్నైనా ఒక గుర్తింపుతో చూసిన క్షణం, మీకు దాని గురించి పక్షపాతం ఉంటుంది. ధ్యానం అనేది మీరు మీ గుర్తింపును వదిలేసేటందుకు, మీరు నిజమైన శాంతిని అనుభూతి చెందేందుకు సహకరించే ఒక మార్గం.

మీరే శాంతిని సృష్టించండిమనం శాంతియుతంగా జీవించాలనే అనుకుంటాం. శాంతియుతమైన, ప్రేమ పూరితమైన ప్రపంచాన్ని నిజంగా సృష్టించాలనుకుంటే, మనం సృష్టించనూగలం. ప్రతి మనిషీ కోరుకునేది శాంతియుతంగా, ఆనందంగా జీవించాలనే. పరస్పర సంబంధాల విషయానికి వస్తే కూడా, తాను ప్రేమపూరితునిగా, ఆప్యాయతతో ఉండాలనే ప్రతి మనిషీ కోరుకుంటాడు. మరోమాటలో స్పష్టంగా చెప్పాలంటే, మనిషి కోరుకునేదంతా ఒక్కటే. తన లోపల, బయట, చుట్టూ అంతా ఆనందంగా, ప్రశాంతంగా ఉండాలనే. మీరు కోరుకునేది ఇదే అయితే, మనం దాన్ని సూటిగా నెరవేర్చవలసిన సమయం ఇప్పుడు ఆసన్నమైంది. దాన్ని సృష్టించడానికి మనం బద్ధులం కావలిసిన సమయమిది. దీని కోసం మనం చేయవలసిందల్లా ఒక్కటే. మనలో మనం శాంతియుతంగా, ఆనంద భరితంగా, ప్రేమపూర్వకంగా ఉండడమే. మనం నిజంగా కోరుకునేదాన్ని సృష్టించుకోవడం కోసం, మనల్ని మనం బద్ధుల్ని చేసుకున్నామనుకోండి. అప్పుడు మన మనసు కూడా క్రమబద్ధం అవుతుంది. ఒకసారి మన మనసు క్రమబద్ధం కాగానే, మన భావోద్వేగాలు క్రమబద్ధం అవుతాయి. ఒకసారి మన ఆలోచనలు, భావోద్వేగాలు క్రమబద్ధం అయిపోతే, మన ప్రాణ శక్తులు అన్నీ క్రమబద్ధం అయితే, ఏకంగా మన శరీరమే క్రమబద్ధం అవుతుంది. ఒకసారి ఈ నాలుగు అంశాలూ ఒక దిశగా క్రమబద్ధం అయితే చాలు. అప్పుడిక మనం కోరుకునే దాన్ని అవలీలగా సృష్టించగలుగుతాం. అప్పుడు మనమే ఎన్నో విధాలుగా సృష్టికర్తలం అయిపోతాం. అందుకని ఒక స్పష్టమైన ఆలోచనతో 'ఈ రోజు నేను ఎక్కడికి వెళితే అక్కడ, ఒక శాంతిభరితమైన, ప్రేమపూర్వకమైన ప్రపంచాన్ని సృష్టిస్తాను!' అనుకుని ముందుకు సాగండి, వ్యక్తిగతంగా శాంతిమయులు కండి, ప్రపంచశాంతిని సృష్టించండి.

★★★

# ప్రియమిత్రుడా!

- మోహన్ లాల్ కరంచంద్ గాంధీ

ప్రియమిత్రుడా!

కేవలం ఫార్మాలిటీ కోసం .. ఇలా సంబోధించడం లేదు!
33 ఏళ్ళుగా, విశాల విశ్వంలోని మానవులందరినీ
మిత్రులుగా భావించి ప్రేమించడం.. నా వృత్తి!
నాకు శతృవులు లేరు!!
మేము ఎలాంటి వాళ్ళకైనా మానసిక పరివర్తన కలిగిస్తాం!
అంతే కానీ యుద్ధ రంగంలోకి దిగి ఓడించం!!
మా దృష్టిలో `విజయం'అంటే
చంపడానికి దండెత్తి వస్తున్న వాళ్ళపై దయచూపడం!
ద్వేషభావం లేకుండా ప్రాణాలు అర్పించడం!!
మారణయుధ శాస్త్ర పరిజ్ఞానంలో మీరు
పరిణతిని సాధించి ఉండవచ్చు!
మరొకరు మీకన్నా ఎక్కువ సాధించి
మిమ్మల్ని హతమార్చవచ్చు!
అందుచేత..యుద్ధాన్ని ఆపి..శాంతిస్థాపన
చేయవల్సిందిగా అర్థిస్తున్నాను.

★★★

# ప్రపంచ శాంతి

**- తరిని సాయి పద్మనాభుని (పదవ తరగతి)**

అందరు ప్రజలు సంతోషంగా మరియు ప్రశాంతంగా జీవితాలను గడపాలంటే ప్రపంచ శాంతి ఎంతో అవసరము. వార్స్, బాంబు పేలుళ్ళ, గన్ కాల్పులు జరిగితే ప్రపంచ శాంతి నాశనం అవుతుంది. ప్రపంచం రెండు ప్రపంచ యుద్ధాలు చూసింది.

**మొదటి ప్రపంచ యుద్ధం :** ఇది యూరోప్ లో జరిగినది . 28 జులై 1914 న ప్రారంభమైంది మరియు 1918 వరకు కొనసాగింది. 9 బిలియన్ ప్రజలు మరణించారు . రెండు సమూహాల దేశాలు పోరాడాయి. ఒక సమూహం "Allies' లో యునైటెడ్ కింగ్డమ్, ఫ్రాన్స్ వున్నాయి ఇంకో సమూహంలో సెంట్రల్ పవర్స్ అఫ్ జర్మనీ మరియు ఆస్ట్రియా వున్నాయి. ఇది ఒక చాలా పెద్ద హింసాకాండ. ఈ యుద్ధం రెండో ప్రపంచ యుద్ధం వరకు "ప్రపంచ యుద్ధం" లేదా "గ్రేట్ వార్" (మహా సంగ్రామము) అని పిలిచేవారు.

**రెండో ప్రపంచ యుద్ధం (ప్రపంచ యుద్ధం – 2)** : ఇది యూరోప్ లో జరిగినది. ఇది 1939 నుండి 1945 వరకు కొనసాగింది. రెండు వర్గాల దేశాలు పాల్గొన్నాయి. వాటిలో ఒకటి "Allies" ఇంకొకటి "Axis". ఈ యుద్ధంలో 100 మిలియన్ ప్రజలు 30 విభిన్న దేశాల నుండి మరణించారు. ఈ ప్రపంచ యుద్ధానికి మూల కారణము 'హిట్లర్'– 'జర్మన్' రాజు.

కొలంబైన్ హై స్కూల్ మరియు విర్జీనియా టెక్ కళాశాలలు కాల్పుల ఊచకోతలు వంటివి కూడా ఉన్నాయి.

కొలంబైన్ హై స్కూల్ : కొలంబైన్ లో కొలంబియా హై స్కూల్ వద్ద ఏప్రిల్ 20 , 1999 న సంభవించింది . ఇది ఇద్దరు సీనియర్ విద్యార్థులు "ఎరిక్ హారిస్" మరియు "డైలాన్ క్లేబోల్డ్" తుపాకులతో చాలా పెద్ద ఊచకోత చేశారు. వారు మొత్తం 12 మంది విద్యార్థులు మరియు ఒక గురువు హత్య చేశారు.

వర్జీనియా టెక్ ఊచకోత : ఏప్రిల్ 16 , 2007 న సంభవించింది . "Seign – హుయ్ – చో " ఒక సీనియర్ వర్జీనియా టెక్ బాలుడు. 32 మందిని కల్చేశాడు మరియు 17 మందిని గాయపరిచాడు. మరో 6 మంది విద్యార్థులు స్కూల్ కిటికీలనుంచి తప్పించుకొని బయటపడుతూ వుంటే తీవ్ర మైన గాయాలు అయినాయి.

వర్జీనియా టెక్ మరియు కొలంబైన్ హై స్కూల్ సంఘటనలు నుండి మనము మారణ ఆయుధాలు తయారు చెయ్యడము, అమ్మడము మరియు వాడడము మానేయాలని తెలుస్తుంది.

ప్రపంచంలో అనేక బాంబు పేలుళ్ళు జరిగాయి. వాటిలో ప్రసిద్ధి గాంచింది హిరోషిమా మరియు నాగసాకి.

హిరోషిమా ఆగష్టు 6 , 1945 న బాంబుదాడి చేశారు మరియు నాగసాకి ఆగస్టు 9 1945 న బాంబు దాడి జరిగింది. ఇది జపాన్ లో జరిగింది . 'T ' ఆకారంలో ఉన్న 'Aioi ' వంతెన లక్ష్యంగా బాంబు పేలింది . 130,000 మంది హిరోషిమా బాంబు పేలుడు వల్ల మరణించారు మరియు 80000 మంది నాగసాకి బాంబు పేలుడు వల్ల మరణించారు.

9 / 11 2001 విమానంలో బాంబు పేలుడు మరియు 26/11 ముంబై, ఇండియా లో బాంబు పేలుడు, లాంటివి ఈ మధ్య జరిగిన

కొన్ని దారుణమైన బాంబు పేలుళ్ళు. ఇవి ప్రజల హృదయాలలో ఉద్రిక్తత కలిగించాయి. అందువలన మనము అణువస్త్రాలు తయారి, అమ్మకం మరియు ఉపయోగించడం మానేయాలి.

అహింస గాంధీజీ తత్త్వం . హింసతో ప్రపంచం పురోగతి చెందదు. ప్రజలు గాంధీ, నెల్సన్ మండేలా, మార్టిన్ లూథర్ కింగ్ మరియు లార్డ్ బుద్ధ వంటి మహానుభావల యొక్క అహింస సూత్రాలను పాటించాలి, అప్పుడే ప్రపంచ శాంతి కలుగుతుంది. ప్రజలు సుఖంగా జీవనము సాగిస్తారు.

మానవాళి ప్రశాంతంగా జీవనము సాగించిన, వారి శక్తియుక్తులు అన్నియు అభివృద్ధి దిశగా కేంద్రీకరింపబడుతాయి. తద్వారా ప్రజలు అందరు సుఖ శాంతులతో జీవనము సాగించగలరు. ఆరోగ్యము కూడా బాగు పడుతుంది.

**సారంశము**

1 . మానవాళి మారణ ఆయుధాలు తయారు చేయడము, అమ్మడము మరియు వాడడము నిషేదించాలి.

2 . ప్రజలు గాంధీ, నెల్సన్ మండేలా, మార్టిన్ లూథర్ కింగ్ మరియు లార్డ్ బుద్ధ పద్దతులు అనుసరించాలి .

3 . ప్రజలు భూమి, నీరు మరియు డబ్బు కోసం తగాదా పెట్టుకోకూడదు

4 . ప్రజల్లో దోపిడీ ఆలోచన ఆగిపోవాలి.

5 . అభివృద్ధి చెందిన దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు సహాయం చేయాలి

6. శాంతితో జీవనము గడిపే వారు ఆరోగ్యంగా జీవిస్తారు.

★ అన్ని డిక్షనరీల్లో గాంధీ = శాంతి, అహింస అని యాడ్ చేయండి!

– .రంగారావు, వైజాగ్

★ ప్రస్తుతం భూమిమీద ఉన్న ప్రతి జీవినీ .. లక్షసార్లు చంపడానికి అవసరమైనంత అణుశక్తిని మానవజాతి కూడబెట్టుకుంది!!

★ అణ్వస్త్రాలతో 60 నిముషాల్లో 300 మిలియన్ కంటే ఎక్కువమందిని చంపచ్చు, వీటిని నిషేధించాలి!! – జాన్ F కెన్నడీ!

★ ఇంతమంది ఇక్కడ ఉండి.. ఏమీ చేయకపోవడం ఏంటి? – నిర్మన్ బొర్లాగ్, యు.ఎస్.ఏ

★ మానవాళి ఎటు వెళ్ళాలో ప్రవచించాడు జీసస్ 'ఎలా' వెళ్ళాలో ఆచరించి చూపించాడు గాంధీజీ!

★ పంజాబ్ లో 50 వేల మంది సాయుధులు చేయలేనిపనిని ఒక బక్కపలుచటి మనిషి చేసి, శాంతిని నెలకొల్పాడు

– గాంధీ గురించి మౌంట్ బాటన్

★ ప్రేమను, శాంతిని పంచే ఆధునికతే సంప్రదాయం ఈ రెండింటి కోసం సామాజిక న్యాయాన్ని సాగుచేయాలి– గాంధీజీ

★ మనుషులకు పట్టాల్సింది యుద్ద పిశాచం కాదు! శాంతి దైవత్వం! – గాంధీజీ

# నా ఉద్దేశంలో విశ్వశాంతి

- తాటిపాముల మృత్యుంజయుడు

'యుద్ధం' అనే పదానికి వ్యతిరేకార్థం ఏమిటని అడిగితే 'శాంతి ' అంటారు. యుద్ధం మరియు శాంతి ఒకదానికొకటి ముడివేసుకొన్నాయనే అపార్థం గోచరిస్తున్నది. యుద్ధం, అలజడి మొదలైతేనే శాంతి చర్చలు ప్రారంభమవుతాయన్నది మనకు విదితమే. మహాభారతంలో కూడా భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య పర్వాలలో మాహాయోధులు మరణం చెందాకా, స్త్రీ పర్వంలో తల్లుల, భార్యల రోదనలు, శోకాలు పూర్తయ్యాకా, శాంతిపర్వం మొదలవుతుంది. అంటే యుద్ధానికి ముందు అంతా శాంతిగానే ఉంటూందని మనం చెప్పుకోవచ్చా? 'శాంతి ' కి అసలు నిర్వచనం ఏమిటి? ఈ కోణంలో మనం కొన్ని విషయాలు ముచ్చటించుకొందాం.

శాంతి అనేది రెండు దేశాలకు, సంఘాలకు, ఇద్దరు మనుషులకు, అలాగే మనిషి అంతర్గతానికి వర్తించవలసిన విషయం. యురేనియంలోని ఒక పరమాణువు విభజింపబడ్డప్పుడు విడుదలయ్యే శక్తితో మరిన్ని పరమాణువులు ఛేదింపబడుతూ అణుబాంబు విస్ఫోటనానికి కారణభూతమైనట్టు, మనిషిలో కలిగే అలజడి వల్లనే అశాంతి మొదలౌతుంది. అలా మొదలైన అశాంతి ఇతరుల మీద, పరిసరాల మీద ప్రభావం చూపుతుంది. అయితే మనిషి ఎప్పుడు ప్రశాంతంగా ఉండగలుగుతాడు? అతను జ్ఞానవంతుడైనప్పుడు అని సమాధానం చెబుతున్నాయి శాస్త్రాలు.

'నహి జ్ఞానేన సదృశం' అన్న ఉవాచ ప్రపంచంలో జ్ఞానానికి మించినదిలేదని అర్థం. మరి అంతటి ఉచ్ఛ స్థితిలో ఉన్న జ్ఞానాన్ని ఎలా సంపాదించుకోవచ్చు? మనిషి వివేకవంతుడు ఎలా అవుతాడు? అన్న ప్రశ్నలు ఉదయించక మానవు.

వివేకానందుని బోధనల ప్రకారం – ఈ ప్రపంచంలో ఇప్పటి వరకు పొందిన జ్ఞాన సంపద మనిషి మెదడులోంచి ఉద్భవించిందే. కాబట్టి మానవుని మస్తిష్కం అనంతమైన జ్ఞాన గ్రంథాలయం.

శాంతి అనేది మనసులో ఉద్భవిస్తుంది, దాన్ని బయట వెదుక్కోవడమనేది వృధా ప్రయాస అని బుద్ధుడు అంటాడు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత నారాయణరెడ్డి 'విశ్వంభర 'లో ఇలా అంటాడు. "సృష్టికి మూలం; జ్ఞాన బీజం; విశ్వంభరభ్రమణానికి మూలం; శాశ్వతచైతన్య తేజం".

మెదడు సంధింపబడిన పంచేంద్రియాల ద్వారానే మనం జ్ఞానం సంపాదిస్తున్న విషయం మనందరికి అనుభవైకమే. వివిధ నమ్మకాల ప్రకారం మనందరం ఏదో ఒక కారణం వల్ల జన్మ పొందిన వారమే. పూర్వ రాష్ట్రపతి, తత్వాచార్యుడు, భారతరత్న సర్వేపల్లి రాధకృష్ణ ప్రతి మనిషి ఈ జన్మలోనే ఇంకో జన్మ (ద్వైత జన్మ) ఎత్తాలంటాడు. ఆ జన్మయే భయం నుండి స్వాతంత్ర్యం పొందడం, శాంతి మరియు శక్తివంతమైన స్థితిని చేరుకోవడం, ప్రేమను పంచడం మరియు కార్యాచరణకు పూనుకోవడం.

సమర శంఖాన్ని పూరించి శత్రువులను తులనాడటానికి కురుక్షేత్రం చేరుకున్న అర్జునుడు బంధువులను చూసి అస్త్రసన్యాసం చేయగా ఎంతగా 'జ్ఞానబోధ ' చేయవలసి వచ్చిందో మనం భగవద్గీత ద్వారా తెలుసుకుంటూనే ఉన్నాం. వివిధ మతాలు చేసే బోధనలు ఎక్కడైతే ఆగిపోతాయో అక్కడి నుండి జ్ఞానాన్వేషణ మొదలౌతుంది అంటారు 'యోగభారతి ' వ్యవస్థాపకుడు ఎన్. వి. రఘురాం.

'Pacifism' శాస్త్రం ముఖ్యోద్దేశం శాంతి కాముకత, యుద్ధాన్ని నివారించడం. ఆ శాస్త్ర ప్రకారం ఒక మనిషి ఎప్పుడు వివేకవంతునిగా పరిగణింపబడతాడంటే ఆ మనిషి జ్ఞానాన్ని నేర్చుకోవడం, నేర్చుకున్న జ్ఞానాన్ని సత్యశోధన చేసినప్పుడు.

'చాచా నెహ్రూ' చిన్నపిల్లలను సంభోదిస్తూ ఎన్నో ఉత్తరాలు రాసాడు. అలాంటి ఒక ఉత్తరంలో ఇలా రాస్తాడు. 'పెద్దవాళ్లు తాము చాలా తెలివిగల వాళ్లమనే విధంగా ప్రవర్తిస్తుంటారు. ఒక్కొకప్పుడూ ఇతరులు చెప్పే మాటలు విని నేను కూడా వివేకవంతుణ్ణని అపార్థానికి లోనౌతాను. మన దేశానికి లభించిన మహనీయుడు బాపూజీ. ఆయన గొప్ప జ్ఞాని. కాని, అతడు జ్ఞానాన్ని ఎపుడూ ప్రదర్శించుకోలేదు. ఏ సందర్భలోనూ విజ్ఞానులు తమ తెలివితేటల గురించి ప్రస్తావించరు.'

అంటే నిగర్వం కూడా జ్ఞానవంతుల లక్షణమన్నమాట. అందుకే వేమన అంటాడు – "అలలు లేని జలధి వలె నుండి మదిలోన; దెలివిగూడి తన్ను తెలియునతడే; తలప సజ్జనుడని ధర జెప్పదగుజుమీ".

**ధ్యాయతో విషయాన్ పుంసః సంఘః తేషు ఉపజాయతే**
**సంఘాత్ సంజాయతే కామః కామాత్ క్రోధః అభిజాయతే**

**క్రోధాత్ భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమః**
**స్మృతి భ్రంశాత్ బుద్ధి నాశః బుద్ధి నాశాత్ ప్రణశ్యతి**

పైన పేర్కొనబడిన రెండు శ్లోకాలు భగవద్గీతలోనివి. మనిషి ప్రాపంచిక విషయాలపై ధ్యానం చేస్తే, వాటితో బంధం పెచుకుంటాడు. బంధం పెచుకున్న కొలది వాటిని పొందాలనే కోరిక కలుగుతుంది. కోరికలు తీరకపోవడం కోపానికి కారణం అవుతుంది. కోపం వల్ల మతి భ్రమిస్తుంది. తుదకు విచక్షణా జ్ఞానం కోల్పోయి వినాశనానికి దారి తీస్తుందని అర్థం.

భయాన్ని పారద్రోలి, కోరికలను జయించి, మిత్రుడిని, శత్రువుని ఒకే భావంతో చూసి, సంతోష, శోక సమయాల్లో తటస్థంగా ఉండే మనిషి శాంతి పొందగలుగుతాడు అని భగవద్గీత చెబుతున్నది. మనందరం చిన్నప్పుడు నేర్చుకొన్న సుమతీ శతక పద్యం కూడా అదే చెబుతుంది – "తన కోపమె తన శత్రువు; తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ; తన సంతోషమె స్వర్గము; తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ"

మనం ఇంతవరకు మనిషి, మనసు, అంతర్గత శాంతి గురించి తెలుసుకున్నాం. మరి సంఘంలో, రాజ్యంలో అతని పాత్ర ఏమిటో కొంత ముచ్చటించుకొందాం.

మనిషి గొప్పా, సంఘం గొప్పా? అని ప్రశ్న వేసుకుంటే సంఘమే గొప్పంటాడు గ్రీకు తత్త్వవేత్త, ప్లేటో. మనిషి సంఘంలో జీవించినప్పుడే అతనిలో మానవత్వం పెంపొందుతుంది. అప్పుడే పుట్టిన బిడ్డను సంఘానికి దూరంగా, నిర్మానుష్య ప్రదేశంలో పెంచి చూస్తే తేడా ఏమిటో తెలుస్తుందని ప్లేటో అంటాడు.

కమ్మరిపని చేయాలంటే ఆ పనితనం తెలిసుండాలి. అలాగే ఇతర పనులు కూడా. మరి దేశాన్ని నడిపించాలంటే నాయకులు జ్ఞానవంతులై ఉండాలంటాడు 'The Republic' అనే గ్రంథంలో ప్లేటో. నిస్వార్థపరులై, ప్రజల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ పరిపాలించాలి. అవసరమైతే వారికి శిక్షణ ఇవ్వాలంటాడు. అలాంటి

వారినే ప్రజలు ఎన్నుకోవాలంటాడు. మరి నేటి నాయకులో? వారిలో ఏ లక్షణాలను చూస్తున్నారు? వారిని పార్టీలు ఏ ప్రాతిపదికపై ఎన్నికల్లో నిలపెడుతున్నాయి? ఇలాంటి ప్రశ్నల సమాధానాలు నేతి బీరకాయలో నెయ్యిని వెదుక్కోవడం అవుతుంది..

అందుకే ' విశ్వంభర 'లో ఇలా అంటాడు నారాయణరెడ్డి గారు. “అనురాగం చేసే శాసనమే; అసలైన రాజనీతి; సమరాన్ని నిరసించిన సామ్రాట్టు; శాంతి శిఖరానికి అడుగుమెట్టు”

ఓం శాంతిః శాంతిః శాంతిః!

★★★

# సంప్రదాయమే – శాంతికి మూలం.

**- విద్వాన్ తిరుమల పెద్దింటి. నరసింహాచార్యులు.**

**"సర్వేపి సుఖినః సంతు/ సర్వే సంతు నిరామయాః**

**సర్వే భద్రాణి పశ్యంతు/ మాకశ్చిత్ దు:ఖమాప్నుయాత్"**

"అందరు సుఖంగా ఉండాలి, ఆపదలు లేకుండా,భద్రంగా ఉండాలి, ఎవరు దు:ఖపడకూడదు." మానవ ప్రపంచమేకాదు! "లోకా:సమస్తా: సుఖినోభవంతు" అన్నిలోకాలు సుఖశాంతులతో ఉండాలి. అనేదే మన భారతీయ సంప్రదాయం. అట్టి సంప్రదాయాలను గూర్చి ఋషులు చెప్పిన కొన్ని మాటలని ఈ వ్యాసం ద్వారా తెలుసుకొందాం.

మన సనాతన భారతీయ సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలూ, నిత్య నూతనాలు. సుఖ,శాంతులకు ఆలంబనాలు. "అద్దంలో చూసి బొట్టు పెట్టుకొంటే చక్కగా కుదురుతుంది." లేకుంటే వంకరగా ఉంటుంది. అలాగే మన పెద్దలు చెప్పిన సంప్రదాయాలను ఆచరిస్తూ, పయనిస్తే "మన నడవడి ఇతరులకు ఒరవడి అవుతుంది" సంప్రదాయం అనేది ఓ నదీప్రవాహం వంటిది. అరణ్యాలు ఆటంకం కలిగించినా, పర్వతాలు అడ్డు నిలచినా, ఆగకుండా ప్రవహించు జీవనదివలె సంప్రదాయం మానవజాతి ఉన్నన్నినాళ్ళు, జీవితాలలో అంతర్ వాహినిగా ప్రవహిస్తూనే ఉంటుంది. కాల గమనంలో క్రొత్త, క్రొత్త పద్ధతులే పాతబడి సంప్రదాయాలుగా మారుతాయి. 'సం' 'ప్ర' 'దాయం' ఇది రెండు ఉపసర్గలతో కూడిన పదం. సంక్రమించుట అని దీని అర్థం.

మన పెద్దల నుండి, ఋషుల నుండి, శృతి, స్మృతి, పురాణాల నుండి, వేదోపనిషత్తుల నుండి మనకు లభించిన అమూల్య నిధి ఈ సంప్రదాయం. ఇది ఆత్మవంటిది. సమాజంలో శాస్త్ర, సాంకేతిక పరంగా ఎన్నిమార్పులు జరిగినా, అలవాట్లు, ఆచారాలు, అనుభవాలు, ఆనందాలు, జీవన స్థితిగతులలో నవ్యత సంతరించుకొన్నా, సంప్రదాయం మాత్రం నిలిచే ఉంటుంది. సాహిత్యంలో కూడా ఎన్నిమార్పులు జరిగినా, అనగా వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, కావ్యాలు, ప్రబంధాలు, నాటకాలు, నవలలు, కథలు, కథానికలు, గేయాలు, వచన కవిత్వాలు, నానీలు, వ్యాసాలూ, అభ్యుదయ, విప్లవ, దిగంబర వంటి అనేక ప్రక్రియలలో మార్పు చెందినా, ఎట్టి మార్పు చెందకుండా సంప్రదాయం "ఆకాశ హర్మ్యాలకు పునాదిలా" నిలిచే ఉంటుంది. "సంప్రదాయం, సంస్కరణ, సంస్కృతి, సమాజం" ఇవి ఒక దానికి ఒకటి విడదీయరానివి. వీటిని ఆచరించక పోతే మన జీవితాలు వ్యర్థంగా, నిస్సారంగా, నిష్ఫలంగా, కంటక ప్రాయంగా, నిరంతర సంఘర్షణలతో అశాంతిగా గడుస్తాయి అనుటలో సందేహమేలేదు.

"మృత్ పిండమేకం బహుభాండ రూపం" అనగా మట్టిముద్ద ఒకటే, కాని కుండల రూపాలు అనేకాలు.అన్నట్లు దేశ, కాల, ప్రాంతాలననుసరించి పద్ధతులు మారినా మారనిది సంప్రదాయ మొక్కటే. అదే మన భారతీయ జీవన విధానానికి జీవగర్ర.(ప్రాణం వంటిది.)

**"రామో విగ్రహవాన్ ధర్మ:"** అని ధర్మాన్నిరామునిచే ఆచరింప జేసి, మనం కూడా అలా ఆచరించాలని బోధించిన రామాయణం కాని, **"ధర్మేచ, అర్థేచ, కామేచ,మోక్షేచ భరతర్షభయదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్"** అని పురుషార్థాలని పాత్రల ద్వారా ప్రదర్శింప జేసి "భారతంలో ఏది చెప్పబడిందో అదే సమాజంలో ఉందని, ఏది చెప్పబడలేదో అది బైట లేదని బోధించిన మహాభారతం కాని, "శ్రీకైవల్య పదం" చేరటానికి సులభమైన భక్తి మార్గాన్ని

చూపెట్టిన భాగవతంకాని మన గమనానికి "కరదీపికల" వంటివి. అంతేకాదు మనం ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో తెలియజెప్పి, "సంప్రదాయ బద్ధంగా" పయనిస్తే కలిగే లాభాలను "అరటి పండు ఒలిచి చేతిలో పెట్టినంత" సులభంగా వివరించాయి.

అతిధి మర్యాదలు, పెద్దల యెడ చూపించ వలసిన భక్తి భావం, భూతదయ, పరోపకార పరాయణత్వం, ఋజు వర్తనం స్నాన, సంధ్యాది అనుష్టానాలు, వస్త్రధారణ, జప, తపాది నియమాలను నిర్దేశించడం ద్వారా నేటి సమాజంలో కరువైన మానసిక ప్రశాంతతని, సంతృప్తికర జీవితాన్ని ప్రసాదించిన సంప్రదాయ మార్గాన్ని అనుసరించడమే మన తక్షణ కర్తవ్యం. అదే శాంతికి మూలం.

**" ధర్మ యేవ హతో హంతి / ధర్మో రక్షతి రక్షితః /**
**తతో ధర్మో నహంతవ్యః / ఏష ధర్మ స్సనాతనః"** అని ధర్మ శాస్త్ర గ్రంధం వివరిస్తుంది.
మనం ధర్మం తప్పి ప్రవర్తిస్తే, మనల్ని అది రక్షించదు. ధర్మాన్ని కాపాడితే ( ఆచరిస్తే) అది మనల్ని కాపాడుతుంది. చిన్న ఉదాహరణ ద్వారా దీన్ని తెలుసుకొందాం.

పెద్దలయెడ గౌరవ మర్యాదలు, వినయ, విధేయతలు, క్రమశిక్షణ కలిగి ఉండడం మనధర్మం. దానిని అతిక్రమించి యాదవులు ఎలా నాశనమయ్యారో తెలిపే కథ భాగవతం లో ఉంది. అది-" కొంతమంది ఋషులు శ్రీకృష్ణ దర్శనార్థం నందవ్రజమునకు వస్తారు. వారిని ఆట పట్టించడానికి కొంతమంది యాదవ బాలురు సాంబుడు అనే పిల్లవానికి గర్భవతిలా ఆడవేషం వేసి, ఋషుల వద్దకు తీసుకు వెళ్లి "ఈమెకి ఎవరు పుడతారు" అని ఎగతాళిగా అడుగుతారు. విషయం గ్రహించిన ఋషులు కోపంతో "వీడి గర్భాన "ముసలం"(రోకలి) పుట్టి యాదవ కుల నాశనానికి కారణం అవుతుంది." అని శపిస్తారు. వెంటనే రోకలి పుడుతుంది. పిల్లలు భయపడి బలరామునితో ఈ విషయం చెపుతారు. అపుడు బలరాముడు ఆ రోకలిని పిండి చేసి ఆ పొడిని నదిలో కలిపిస్తాడు.

నీళ్ళల్లో కలిసిన ఆ పొడి ఒడ్డుకు కొట్టుకొని వచ్చి రెల్లుగడ్డిగా మొలుస్తుంది. అదే యాదవ నాశానానికి కారణం అవుతుంది. పొడి చేయగా ఆ రోకలిలో చిన్నముక్క మిగులుతుంది. సూదిగా ఉన్న ఆ ముక్కని ఓ బోయవాడు తన బాణానికి చివర ములుకుగా కడతాడు. ఆ
బాణమే శ్రీకృష్ణ నిర్యాణానికి కారణం అవుతుంది. (యాదవ నాశనానికి, భారత యుద్ధానంతరం శ్రీకృష్ణునికి గాంధారి ఇచ్చిన శాపం కూడా ఒక కారణం.) పెద్దలను గౌరవించనందువల్ల కలిగిన నష్టం ఇది. కనుక పెద్దలను గౌరవించడం మన సంప్రదాయం. అందుకనే పెద్దలకి, భగవంతునికి సాష్టాంగ నమస్కారం (పురుషులు) పెట్టాలి. అంటే రెండు పాదాలు, రెండు మోకాళ్ళు, రెండు భుజాలు, వక్షస్థలం, నుదురు మొత్తం ఎనిమిది అంగాలు నేలకి తగిలేటట్లు చేసి నమస్కరించడమే స+అష్టాంగ = సాష్టాంగ నమస్కారం అని శాస్త్రం. అలా చేస్తే మంచి జరుగుతుంది.

ఇలాంటి ఎన్నోవిశేషాలు మన పూర్వ గ్రంథాలలో ఋషులు పొందుపరచారు. అవి పఠించి ఆచరించడం మనకర్తవ్యం. లేకుంటే "అజాగళస్తన న్యాయం"లా మనజీవితం వ్యర్థమై ద్విపాద పశువులా మిగిలి పోతాము.

పిల్లలు పెద్దలయెడ అమర్యాదగా ప్రవర్తిస్తే కలిగిన నష్టాన్నిభాగవత కథ వల్ల తెలుసుకొన్నాం.

ఇపుడు పెద్దలు పెద్దల యెడ అమర్యాదగా ప్రవర్తిస్తే కలిగే నష్టం ఎట్టిదో "భారత కథ" ద్వారా తెలుసుకొందాం.

"అభిమన్యుని కుమారుడు పరీక్షిత్తు. తల్లి గర్భం లోనే శంఖ చక్ర గదాధారి అయిన ఆ పరమాత్మను దర్శించి, పుట్టిన వెంటనే అందరిలోనూ ఆ పరమాత్మ రూపం ఉందేమో అని పరీక్షగా చూడటంవల్ల "పరీక్షిత్తు" అని పేరుపొందిన పరమ భక్తుడు, పాండవుల తర్వాత రాజై రాజ్యాన్ని చక్కగా పాలిస్తూ కలిపురుషునే శాసించిన ధీశాలి అయిన పరీక్షిత్తు. ఓ తొందరపాటు చర్యవల్ల మరణానికి ఎలాచేరువయ్యాడో ఈకథ తెల్పుతుంది.

ఒక రోజు పరీక్షిత్తు వేటకి వెళ్తాడు. జంతువులను తరుముతూ పరివారానికి దూరమైపోతాడు, అతడికి దాహంవేస్తుంది. దగ్గరలో ఓ ఆశ్రమం కనబడుతుంది. అక్కడకి వెళ్తాడు. తపస్సమాధిలో ఉన్న శమీకుడనే ఋషి తప్ప అక్కడ ఇంకెవరుఉండరు. దాహం తీరడానికి నీళ్లిమ్మని పదే పదే అడుగుతాడు. ఆ ముని ఉలకడు, పలకడు. అంత గొప్ప పరీక్షిత్తు కూడా, దాహార్తి వల్ల కలిగిన కోపంతో, ప్రక్కనే చచ్చి పడి ఉన్న పాము కళేబరాన్ని ఆ ముని మెడలో వేసి వెళ్లిపోతాడు. ఆ శమీకునికి "శృంగి" అనే కొడుకు ఉన్నాడు. తండ్రికి జరిగిన అవమానాన్ని మిత్రుల వల్ల తెలుసుకొని "ఎవరైతే సర్ప కళేబరాన్ని నా తండ్రి మెడలో వేసాడో అతడు వారంలోగా తక్షకుడనే పాముచే కరవబడి మరణిస్తాడు." అని శపిస్తాడు. అంతగొప్ప రాజు కూడా కోప కారణంగా పెద్దలకి అపకారం చేసి, శాపోపహతుడౌతాడు. (కోపం అన్ని అనర్థాలకి మూలం. కనుకనే గీతాచార్యుడు **" క్రోధాత్ భవతి సమ్మోహ: /సమ్మోహాత్ స్మృతి విభ్రమః/ స్మృతిభ్రంశాత్ బుద్ధి నాశః/బుద్ధి నాశాత్ ప్రణశ్యతి."** అని కోపంవల్లకలిగే నష్టాన్ని చక్కగా తెలిపాడు.)

కాని ఆధునిక కాలంలో పెద్దలను గౌరవించే సంప్రదాయాన్ని మరచి, వారిపై విసుగుని, కోపాన్నికూడాప్రదర్శిస్తున్నాం. అది మన పద్ధతి కాదు. "స్త్రీ, బాల, వృద్ధులను" గౌరవించడం మన సంప్రదాయం. ఇలా ఎన్నో విషయాలను మన ప్రాచీన సంప్రదాయ సాహిత్యం ద్వారా తెలుసుకొని ముందుకు సాగితే మన జన్మ చరితార్థమౌతుంది.

స్త్రీలని గౌరవించడం మన సాంప్రదాయం. ప్రహ్లాదుడు "కన్నుదోయికి అన్యకాంతలడ్డంబైన మాతృ భావము జొచ్చి మరలువాడు" అని పోతన వివరిస్తాడు. సీతని పరాభవించి రావణుడు, ద్రౌపదిని అవమానపరచి కౌరవులు ఎలా నాశానమయ్యారో మనకి తెలుసు. ఇన్ని తెలిసినా, ప్రగతి పథంలో పయనించే ఈ ఆధునిక యుగంలో నవ నాగరిక సమాజంలో కార్యాలయాల్లో, కళాశాలల్లో, అన్నిచోట్లా స్త్రీలు వేధింపబడటం శోచనీయం. చాటింగులు, డేటింగులతో, సెల్ ఫోను సంభాషణలతో యువత విచ్చలవిడిగా సంచరిస్తూ, లేత వయస్సులోనే విషయ వాంఛలకు లోబడి జీవితాలను నాశనం చేసుకోడం చూస్తూనే ఉన్నాం. స్త్రీలపై యాసిడ్ దాడులు, గొంతులు కోయడాలు, అత్యాచారాలు ఇలా ఎన్నోదురాగతాలు సమాజంలో జరగడానికి కారణం క్రమశిక్షణా లోపమే.

ఎంత చదువు చదివినా,ఎంత విజ్ఞానం సంపాదించినా, "అరణ్యరోదనన్యాయంలా"పనికి రాకుండా పోతోంది.

అసమానతలు తొలగి, అభిజాత్యాలు మరచి, అందరు సుఖశాంతులతో జీవించాలన్నా, సమతా, మమతా, మానవతలు సమాజంలో వెల్లివిరియాలన్న- ఒక్కటే మార్గం.అది మన సంప్రదాయాలని

పాటిస్తూ, పెద్దలు చెప్పిన మార్గంలో పయనించడమే. నువ్వు నేను కలిస్తే మనం. మనం, మనం కలిస్తే జనం. జనం జనం కలిస్తే దేశం. దేశాల సమూహమే ప్రపంచం. ప్రపంచం సుఖ శాంతులతో ఉండాలంటే, పెద్దలు చెప్పిన మంచి మార్గంలో నడవడమే పునాది.

"ప్రతి ఇంట్లో దేవుడు అమ్మరూపంలో ఉన్నాడు" కనుకనే "మాతృదేవోభవ" అని వేదాలు బోధించాయి. అలాగే "మనువు." మనుస్మృతిలో స్త్రీలను గూర్చి ఎంతగొప్పగాచెప్పాడో చూడండి--

**యత్ర నార్యస్తు పూజ్యంతే / రమంతే తత్ర దేవతాః /**

**యత్రైతాస్తు నపూజ్యంతే /సర్వాస్తత్రాఫలాక్రియః.**

"ఎక్కడ స్త్రీలు పూజింప బడతారో,అక్కడ దేవతలు నివసిస్తారని, ఎక్కడ పూజింప బడరో అక్కడ కార్యాలన్నీ నిష్ఫలాలని" తెల్పి, **"స్త్రియః శ్రియశ్చ గేహేషు. / నవిశేషోస్తి కశ్చన."** స్త్రీలు గృహంలో గృహలక్ష్ములే, ఇంతకన్నా వేరే విశేషపదం లేదని స్త్రీని కీర్తిస్తాడు. అందుకనే వివాహ సమయంలో కన్యాదాత **"లక్ష్మీ నామ్నీం కన్యాం లక్ష్మీనారాయణ స్వరూపాయ వరాయ దదాతి."** అనిచెప్పి కన్యాదానం చేస్తారు. తమ ఇంటబుట్టిన ఆడపిల్లని తండ్రి, సోదరులు బాగా చూసుకోవాలని, అమ్మాయికి కావలసినవి సమకూర్చాలని మనువు ఎంతో విపులంగా వివరిస్తాడు.

**" పితృభి: భ్రాతృభిశ్చైతాః పతిభిర్దేవరైస్తథా: /**

**పూజ్యా భూషయితవ్యాశ్చ / బహు కళ్యాణమీప్సుభి:"**

అనగా తండ్రి, భర్త,సోదరులు అందరు స్త్రీలని గౌరవించాలని, వారు కోరిన భూషణాలు, వస్త్రాలు ఇచ్చి సంతృప్తి పరచాలని చక్కగా వివరిస్తాడు. స్త్రీకి పురుషుడు సదా అండగా ఉండాలని మనుధర్మ శాస్త్రం బోధిస్తుంది. ఇదే అర్థంలో

**" పితారక్షతి కౌమారే / భర్తారక్షతి యౌవ్వనే / రక్షంతి వార్ధకే పుత్రా: / నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి."**

చిన్నతనంలో తండ్రి, యౌవ్వనంలో భర్త, వార్ధక్యంలో పిల్లలు రక్షణ కల్పించాలి అని, రక్షణ లేకుండా ఉంచకూడదని మనువు స్త్రీలకి అధిక ప్రాధాన్యతనిస్తే, మనువుని, ప్రాచీన సంప్రదాయాలని ఇష్టపడని ఆధునిక వితండవాదులు కొందరు పై శ్లోకం మొత్తం గ్రహించకుండా చివరి పాదం "నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి" అన్నది మాత్రం గ్రహించి, " మనువు స్త్రీలకి వ్యతిరేకి, స్త్రీలకి స్వేచ్ఛలేదన్నాడని" వాదిస్తారు. అట్టి వారికి ఎంత నచ్చ చెప్పినా "మహాబధిర శంఖారావ న్యాయంలా" వినరు, తమ ప్రవర్తన మార్చుకోరు. అస్తు.

వారిని అలాగే వదిలేద్దాం.

వినేవారికే మనం కొన్ని మంచి మాటలు చెప్దాం. బాల్యం నుండే మంచి అలవాట్లు, సత్ సంప్రదాయాలు నేర్పిస్తే, భావి తరాలైనా బాగుపడతాయి. ( అదే ఈ వ్యాసకర్త కోరిక! మన్నిస్తారు కదూ.)

స్త్రీలని గూర్చి మనువు ఇంకా ఇలా చెప్తాడు.

**"శోచంతి జామయోయత్ర / వినశ్యత్యాశు తత్కులం /**

**నశోచంతితు యత్రైతా /వర్ధతే తద్ధిసర్వదా"**

అనగా ఆడపడుచులు ఏయింట సోదరులచే ఆదరించ బడతారో ఆయింట వంశం వర్ధిల్లుతుంది. లేదా నశిస్తుంది.అనితెలిపి,

**"తస్మానేతాన్సదా పూజ్యాః / భూషనాచ్ఛాదనాశనై**

**భూతికామైర్నరైర్నిత్యం / సత్కారేషూత్సవేషుచ."**

తమ ఇంట పండుగలు శుభకార్యాలు జరుపుకోనేటప్పుడు, ఆడపడుచులను పిలచి మంచి భోజనం పెట్టి, వస్త్రాలు,భూషణాదులనిచ్చి సంతృపప్తి పరచాలని చాలా విపులంగా,

చక్కగా మనుస్మృతి వివరిస్తుంది. కనుకనే పండగ రోజులలో కూతుళ్ళని, అల్లుళ్ళని పిలచి, ఉన్నంతలో వారికి కట్నకానుకలిచ్చి సంతృప్తి పరచే "సంప్రదాయం"మనం పాటిస్తున్నాం. ఇలా శృతి, స్మృతి, పురాణాలలో, వేదాలలో, ఉపనిషత్తులలో స్త్రీకి ఎంతో ఉన్నత స్థానం కల్పించబడింది.

ఇక భార్యాభర్తల సంబంధం గూర్చి ఎంత గోప్పగా చెప్పారో చూడండి.——

"వివాహ సమయంలో "సప్తపది" అనే తంతులో చదివే మంత్రాలలో ఒకమంత్రం ఇలా తెలపుతుంది.

**" సఖా సప్త పదాభవ, సఖావౌ సప్త పదా బభూవః,**

**సఖ్యంతే గమేయం, సఖాత్తేమాయోషం,**

**సఖ్యాన్మేమాయోష్టా:"**

అనగా ఈ ఏడడుగుల బంధంతో భార్య, భర్తలమైన మనం ఇకపై స్నేహితులగా ఉంటూ, పరస్పరం స్నేహ భావాన్ని విడవకుండా పయనిద్దాం. ఎంత ఉదాత్తమైనభావన! **"ఆపత్సు మిత్రం జానీమః"** కష్టాలలో ఆదుకొను వాడే మిత్రుడు. అట్టి మిత్రభావంతో భార్యాభర్తలు ఉంటే, వారి మధ్య కలతలు, కార్పణ్యాలు, ఆవేశకావేశాలు, అసమానతలకు తావు లేకుండా నిత్య వసంతంలా వారి జీవితం సాగిపోతుంది. ఇంకా——

**" సంతుష్టో భార్యయాభర్తా / భర్తా,భార్యా తథైవచ /**

**యస్మిన్నేవ కులేనిత్యం /కళ్యాణం తత్రవై ధృవం"** అనగా

భార్యా,భర్తలు పరస్పరం ఒకరిని, ఒకరు గౌరవిచుకొంటూ, ప్రేమానురాగాలతో సంతుష్టులుగా ఉంటారో ఆయిల్లు నిత్యకల్యాణం, పచ్చతోరణంగా విలసిల్లుతుంది" అని

**"యదిహ స్త్రీనరోచేత / పుమాంసంన ప్రమోదాయేత్ /**

**అప్రమోదాత్ పునః పుంసః / ప్రజనం నప్రవర్తతే."** భావం——

భార్యని భర్త కష్టపెడితే, ఆభార్య భర్తకి సహకరించదు. అపుడు ఆ ఇంట వంశం వర్థిల్లదు. అని వివరించి,

**అనుకూల కళత్రోయః / తస్య స్వర్గ ఇహైవహి /**

**ప్రతికూల కళత్రస్య / నరకో నాత్ర సంశయః / అని,**

**"స్త్రియాంతు రోచమానాయాం / సర్వం రోచతేకులం /**

**స్త్రియామరోచమానాయాం / సర్వమేవ నరోచతే."**

"భార్యలు అనుకూలంగా ఉండి, సంతోషంగా ఉంటే ఆ గృహం స్వర్గమే. లేకుంటే నరకమే." ఇలా ఎన్నోవిధాలుగా వేలవేల సంవత్సరాలకు పూర్వమే స్త్రీలకి అధిక ప్రాధాన్యత ఇవ్వబడింది, అని మన ప్రాచీన

సాహిత్యం తెలుపుతోంది. మరి ఈ కాలంలో స్త్రీలు అన్నిరంగాలలో ముందుకు దూసుకు వెళ్తున్నారని గొప్పగా చెప్పుకొంటున్నాము. కాని నానాటికి ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతోంది. పుట్టేది ఆడపిల్ల అని తెలిస్తే కడుపులోనే వారిని కడతేరుస్తున్నాం.

**"పున్నామో నరకాత్ త్రాయత ఇతి పుత్రః"**

అని, మొగవారికి ఇచ్చినంత ప్రాధాన్యత ఆడపిల్లలకి ఇవ్వలేకపోతున్నాము. ఆధునికులు కొందరు పిల్లలకి స్వేచ్ఛ ఉండాలని తలచి వారికి స్వేచ్ఛనిస్తే, ఆ స్వేచ్ఛని "బ్రహ్మకైనపుట్టురిమ్మతెగులు" అన్నట్లుండె విపరీత వస్త్రధారణ, (క్షమించాలి ఇలాంటివి, పాశ్చాత్య నాగరికతకు వర్తిస్తుందేమో కాని భారతీయ సంప్రదాయానికి, మన స్థితిగతులకు వర్తించదు. అని తెల్పడమే తప్ప, ఎవరిని కించపరచే ఉద్దేశ్యం కాదు అని రచయిత మనవి.) సెల్ ఫోను సంబాషణ, చదువు పేరుతో ఇంటికి ఆలస్యంగా వస్తూ, బైకులపై షికారులు చేస్తూ కాలాన్నిదుర్వినియోగ పరుస్తూ, పతనమయే యువతను కూడా మనం చూస్తున్నాం. ఈ విధానంలో ఆడపిల్లలే ఎక్కువగా నష్టబోతున్నారు.

విసుగు,కోపం, అలజడి, మానసిక అశాంతి, అసంతృప్తి, భార్యా, భార్తల మధ్య అవగాహనా రాహిత్యం, పిల్లల్ని సరిగా పట్టించుకోనందున అధిక స్వేచ్ఛవంటి అవగుణాలు సమాజంలో పెరుగుతూ,సంబంధ, బాంధవ్యాలను తెంచుతూ, యాంత్రిక జీవన విధానాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. కారణం——ప్రాచీన సంప్రదాయాలని, పెద్దల మాటలని పట్టించుకోకుండా "కొత్తవింత పాత రోత" అని తలంచడమే అని విజ్ఞుల అభిప్రాయం.

ఉదయకాల ఉషోదయాలని తిలకిస్తూ, పచ్చని చెట్లు, పక్షుల కిలకిలారావాలు, వికసించే పుష్పాలు, వాటిలోని పుప్పొడి పై నుంచి వచ్చే చల్లని పిల్లగాలుల సుఖస్పర్శలు, వెన్నెల రాత్రులలో నదీ సైకత వేదికపై విహారాలు, పచ్చని కంబళ్ళు పరచినట్లుండే పర్వత సానువుల సోయగాలు తిలకిస్తూ, కదిలేమబ్బుల్ని,ఎగిరే కొంగలబారుల్నిచూస్తూ, దేవాలయాల ఘంటా నాదాల్ని, గుడి గోపుర గుహలలోని పావురాయి కువకువలు వింటూ, ఒడ్డును తాకి విరిగి,ఒరిగే సముద్ర కెరటాలని, పసిపాపల నవ్వుల్నీ, పతంగాల(గాలిపటాల) విహారాలని, రంగు రంగుల సీతాకోక చిలుకల్ని, నీలి మేఘాలలో, గాలికెరటాలలో దోబూచులాడే నిండు పున్నమి చంద్రుణ్ణి, ఎలమావి చివురులు మెసవి కూసే పిక కూజితాలని, "ఆగండాగండి! అసలు విషయం వదలి ఏదో కవిత వ్రాస్తున్నాను అనుకొంటున్నారు కదూ?" కాదండి బాబూ——

ప్రకృతిలోని ఇంత మంచి అందాలని,ఆనందాలని హాయిగా అనుభవించమని పరమాత్మ మనకిస్తే, ప్రకృతిని కలుషితం చేస్తూ,మనం ఇంకేదో కావాలని, లేనిదాని కోసం, తెలియని దాని కోసం పరితపిస్తూ, పరిభ్రమిస్తూ కాలాన్ని మన మేధని, విజ్ఞానాన్ని, వృధా పరుస్తూ నిస్సారంగా బ్రతికేస్తున్నాం. అలా కాకుండా శృతి, స్మృతి, వేదోపనిషత్తులలో చెప్పిన విషయాలను చదివి ఆకళింపుజేసుకుని, మన సంప్రదాయాలని ఆచరిస్తే జగమంతా సుఖ శాంతులతో, "నిత్యకళ్యాణం పచ్చతోరణంగా" విలసిల్లుతుంది అనుటలో సందేహంలేదు.

# వెళ్ళొస్తానండీ!

- సత్యం మందపాటి

నిశిరాత్రి. ఒంటి గంట దాటిందేమో ఒళ్లంతా చెమటలు పడుతుంటే చటుక్కున మెలుకువ వచ్చింది జగన్నాధానికి. గొంతు పిడచగట్టుకుపోతున్నది. నెమ్మదిగా లేచి కూర్చున్నాడు. లేచి నిలబడటానికి కొంత సమయం పట్టింది.

పక్కనే రాజ్యం ఒళ్ళు మరిచి నిద్రపోతున్నది. లేపుదామనుకున్నాడు కానీ, అంత గాఢ నిద్ర పోతున్న రాజ్యాన్ని అర్ధంతరంగా లేప బుద్ధికాలేదు. నిద్రలో కూడా ఆమె ముఖం ఎంతో సౌమ్యంగా, అందంగా వుంది.

నెమ్మదిగా లేచి బాత్రూంకి వెళ్లి, వస్తుంటే కళ్ళు తిరిగినట్టయింది. గుండెల్లో కొంచెం నొప్పిగా కూడా అనిపించింది. అక్కడే వున్న డైనింగ్ టేబుల్ దగ్గర కుర్చీని ముందుకు లాక్కుని, గ్లాసులో మంచినీళ్ళు పోసుకుని త్రాగుతూ కూర్చున్నాడు జగన్నాధం.

ఏమిటో రానురానూ శరీరంలో సత్తువ తగ్గిపోతున్నది. మరి వచ్చే సంవత్సరం ఈసరికి తొంభై ఏళ్లు నిండుతాయి. అయినా అప్పుడప్పుడూ వయసు వల్ల వచ్చే చిన్నచిన్న అనారోగ్యాలు తప్పించి ఎంతో ఆరోగ్యంగా వున్నాడు. రాజ్యమూ అంతే. తనకన్నా రెండేళ్ళే చిన్న. ఆమెలో చురుకుతనం బాగా మందగించింది కానీ, భయపడాల్సిన అనారోగ్యమేమీ లేదు.

రాత్రి పూట వెలిగించే చిన్న దీపపు గుడ్డి వెలుతురులో అక్కడ గోడ మీద వున్న ఫోటోలో నవ్వుతున్న కొడుకు మాధవని చూస్తే, పెద్దవాడయిపోయినా ఇంకా తనకి చిన్న పిల్లాడిలాగానే కనిపిస్తాడు. ఫోటోలో మాధవ పక్కనే అతని భార్య సుధా, ఇద్దరు పిల్లలూ. పిల్లలలో తన భార్య రాజ్యం పోలికలు బాగా కనిపిస్తూనే వున్నాయి.

తనకి వున్న ఆస్తిపాస్తులూ, స్వంత ఇల్లూ, పక్క పోర్షన్ మీద వచ్చే అద్దె, పెన్షన్ తమ అవసరాలకి సరిపోతుంది. కాకపోతే ఒకటే బెంగ. ఎంతో దూరంలో అమెరికాలో వుంటున్నారు, ఒక్కగానొక్క కొడుకు, అతని సంసారం. ఎంతో ప్రేమగా వున్నా మరీ దూరాభారం. రాకపోకలు తగ్గిపోయాయి. మొదట్లో ఐదేళ్లకొకసారి ఇండియాకి వచ్చేవాళ్ళు, సంసారం పెద్దదవటం వల్లా, పిల్లల చదువులవల్లా ఇప్పుడు ఎనిమిదేళ్ళకొకసారి వస్తున్నారు. వాళ్ళని చూసి కనీసం ఆరేళ్ళయిందేమో. తమని అమెరికాకి రమ్మంటాడు కానీ, అంత ప్రయాణం చేయటం కష్టమని ఆ ఆలోచనే పెట్టుకోలేదు.

కొంచెం తేరుకున్నాక, లేచి వెళ్లి మంచం మీద పడుకున్నాడు. రాజ్యం వీపు మీద చేయి వేసి దగ్గరకు తీసుకున్నాడు. ఆవిడలో కదలిక లేదు. అతనికి అనుమానం వచ్చి, 'రాజ్యం రాజ్యం' అంటూ కుదిపి చూశాడు. అయినా ఆవిడ కదలలేదు.

చటుక్కున లేచి, లైటు వేసి ఆమె గుండెల మీద చేయి వేసి చూశాడు. గుండె కొట్టుకుంటున్నది. శ్వాస ఆడుతున్నది. కొంచెం నీళ్ళు చేతిలోకి తీసుకుని ఆవిడ ముఖం మీద చిలకరించాడు. ఆవిడ కదలలేదు. వణుకుతున్న చేతులతో ఫోన్ చేసి, అంబులెన్సుని పిలిచాడు. 'రాజ్యం. నన్ను వదిలిపెట్టి వెళ్ళకు' అని కనీసం పదిసార్లు అనుకున్నాడు. పైకి అన్నాడు.

అంబులెన్సు రావటం, అక్కడే కావలసిన పరీక్షలు చేయటం, ఆసుపత్రిలో చేర్చాలని చెప్పి, ఇద్దరినీ ఆసుపత్రికి తీసుకుపోవటం చకచకా జరిగిపోయింది.

అంతకుముందే ఈ హడావిడి చూసి పక్కింటి ప్రసాద్ బయటికి ఆదుర్దాగా వచ్చాడు 'ఏంజరిగింది' అంటూ.

చూడగానే ఆయనికి అర్ధమయింది. 'మీరు అంబులెన్సులో ఆవిడతో వెళ్ళండి. నేను మీ వెనకే కారులో వస్తాను' అన్నాడు జగన్నాధం భుజం మీద చేయివేసి.

జగన్నాధాన్ని బయటే బల్ల మీద కూర్చోబెట్టి ఆవిడని హడావిడిగా స్ట్రెచర్ మీద ఎమర్జెన్సీ గదిలోకి తీసుకు వెళ్ళారు. రామనాధం మనసు మనసులో లేదు. రాజ్యం తనని ఏకాంతంగా వదిలేసి వెళ్ళిపోదుకదా! రాజ్యం లేకుండా తను ఎలా బ్రతకగలడు. ఎప్పుడూ అంటూనే వుండేది, ఇది నేర్చుకోండి, అది నేర్చుకోండి అని. ముఖ్యంగా వంట. నేను లేకపోతే మీరెలా వుండగలరో అర్ధంకావటం లేదు అనేది.

'పోనీ నేనే ముందర పోతాన్లే' అనేవాడు తను.

అతని నోటి మీద తన వేలు అడ్డం పెట్టి 'అలా ఎప్పుడూ అనకండి. నేనే మీకన్నా... నేను పోతే మీరు వుండలేరు. పోనీ ఇద్దరం ఒకేసారి పోదాం...' అనేది.

ఆలోచనలు ముసురుకుంటున్నా ఆయన చూపులు మాత్రం మూసివున్న ఎమర్జెన్సీ గది తలుపు మీదే వుంది. ఈ లోగా పక్కింటి ప్రసాద్ వచ్చాడు. 'ఎలావుంది అమ్మగారికి' అంటూ.

లోపల వుంది అన్నట్టు చేయి చూపించాడు జగన్నాధం.

'ఏమి ఫరవాలేదు. ఈ హాస్పిటల్లో ఎంతో మంచి డాక్టర్లు వున్నారు. తగ్గిపోతుంది' ప్రసాద్ ధైర్యం చెప్పాడు.

ఒక గంట గడిచాక డాక్టర్ బయటికి వచ్చాడు. 'ఒక్కసారి మీరు లోపలికి రండి' అన్నాడు.

జగన్నాధం ఆయనతోపాటే లోపలికి వెళ్లాడు. రాజ్యం మంచం మీద పడుకుని వుంది. కళ్ళు మూసుకునే వున్నాయి. చేతి ద్వారా సెలైను, ముక్కు ద్వారా ఆక్సిజనిస్తున్నారు.

'ఆవిడకి స్ట్రోక్ వచ్చింది. అంటే పక్షవాతం అని కాదు, అలాటిదే. మెదడుకి వెళ్లవలసిన నరాల్లో రక్త ప్రసరణకి అడ్డం వచ్చింది. అందుకే ఆవిడ స్పృహ కోల్పోయింది. పూర్తిగా కోమాలోకి వెళ్ళే అవకాశాలు వున్నాయి కానీ, అలా కాకుండా వుండటానికి తగిన మందులు ఇచ్చాం. చూద్దాం. ఏమవుతుందో. ఈలోగా అప్పుడప్పుడూ కొంచెం స్పృహ తెలుస్తున్నది ' అన్నాడు.

'అంటే.. ప్రాణ భయం... ' అంటున్న జగన్నాధం చేతిని తన చేతిలోకి తీసుకుని, 'ప్రస్తుతానికి ఫరవాలేదు. మనం ఇచ్చే వైద్యానికి ఆవిడ ఎలా కోలుకుంటుందో అన్నదాని బట్టి మీరడిగిన దానికి జవాబు చెప్పగలం. ఆవిడ దగ్గర మీరు ఒంటరిగా కూర్చోండి. నేను పది నిమిషాల్లో వస్తాను' అని ఆయన వెళ్ళిపోయాడు.

జగన్నాధం ఆమె పక్కనే మంచం మీద కూర్చుని, ఆవిడ చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. ఆమె చెవి దగ్గర నోరు పెట్టి, నెమ్మదిగా రాజ్యం రాజ్యం అని పిలుస్తున్నాడు.

ఆయన చేతిలోని ఆవిడ చేయి నెమ్మదిగా కదిలింది. చురుక్కున ఆమె ముఖంలోకి చూశాడు జగన్నాధం.

బలవంతంగా కళ్ళు తెరవటానికి ప్రయత్నం చేస్తున్నది.

'రాజ్యం! ఎలావుంది' అన్నాడు ఆవిడ నుదుటి మీద మృదువుగా నిమురుతూ.

ఏదో చెప్పబోయింది కానీ, నోటికి ట్యూబులు అడ్డం వుండటంతో సరిగ్గా మాట బయటికి రాలేదు. కానీ మా.. మా.. మామ.. అంటున్నదని అర్ధమయింది.

'మాధవని రమ్మని చెప్పనా.. ఇవాళే అమెరికాకి ఫోన్ చేస్తాను' అన్నాడు.

ఆవిడ ముందు అవునని తలవూపింది. మళ్ళీ కాదని తలవూపింది. ఇంకా ఏదో చెప్పబోయింది కానీ చెప్ప లేకపోయింది.

జగన్నాధం 'మాధవని ఇవాళే పిలుస్తాను. నువ్వు మాత్రం త్వరగా కోలుకో. వాడు వచ్చేసరికీ మనం ఇంటికి వెళ్లిపోవచ్చు' అన్నాడు.

ఆమె తల వూపుతూనే నిద్రలోకి జారుకుంది.

డాక్టర్ వచ్చి ఆవిడని అక్కడినించీ ఇంటెన్సివ్ కేర్ గదిలోకి మారుస్తున్నట్టు చెప్పాడు.

ఆయన చెబుతుండగానే, స్ట్రెచర్ తెచ్చి ఆవిడని ఇంకో గదిలోకి మార్చారు.

కొంచెం సర్దుకున్నాక డాక్టర్ వచ్చి బ్లడ్ ప్రెషర్ మొదలైన వేవో చూశాడు.

అంతా అయాక 'ఆవిడ ఎలాగూ నిద్రపోతున్నది. మీరు ఎప్పుడో అర్ధరాత్రి వచ్చారు కదా. ఇంటికి వెళ్లి అక్కడ పనులు చూసుకుని మధ్యాహ్నం వచ్చేయండి. మేము ఆవిడని జాగ్రత్తగా చూసుకుంటాం" అన్నాడు.

ప్రసాద్ జగన్నాధాన్ని ఇంట్లో దించి, 'ఇప్పుడే మళ్ళీ వస్తాను. శాంత ఇడ్లీలు చేస్తానంది తీసుకువస్తాను' అంటూ వెళ్ళిపోయాడు.

జగన్నాధం కాలకృత్యాలు తీర్చుకునే లోగానే ఇడ్లీలు, కాఫీ తీసుకువచ్చాడు. 'మధ్యాన్నం భోజనం మా ఇంట్లోనే చేశాక, మిమ్మల్ని హాస్పిటల్లో దించుతాను' అంటూ ఎలా వచ్చాడో అలా వెళ్ళిపోయాడు.

ooo

జగన్నాధం అమెరికాలోని కొడుకు మాధవకి ఫోన్ చేసి, విషయం చెప్పాడు. మాధవ ముందు చాల బాధ పడ్డాడు. తర్వాత నెమ్మదిగా 'పిల్లాడికి పరీక్షలున్నాయి నాన్నా. అంతేకాదు మా ఆఫీసులో కూడా ఆడిట్ వుంది.

ఇప్పుడు రావటం కష్టం. తర్వాత చూద్దాం. ఈలోగా డబ్బులు ఏమన్నా కావాలంటే చెప్పండి పంపిస్తాను' అన్నాడు.

అతని మాటలకి నొచ్చుకున్నాడు జగన్నాధం. "డబ్బులేమీ అక్కర్లేదు నాన్నా. నీ వీలు చూసుకునే రా' అన్నాడు.

ఇలాటి సందర్భంలోనే రాజ్యం ఒకసారి చెప్పిన మాటలు ఆయనకి గుర్తుకొచ్చాయి.

'ఇరవై, పాతికేళ్ళ వయసులో స్త్రీ పురుషుల మధ్య వుండేది ఆకర్షణ. దాంతో వాళ్ళు దగ్గరవటం, పెళ్లి చేసుకోవటం, పిల్లలు పుట్టటం జరుగుతాయి. తర్వాత వారి జీవితం పిల్లల చుట్టూ తిరుగుతుంది. వాళ్ళని పెంచి పెద్ద చేయటం, చదువులు చెప్పించటం, ఆరోగ్యవంతులుగా చేయటం... ఇలా కాలం గడిచిపోతుంది. వాళ్ళు కూడా చదువులు పూర్తిచేసుకుని, ఉద్యోగాలు వెతుక్కుని, పెళ్లి చేసుకుని, వాళ్ళ బ్రతుకులు వాళ్ళు బ్రతకటానికి వెళ్ళిపోతారు. అప్పుడే

మనం ఒకరికి ఒకరుగా మిగిలిపోతాం. మంచిగానీ చెడుగానీ ఒకరి మీద ఒకరు ఆధార పడటం, నిజమైన ప్రేమ, అనురాగం వాళ్ళని ఇంకా దగ్గరకు చేరుస్తాయి' మరి ఇప్పుడు తను అదే పరిస్థితిలో వున్నాడు. ఇప్పుడు కొడుకు వాడి పిల్లల పెంపకంలో వాడున్నాడు. మరి తనకి రాజ్యం, రాజ్యానికి తను మాత్రమే ఆసరా!

ప్రసాద్ ఇంట్లో భోజనం చేసి, తను హాస్పిటల్లో రూముకి వచ్చేసరికే మధ్యాహ్నం రెండు గంటలయింది. రాజ్యం ఇంకా నిద్ర పోతూనే వున్నది. నర్స్ మాత్రం హడావిడిగా తిరుగుతున్నది. 'మా ఆవిడ ఎలా వుంది?' అడిగాడు జగన్నాధం, గదిలోనించీ బయటికి వచ్చి.

'ఆవిడ కోమాలోకి వెళ్ళిపోయారు. ఇప్పుడే డాక్టర్ గారికి కబురు చేశాం. ఆయన వస్తున్నారు' అంది నర్స్.

వెన్నులో వణుకు వచ్చింది జగన్నాధానికి. కాళ్ళు తడబడుతున్నాయి. కళ్ళు తిరుగుతున్నట్టు అనిపించింది. వెంటనే అక్కడే వున్న కుర్చీలో కూర్చున్నాడు.

డాక్టర్ రాగానే ఆయనా, ఆయనతో పాటూ ఇంకో ఇద్దరు డాక్టర్లూ లోపలికి వెళ్లి తలుపు వేసుకున్నారు.

జగన్నాధానికి అంతా గాబరాగా వుంది. కదలకుండా అలానే కూర్చున్నాడు. మధ్యమధ్యలో ఎవరో ఆ గదిలోనించీ వస్తున్నారు, పోతున్నారు. ఏవేవో తీసుకువెడుతున్నారు. కానీ ఆయన్ని ఎవరూ పట్టించుకోవటం లేదు.

ఒక గంట గడిచాక అందరూ బయటికి వచ్చారు.

డాక్టర్ జగన్నాధాన్ని చేయి పట్టుకుని గదిలోకి తీసుకు వెళ్లి, రాజ్యం మంచం పక్కనే వున్న కుర్చీలో కూర్చోబెట్టాడు.

'మీకు నేను మంచి వార్త ఏమీ చెప్పలేకపోతున్నాను. ఆవిడ కోమాలోకి జారుకున్నారు. మెడ దగ్గర నించీ మెదడులోకి వెళ్ళే రెండు నరాల్లో పెద్ద బ్లడ్ క్లాట్స్ వున్నాయి. వాటివల్ల మెదడులోకి రక్త ప్రసరణ బాగా తగ్గిపోయింది. ఆపరేషన్ చేసే స్థితి కూడా దాటిపోయింది. ఇక్కడే అమెరికానించీ వచ్చిన ఒక స్పెషలిస్ట్ కి కూడా చూపిద్దామను కుంటున్నాను. అప్పటిదాకా ఆమెని లైఫ్ సపోర్ట్ సిష్టం మీద పెడుతున్నాము. అంటే ఆవిడ ప్రాణాన్ని తాత్కాలికంగా నిలబెడుతున్నామన్నమాట' అన్నాడు.

నెమ్మదిగా అడిగాడు జగన్నాధం. 'మరి ఇలా కోమాలోకి వెళ్ళినవాళ్ళు దాంట్లోనించి బయటికి వచ్చినట్టు కూడా విన్నాం కదా' అన్నాడు.

ఆయన చిన్నగా నవ్వాడు. 'అక్కడా ఇక్కడా ఒకటి అరా జరిగాయి కానీ, అది చాల వేరే కారణాల వల్లా, వాళ్ళ అదృష్టం వల్లా. అందుకే అలా అవదు అని నేను చెప్పను. అలా అయితే మనందరికీ మంచిదే కదూ. కానీ ఈవిడ ఆ కోమాలోనించీ బయటికి రావటం సాధ్యమవుతుందని అనుకోను. కానీ నా తృప్తి కోసం, మీకోసం రేపే ఆ డాక్టర్ గారిని తీసుకువచ్చి చూపిద్దాం. మీరు ఇవాళ ఇక్కడ వుండి చేసేదేం లేదు. ఎంతసేపు కావాలంటే అంతసేపు కూర్చుని ఇంటికి వెళ్ళండి. రేపు ఉదయం ఆ డాక్టర్ వచ్చే సమయానికి, దాదాపు పదిగంటలకి రండి. లైఫ్ సపోర్ట్ లో ఆవిడని వుంచటమా, తీసివేయటమా అన్న నిర్ణయం కూడా తీసుకుని వస్తే మంచిది' అని, అయన చేతిని మెత్తగా వత్తి వెళ్ళిపోయాడు.

జగన్నాధం రాజ్యం చేతిని పట్టుకుని అక్కడే మంచం మీద కూర్చున్నాడు. రాజ్యం, రాజ్యం అని పిలుస్తూనే వున్నాడు. కళ్ళు

తెరుస్తుందేమోననే ఆశతో ఆమె ముఖంలోకి మళ్ళీ మళ్ళీ చూస్తున్నాడు. 'ఆశ మానవ జీవితానికి శ్వాస' అన్నాడు సాహిత్యకారుడు ఆరుద్ర. ఆ ఆశతోనే సమయం కూడా గమనించకుండా రెండు గంటలు ఆవిడని ఆపకుండా పిలుస్తూ అలానే కూర్చున్నాడు జగన్నాధం.

ప్రసాద్ వచ్చి అంతా అర్ధం చేసుకున్నాడు. 'మనం ఇక ఇక్కడ చేసేదేమీలేదు. వెళ్లి రేపు పొద్దున్నే వద్దాం పదండి' అన్నాడు. ఆయన చేయి పట్టుకుని తీసుకువెళ్ళాడు.

ఆ రోజు రాత్రి జగన్నాధం కొడుకుకి మళ్ళీ ఫోన్ చేశాడు. విషయం అంతా చెప్పాడు. 'నాకేం చేయాలో తెలియటం లేదురా మాధవా. రాజ్యం మనల్ని వదిలిపెట్టి ఎక్కడికీ వెళ్ళదు. మళ్ళీ స్పృహలోకి వస్తుందని నాకు తెలుసు. అందుకే రేపు ఆ కొత్త డాక్టర్ లైఫ్ సపోర్ట్ తీసేద్దామన్నా నేను ఒప్పుకోను. నువ్వేమంటావ్?' అడిగాడు.

మాధవ ఒక్క క్షణం ఆలోచించి 'అది అంత మంచి నిర్ణయం కాదేమో నాన్నా. గుండె కొట్టుకుంటున్నా మెదడు పని చేయనప్పుడు లాభం లేదు. అమెరికాలో అలాటి పరిస్థితిలో మనిషి చనిపోయినట్టే లెఖ్క' అన్నాడు.

జగన్నాధం మాట్లాడలేదు. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

'అంతేకాదు నాన్నా! హాస్పిటల్లో వుంచితే చాల ఖర్చు అవుతుంది. అదికాక మీరీ వయసులో హాస్పిటల్ చుట్టూ తిరగలేరు. ఆలోచించండి' అన్నాడు.

అయన నెమ్మదిగా అన్నాడు 'నువ్వు వెంటనే రాగలవా మాధవా!' నువ్వు వస్తే నాకు ధైర్యంగా వుంటుంది అని అనుకున్నాడు కానీ పైకి అనలేదు.

మాధవ అన్నాడు 'ప్రయోజనం వుంటుందని నేను అనుకోను నాన్నా. అదికాక అమ్మని ఒక రకంగా నా మనసులో పదిలంగా దాచుకున్నాను. కోమాలో వున్న అమ్మని అలా చూసి, ఆ భావాన్నీ, ఆ అనుభూతినీ మార్చుకోవటం మంచిది కాదనుకుంటాను'

'సరే నీ ఇష్టం మాధవా' అని ఫోన్ పెట్టేశాడు జగన్నాధం.

ఒక అరగంట అలా ఆలోచిస్తూ కూర్చున్నాడు జగన్నాధం. ఆయనకి మొదటినించీ ఒక అలవాటు వుంది. తన తండ్రి అతనికి ఎన్నో మంచి సలహాలు ఇచ్చి బాధ్యత వున్న వ్యక్తిగా తీర్చిదిద్దాడు. ఎప్పుడైనా తనకి ఏదయినా క్లిష్ట సమస్య వస్తే, ఆయన పోయినా కూడా ఆయనని తలుచుకుని నాన్న ఇలాటి సమస్యని ఎలా పరిష్కరించేవాడా అని ఆలోచించి పరిష్కారం వెతుక్కునేవాడు.

బీరువాలో ఒక సంచీలో తండ్రి చిన్నప్పుడు తనని ఒళ్ళోకూర్చోబెట్టుకుని ఆడిస్తున్న ఫోటో, స్వదస్తూరితో వ్రాసి ఆయన సంతకం పెట్టి వ్రాసిన ఉత్తరాలకట్ట బయటికి తీశాడు. వాటిని తడుముతూ ఆయన్ని గుర్తుచేసుకున్నాడు. ఆయన ఫోటో వెనకాలనే కొత్తగా వ్రాసిన ఇంకొక ఉత్తరం కూడా వుంది. అది రాజ్యం వ్రాసినది.

ఆ ఉత్తరం అక్కడికెందుకు వచ్చిందో అర్ధం కాని జగన్నాధం, ఆశ్చర్యపోతూ ఆ కాగితం తెరిచాడు.

"నిన్ననే మనిద్దరం మాట్లాడుకుంటున్నప్పుడు, 'నేను లేకపోతే మీరెలా వుండగలరో అర్ధం కావటం లేదు' అన్నాను. మీరు నవ్వుతూ 'పోనీ నేనే ముందరపోతాన్లే' అన్నారు. 'అమ్మో! మీరు వెళ్ళిపోతే నేను

బ్రతకగలనా? అందుకే ఇద్దరం ఒకేసారి పోదాం' అన్నాను నేను. అలా అన్నామే కానీ, అదేదీ మన చేతుల్లో లేదు కదా..."

జగన్నాధానికి చటుక్కున స్ఫురించింది, రాజ్యం హాస్పిటల్లో చెప్పిన చివరి మాటలు.. మా.. మా.. మా.. మ అని. అంటే మాధవ గురించే కాదు, మామగారి ఉత్తరాల కట్ట గురించి కూడా సంకేతం అందించిదన్నమాట.

ఆయన ప్రేమగా "రాజ్యం..." అన్నాడు నెమ్మదిగా. కళ్ళు తుడుచుకుని ఉత్తరం చదవటం కొనసాగించాడు.

"మీతో ఒక విషయం చెప్పాలని వుంది. నన్ను ఎప్పుడయినా లైఫ్ సపోర్టింగ్ సిస్టం మీద పెడితే, మీకు అప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకోవాలా అనే క్లిష్ట పరిస్థితి వస్తుందేమో! నా మీద ప్రేమ కొద్దీ మళ్ళీ కోలుకుంటానేమో అనే ఆశ ఒక వైపు, అలా కాక ఇంకోవేపు నేను ప్రాణం కోసం పోరాడుతుంటే, నాతో పాటూ మీరూ బాధపడుతూ నా అంతిమ క్షణాల కోసం ఎదురుచూడటం. సరైన నిర్ణయం తీసుకోవటం అంత సులభం కాదు. అసలు ఇలాటి విషయాల్లో సరైన నిర్ణయం అంటూ ఒకటి వుంటుందంటారా? అందుకే మిమ్మల్ని ఆ పరిస్థితుల్లోకి నెట్టటం నాకు ఇష్టం లేదు. మీకు సలహాలు ఇవ్వటానికి నేను స్పృహలో వుండను. మామయ్యగారూ లేరు. కనుక నాకు అలా మీ చేతుల్లో పోవటమే ఇష్టం. దయచేసి నన్ను వెళ్ళిపోనివ్వండి. మీ ఆరోగ్యం మాత్రం జాగ్రత్త. ప్రసాద్ సహాయంతో ఓల్డేజ్ హోంలో చేరండి. అక్కడయితే అన్నీ వాళ్ళే చూసుకుంటారు. జాగ్రత్త. వెళ్ళొస్తానండీ!"

జగన్నాధం కళ్ళలో నించీ రెండు కన్నీటి బొట్లు, ఆ ఉత్తరం మీద పడ్డాయి!

★★★

"What can you do to promote world peace? Go home and love your family." – Mother Teresa

## విశ్వ శాంతి విశ్వ ప్రేమ

**- కాజ మాధురి**

రామం, మానసి భార్య భర్తలు. రామం సైంటిస్ట్, మానసి సాఫ్ట్ వేరు ఇంజనీరు, వాళ్ళ అయిదేళ్ళ బాబు విశ్వం, పాప కావ్య, ఇంట్లో వీరితో పాటు బుజ్జి కుక్కపిల్ల దాని పేరు 'టామీ'. అందమైన కుటుంబం ప్రేమ నిండిన వారి ఇల్లు మరియు వారి హృదయాలు రోజూ సాయంత్రం ఉద్యోగాల నుండి ఇంటికి వచ్చాక వేడి వేడి టీ తాగుతూ కబుర్లు చెప్పుకుంటారు....

మానసికి మొక్కలంటే చాలా ఇష్టం, ఎప్పుడూ మొక్కలు, చెట్ల గురించే ఆలోచిస్తూ వుంటుంది. మొక్కలకి నీళ్ళు పోస్తూ వుండగా రామం ఇంటికి వచ్చాడు అమ్మకి బుల్లి బుల్లి చేతులతో సాయం చేయడానికి ప్రయత్నించే పాప, బాబు బుల్లి బుల్లి చేతులు.

అలసిన నాన్న, ఇంటికి రాగానే, మంచి నీళ్ళు అందించే వారి ప్రయత్నం. రామంకి పుస్తకాలు చదవటం అంటే చాలా ఇష్టం. సరే ఇంట్లో ఒక గదిని చిన్న గ్రంధాలయంగా మార్చేసాడు. ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం చదువుతూ ఉంటాడు , ఈ మధ్యే కొన్న పుస్తకం "పర్యావరణం సంరక్షణ" చదువుతున్నాడు .... పాప , బాబు బొమ్మలతో ఆడుకుంటున్నారు. మానసి టీ తెచ్చింది "ఇంతకు ముందే విశ్వ శాంతి విశ్వ ప్రేమ స్వంచ్ఛంధ సేవ సంస్థ వాళ్ళు వచ్చి వెళ్ళారు" చెప్పింది. కానీ రామం ఆ విషయంపై ఆసక్తి చూపించలేదు.... పక్కనే బల్లపై ఉన్న న్యూస్ పేపర్ చదువుతూ మానసి "వార్తలు అన్నీ హత్యల గురించి, ఎక్కడ చూసినా దగా, పొరుగు వాడిని ఎలా మోసం చెయ్యాలా అనే , మనుషులలో స్వార్ధం ఎంతగా పెరిగి పోయింది!!! నిర్భయ కేసు చూసారుగా ఎంత దారుణం!!! ఆడపిల్లలకి రక్షణ లేదు, మానవత్వం లేని మృగాలుగా మనుషులు ఎందుకు మారుతున్నారు?...."మానసి ఆవేదన!

రామం " ఈ ప్రపంచంలో శాంతి లేదు అంటే స్వార్ధం పెరిగి పోయింది అని అర్ధం .... హింస పెరిగింది అంటే ప్రేమ లేదు అని దాని అర్ధం... ఒకరి గురించి ఒకరం ఆలోచించడం మానేసాం అని దాని అర్ధం" .... "మానసి మరి మనం ఏమి చెయ్యలేమా?" ఇద్దరి లోను ఏదో అసంతృప్తి .... ఏమి చెయ్యలేక పోతున్నామే అని బాధ.

ఇంతలో పాప వెళ్ళి టీవీ పెట్టింది , సినిమా ఏదో వస్తోంది , అందులో హీరో గొడ్డళ్ళతో నరుకుతూ రక్తం చిందిస్తూ ఉన్నాడు. మానసి వెంటనే వెళ్ళి టీవి కట్టేసింది. "హింస ప్రవృత్తి పెంచే విధంగా, మారణాయుధాలని చాలా సాధారణంగా చూపించే ఈ సినీమాలని చూసి పెద్దవాళ్ళే మారిపోతుంటే , పసి హృదయాల మీద ఏమి ముద్రలు వేస్తాయో?..... " మానసి ఆవేదన. వారికి తాను నర్సరీ నుండి కొని తెచ్చిన మొక్కలిచ్చింది తోటలో నాటమని , విశ్వం , కావ్య చిన్న మొక్కని నాటి దానికి నీళ్ళు పోస్తున్నారు....తోక ఊపుకుంటూ టామీ వారి వెనకాలే తిరుగుతోంది.

ఇంతలో ట్రింగ్ ట్రింగ్ అంటు ఫోను మోగింది, ఊరి నుండి అమ్మకి బాగోలేదంటూ మావయ్య, ఒక సారి వచ్చి పొమ్మని ఫోన్ చేసాడు..... వెంటనే రాత్రి బస్సు పట్టుకుని అందరు ఊరికి బయలుదేరారు.... అమ్మకి చిన్న ఆక్సిడెంట్ ... "హాస్పిటల్లో అమ్మ గ్రూప్ రక్తం లేక పోతే ఊరిలోనే ఉన్న రక్త దాన శిబిరం వారు సహాయం చేసారు... లేక పోతే ఏమయ్యేదో? " మావయ్య కళ్ళు ఒత్తుకున్నాడు... రామం కళ్ళలో నీళ్ళు తిరిగాయి ... వారు చేసిన సహాయానికి ధన్యవాదాలు చెబుదామని వెళ్ళితే అక్కడ "విశ్వ శాంతి విశ్వ ప్రేమ " అని రక్త దాన

శిబిరం పేరు చూసి ఆశ్చర్యపోయాడు..... ఒక సంఘటన మనుషుల్ని మార్చగలదా??

ఆ రాత్రి రామం పడుకున్నాడు కానీ ఎంతకీ నిద్ర పట్టడం లేదు ... .... చాలా సేపటికి కలత నిద్ర పోయాడు.... నిద్రలో కల – నీలి ఆకాశం కింద ఒకే ఒక చెట్టు.... చుట్టూ చూస్తూ ఒంటరిగా నిలబడి ఆక్రోశిస్తోంది .... అన్ని దిక్కులు చూస్తూ నా గోడు వినే వారున్నారా?? చెట్లనన్నిట్టిని మిగల్చకుండా కొట్టేసారు... చెట్లు లేక భూమి మీద విపరీతమైన వేడి పెరిగిపోయింది... ఎటు చూసినా మంటలు... "నాన్న !! నాకు ఉపిరి ఆడటం లేదు నాన్న...." దగ్గుతూ కావ్య. అమ్మ "ఒరేయ్ రామం!!!

నా వళ్ళంత కాలుతున్నట్లుగా ఉందిరా..... " ఇంతలో మానసి" అయ్యో.. ఎమిటండీ ఇక్కడ ఇంత వేడిగా ఉంది? ".... "నాన్నా టామీ ఏమిటి తలవాల్చేసింది?" టామిని ఎత్తుకొని ఏడుస్తూ విశ్వం. మానసి" ఒక్క చెట్టు కూడా కనపడట్లేదు , ఇది ఖచ్చితంగా కాలుష్యనికి పరాకాష్ట.

ఈ వేడికి మొక్కలు, జంతువులు మనుషులు భూమి మీద ఎవ్వరూ మిగలరు ...." రామం పరిగెడుతున్నాడు తన కుటుంబాన్ని కాపాడటానికి, ఇంతలో దూరంగా ఎవరో వస్తున్నారు. అటు చూసాడు రామం.... వారి చేతుల్లో రక్తాలు కారుతూ మారణాయుధాలు.... రామం పరిగెడుతూనే ఉన్నాడు ....

రామం ఉల్లిక్కి పడి లేచాడు..... ఇది కలా!!!!..... వళ్ళంతా చెమటలు...... మరి నిద్ర పోలేదు ఆ రాత్రి రామం.... విశ్వ శాంతి విశ్వ ప్రేమ పిలుపు అతనికి అందింది , తన కర్తవ్యం భోధపడింది. వారి స్వచ్చంధ సేవ సంస్థ కార్యక్రమాల గురించి మొదటి సారి ఆలోచించడం మొదలు పెట్టాడు. తరువాతి రోజుల్లో వారిని కలిసి మరింతగా తెలుసుకున్నాడు......

తమ పరిధిలో ఎలా సహాయం చెయ్యచ్చో తెలుసుకున్నాడు. వారి కార్యక్రమాలు భారత దేశంలోనే కాకుండా, ప్రపంచంలోని అన్ని దేశాలలో వారి వారి కార్యకర్తలు పనిచేస్తున్నారని తెలుసుకొని ఆశ్చర్యపడ్డాడు. పక్కనే ఉండీ తాము తమకెందుకులే అని ఇంతకాలం అనుకున్నందుకు ఎంతో సిగ్గుపడ్డాడు.

కలలు పక్షులు లాంటివే. అవి రెక్కలు వచ్చాక ఇక ఆగవు, కలలు అంతే, అవి చాలా శక్తివంతమైనవి.....మేలుకునే కలలు కంటే వాటికి విలువ లేదు, కనగానే సరిపోదు తాము కన్న కలలు సాకారం చేసుకోవాలి... ఇదే తాము కన్న కల... తమ కుటుంబం ఎలా సుఖ సంతోషాలతో ఉండాలో, భూమి సస్యసామలంగా పచ్చగా ఉండాలి, శాంతి ప్రేమలతో నిండాలి. తమ కలలని సాకారం చేసుకోవాలిసిన సమయం ఇదే అనిపించింది....ఒక్కసారిగా తమ జీవితాలకి అర్థం వచ్చినట్లు అనిపించింది...... ఇక వారి జీవితం మారిపోయింది!!!

రామం, మానసి "విశ్వ శాంతి విశ్వ ప్రేమ" సంస్థతో కలసి మరెన్నో "విశ్వశాంతి విశ్వ ప్రేమ" రక్త దాన శిబిరాలు, శ్రమదాన శిబిరాలు, నర్సరీలు, మెడిటేషన్ సెంటర్లు, పర్యావరణ సహాయ కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ద్వారా పర్యావరణ, గ్లోబల్ అవేర్నెస్ ప్రాజెక్ట్ లు, అనేక ప్రాంతాలలో నెలకొల్పారు.

"విశ్వశాంతి విశ్వ ప్రేమ" రక్త దాన శిబిరాలు – అందరి ప్రాణాలకి ఆధారం రక్తం... నా రక్తం నీలో ప్రవహిస్తోంది అని అనుకున్నప్పుడే హింస చచ్చిపోతుంది .... ప్రేమకి జయం, ఇంకొకరి ప్రాణం

కాపాడాము అన్న తృప్తి.

"విశ్వశాంతి విశ్వ ప్రేమ" సైన్స్ టీం తన పలుకుబడితో ఇతర సైంటిస్ట్ ల సహాయంతో మరెన్నో పర్యావరణానికి సంబందించిన సహాయ కర్యాక్రమాలు స్వచ్ఛందంగా చెయ్యడం మొదలు పెట్టాడు. ఈ మధ్య వారు రోబోట్ ని తయారు చేసారు దాని ద్వారా పర్యావరణం సమతుల్యం దెబ్బతిన్న ప్రాంతాలలో తక్షణం చెయ్యాల్సిన కార్యక్రమాలు అది సహాయ పడుతుంది.

"విశ్వశాంతి విశ్వ ప్రేమ" టెక్నికల్ టీం – టెక్నికల్ వెబ్ సైట్, బ్లాగు, విశ్వ శాంతి విశ్వ ప్రేమ ట్విట్టర్లో గ్లోబల్ అవెర్నెస్ ప్రచారం కోసం అనేక సోషల్ మీడియా మాధ్యమాలు వాడుతున్నారు.

"విశ్వశాంతి విశ్వ ప్రేమ" నర్సరీ టీం – మన చుట్టూ , మరిన్ని విత్తనాలు చల్లుకుంటూ , విశ్వమంతా విత్తనాలు జల్లుతూ, శాంతి ప్రేమతో సేద్యం చేద్దాం. సిటీలోని నర్సరి వాళ్ళతో కలసి మరిన్ని చెట్లని నాటే పథకం అమలు పెట్టడానికి తన వంతు కృషి చేస్తోంది మానసి. చెట్లు వాతారణం లోని కాలుష్యాన్ని తగ్గిస్తాయి. అందరూ చెట్లని పెంచాలి. గాలిని, నీళ్ళని, ప్రకృతిని కలుషితం చేసే హక్కు ఎవరికీ లేదు అని అందరికి చెబుతుంటుంది.

"విశ్వశాంతి విశ్వ ప్రేమ" కల్చరల్ టీం... మరెన్నో సాంస్కృతిక కార్యాక్రమాలు, ఎన్నెన్నో ప్రదర్శనలు , పాటలు, నాటకాల (డ్రామాల) ద్వార ప్రచారం ఉరూరా తిరుగుతూ పర్యావరణం సస్యస్యామలంగా ఉంచమని,శాంతిమయం చెయ్యమని, ప్రేమని పంచమని ప్రజల్ని ఉత్సాహ పరచసాగారు.

"విశ్వశాంతి విశ్వ ప్రేమ" వాకాతాన్లు నెలా పలు ప్రాంతాలలో కార్యకర్తలు వాకతాన్లు ద్వారా పర్యావరణ సహాయ కార్యక్రమాల పబ్లిసిటీ. మరెందరో ఈ కార్యక్రమాలలో భాగస్వాములు కావడానికి దోహద పడుతోంది.

"విశ్వశాంతి విశ్వ ప్రేమ" చిన్నారి టీం:

తరువాతి తరం ముఖ్యంగా చిన్న పిల్లలని, స్కూల్ పిల్లల మీద వత్తిడి లేకుండా వారిలో కళలపై ఆసక్తి తీసుకు వచ్చే పథకాలు. చిన్నప్పటి నుండి హింస ప్రవృతి తగ్గించడానికి వారికి మెడిటేషన్ అలవాటు చెయ్యడం, ఎన్నెన్నో సదస్సుల్లో ముఖ్యంగా స్కూల్ పిల్లలకి అర్ధమయ్యే విధంగా వాటిని నిర్వహిస్తున్నారు,

పర్యావరణాన్ని కాపాడే కార్యాక్రమాలలో వారి సాంస్కృతిక కార్యక్రమాలు వారు కూడా పాలు పంచుకొనే పథకాలు.

"విశ్వశాంతి విశ్వ ప్రేమ" మెడిటేషన్ సెంటర్లు – ఉన్నతమైన అవగాహన శక్తీ పెంచుతూ యాంత్రికమైన జీవితాలలోని చికాకులని తగ్గిస్తూ, సమస్యల నుండి ఎలా బయట పడాలో మెడిటేషన్ సహాయపడుతుంది.

ప్రేమ కున్న శక్తి దేనికి లేదు .... ఒకరి నొకరు ప్రేమించండి ..... హృదయాలలో ప్రేమ నింపుకోండి , ప్రేమని పంచండి .... జగమంత కుటుంబం శాంతి ప్రేమలతో సమతుల్యంతో సస్యశ్యామలంగా ఉండాలి.

మనుషి ఆకాశం , భూమి , జలం, అగ్ని, వాయువు మాత్రమే కాదు, మనిషి ఒక స్పందించే, ఆలోచించే హృదయం, ఒక మెదడు, ఒక శరీరం, ఒక దృష్టి, ఒక చేయూత, ఒక ఆసరా, ఒక నిలకడ, ఒక ప్రచండం, ఒక అఖండం, ఒక సమరం , ఒక సంఘర్షణ, ఒక ధర్మం, ఒక స్పందన, ఒక బలం, ఒక పోరాటం, ఒక ఉత్తేజం, ఒక భావం, ఒక చైతన్యము, ఒక సూర్యుడు ఒక శక్తి. ప్రపంచ అంతా మీలోనే బంధించి ఎప్పటికప్పుడు విశ్వం లా విస్తరిస్తూ ఉడండి......

ఉన్నతమైన అభిప్రాయాలతో బాటుగా సామాజిక స్పృహ, సేవా భావం ఉండాలి, పిడికిలి బిగించి, ప్రతి కుటుంబం అనుకుంటే ఈ ప్రపంచంలో శాంతి, ప్రేమ అలరారుతుంది ... ఎన్ని చెప్పినా నిజంగా మార్పు రావాలంటే కుటుంబం నుండే మొదలుపెట్టాలి .... ప్రతి మనిషి, కుటుంబం తమ స్వార్థం కొద్దిగా తగ్గించుకొని పొరుగు వారి కోసం ఈ జగమంత కుటుంబం వసుధైక కుటుంబం “విశ్వశాంతి విశ్వ ప్రేమ” యజ్ఞంలో భాగం కండి, వారితో చేతులు కలపండి!!! అప్పుడు, ఆ జగమెంత సుందరం!!!!

★★★

## ఒక చావు - ఎన్నో పెళ్లిళ్ళు

- తాటిపాముల మృత్యుంజయుడు

ఉదయం పదకొండు గంటలు కావస్తోంది. గ్రీష్మ ఋతువు తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నది. ఎండ బారిన పడకుండా ఇంటి పక్కనున్న చింతచెట్టు కింద కూర్చుని ఉంది లక్ష్మమ్మ, పెరట్లో పడి ఉన్న ఎండుపుల్లలన్నింటిని ఏరుకొని వచ్చి ముందేసుకుంది. వాటిని విరుస్తూ చిన్న కుప్పలుగా పోస్తున్నది. పుల్లల్లాగానే లక్ష్మమ్మ చర్మం కూడా ఎండిపోయి ముడతలుపడింది. శరీరం నడుం దగ్గర వంగిపోయింది. కండలు లేని శరీరంలో నుండి ఎముకలు స్పష్టంగా అగుపిస్తున్నాయి. ఎండ వేడిని భరించలేక ఆవిడ తీస్తున్న ఉచ్ఛ్వాసలు వల్ల డొక్కలు ఎగిసి పడుతున్నాయి.

మధ్యమధ్యలో కళ్ళకు చేతుల్ని అడ్డుపెట్టుకుని ఎవరికోసమో అన్నట్టుగా బయటకు చూస్తున్నది. నిరాశపడుతూ తిరిగి తన పనిలో నిమగ్నమవుతున్నది. 'ఏం పనికి పోయిండో ఏమిటో. ఎప్పుడొస్తడో ఏమిటో' అని గొణుక్కుంటున్నది.

ఇంట్లోనుండి బయటకు వచ్చింది లక్ష్మమ్మ కోడలు, సునీత. ఓ అత్తమ్మా! వంటయ్యింది. నువ్వొస్తే అన్నం పెట్టుతా! గట్టిగా కేకేసింది. 'ఆ! తినడాంకి తొందరేముందిలే. ఇంతకీ కొడుకు ఎప్పుడొస్తనన్నడు?' అడిగింది లక్ష్మమ్మ. గొంతులో కోపం, నిస్సహాయత రెండూ ధ్వనించాయి.

'ఏమో, నాకేం తెలుసు. ఆయన పనులని చక్కబెట్టుకొని వచ్చేసరికి ఎప్పుడైనా కావచ్చు. లేకుంటే రాత్రికి పట్నంలోనే పడుకుంటడు. నీ కొడుకుతో పెట్టుకుంటే నువ్వు పస్తులుండాల్సిందే. అసలే ఎండకు బలహీనమై పోతున్నవ్. పద, ఇంత ముద్ద తిందువు గానీ' తొందర చేసింది సునీత. కోడలు మాట కాదనలేక లేచింది. వీధిలోకి కొడుకు కోసం పదేపదే చూస్తూ అసంతృప్తితో లోనికి అడుగేసింది.

లక్ష్మమ్మది వ్యవసాయదారుల కుటుంబం. తరతరాలుగా భూమినే నమ్ముకొని బ్రతుకుతున్నారు. తండ్రి నుండి సంక్రమించిన రెండకరాల భూమిని ఐదెకరాలకు పెంచాడు లక్ష్మమ్మ భర్త రాజయ్య. మంచి మాటకారి అవటంతో కులానికి పెద్దగా వ్యవహరించాడు. పలుకుబడి పెరగడంతో రాజకీయాల్లోకి ప్రవేశించి ఆ గ్రామ సర్పంచ్ అయ్యాడు. గ్రామ కక్ష్యల్లో చనిపోయి నలభై సంవత్సరాలు కావస్తోంది. లక్ష్మమ్మ కొడుకు యాదగిరి. తండ్రిబాటలోనే నడిచిన యాదగిరి అక్కడి మండలానికి అధ్యక్షుడు అయ్యాడు. యాదగిరి రాజకీయాల్లోకి రావడం లక్ష్మమ్మకు ఏమాత్రం ఇష్టం లేదు. భర్తలాగ కొడుక్కి ఎలాంటి అపాయం జరుగుతుందోనని అహర్నిశలు భయపడుతుంది.
లక్ష్మమ్మ రెండు ముద్దలు తిని మూడోముద్ద నోట్లో పెట్టుకుంటుంటే ఇంటిముందు నలుగురు మనుషులు వచ్చి నిలబడ్డారు. యాదగిరిని కలవటానికి ఎవరో వచ్చారనుకొని 'యాదగిరి పట్నం పోయిండు. తర్వాత రండి' అన్నది.

'సునీతమ్మ ఇంట్లో ఉందా? అమెతో మాట్లాడాలి' అన్నారు వాళ్లు. చేపల పులుసు వడ్డిస్తున్న గిన్నెను పక్కన పెట్టి చీర కొంగును సర్దుకుంటూ బయటకు నడిచింది సునీత. వాళ్లు సునీతకు ఏదోచెప్పటానికి ప్రయత్నిస్తున్నారు. అది అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ ప్రశ్నలు వేస్తుంది సునీత. 'అయితే మా ఆయనకు ప్రమాదమేమి లేదు కదా? డాక్టర్ కు చూపెట్టిండ్రా?' అని అడుగుతుంటే కళ్లలోంచి నీళ్లు జలజలా రాలాయి.

వంటిట్లోంచి ఇదంతా గమనిస్తున్న లక్ష్మమ్మ మనసు ఏదో కీడు శంకించింది. చేతిలోని ముద్దను కంచంలోకి విదిలించింది. గబగబా బయటకు అడుగులేసింది. అప్పటికే సునీత ముఖంలో కళ తగ్గి విషాదం చోటుచేసుకుంది. 'ఎక్కడ్రా యాదగిరి?' గట్టిగా అడిగింది. వచ్చినవాళ్ల దగ్గర నుండి జవాబు లేదు.

'మాట్లాడరేం? ఒరే వెంకన్నా, నువ్వు యాదగిరితో పొద్దున పట్నం పోయినవ్ గదా. చెప్పురా, నా కొడుకు ఎక్కడా?' అడుగుతుంటే లక్ష్మమ్మ కంఠం దగ్గర వణికింది.

'పట్నంలో పనులు చూసుకొని మోటర్ సైకిల్ పై తిరిగివస్తున్నం. తిమ్మాపురం మోటబావి దగ్గర మలుపు తిరగంగనే ఎవరో వచ్చి మామీద దాడి చేసిండ్రు. నేను తప్పించుకొని గుట్టలకు అడ్డంగా ఉరుక్కుంటూ ఊరొచ్చిన' అని చెప్పాడు వెంకన్న. అతని వొళ్ళంతా మట్టికొట్టుకొని పోయింది. బట్టలన్నీ చెమటతో తడిసి ముద్దయ్యాయి.

వీడు మాకొచ్చి చెప్పంగనే మనూరి సర్పంచ్ పోలీసులకు ఫోన్ చేసిండు. ఈపాటికి అక్కడకి పోలీసులు చేరుకొనుంటరు. అట్లాగే నూటా ఎనిమిదికి కూడా కాల్ చేసినం. అంబులెన్స్ పోయుంటది. అంటూ చెప్పాడు గుంపులోని పెద్దమనుషి. ఇందంతా వింటున్న సునీత భోరున ఏడుస్తూ ఇంట్లోకి పరిగెత్తింది. అప్పటికే అక్కడ పోగైన గుంపులోంచి కొందరు ఆడవాళ్లు సునీతను ఓదార్చటానికి లోనికెళ్లారు.

లక్ష్మమ్మ కాళ్లలో నిస్సత్తువ చోటుచేసుకుంది. నిలబడే శక్తి లేక నెమ్మదిగా అడుగులేస్తూ పక్కనే ఉన్న మంచంలో కూలబడింది. ఆమె గుండె కలుక్కుమంది. చెట్టంత కొడుకుకు ఏమైందోమని మనసు ఆక్రోశించింది." ఓరీ దేవుడో. నా కొడుకు నాకు దక్కేటట్టు చూడు. నా యాదగిరి పాణాలతో తిరిగి వచ్చేటట్టు చెయ్" ఏడుస్తూ పైకి చూస్తూ చేతులు గాలిలోకి ఎత్తి దండాలు పెట్టసాగింది.

ఊరి సర్పంచ్ అక్కడికి చేరుకున్నాడు. అతని చుట్టు జనం గుమికూడారు. యాదగిరి పరిస్థితి గురించి వారికి వివరిస్తున్నాడు. సర్పంచును చూసిన లక్ష్మమ్మ ఒక్కసారిగా శక్తి తెచ్చుకొని 'నా యదగిరికేమయిందయ్యా? ఇప్పుడెలా ఉన్నడు?' అంటూ అడిగింది. సర్పంచ్ కూడా పూర్తి సమాచారం తెలియదు. తెలిసిన దానిలో ఏం చెప్పొచ్చో, చెప్పొచ్చో, చెబితే పోలీసులు ఏమంటారో అన్న భయం ఉంది. పార్టీ పెద్దల అనుమతి లేకుండా ఇలాంటి పరిస్థితుల్లో ఎంతవరకు మాట్లా డాలో తెలియటం లేదు.

మాట్లాడవేందయ్యా? నా కొడుకు బాగానే ఉన్నాడు అని చెప్పవేందయ్యా' అంటుంటే లక్ష్మమ్మ కంఠం పీలగా వినిపించింది. ఆమె అలా నిలదీసి అడుగుతుంటే సర్పంచుకు ఏంచెయ్యాలో పాలుపోలేదు. జంకుతూ దూరంగా వెళ్లి నిలబడ్డాడు.

'ఓరి బగమంతుడా! నాకేం కష్టాలు తెచ్చావయ్యా. రాయంత కొడుకుకు ఏం గాకుండ చూడవయ్యా' అంటూ శోకాలు పెట్టసాగింది. ఆమెను ఓదార్చటానికి కొంతమంది దగ్గరికి చేరారు. ఒకావిడ గ్లాసులో నీళ్లు తెచ్చి తాగించటానికి ప్రయత్నం చేసింది.

సర్పంచ్ సెల్ ఫోన్ మోగింది. అవతల నుంచి పార్టీ జిల్లా ప్రెసిడెంట్ మాట్లాడుతున్నాడు. 'ఇదిగో, నేను చెప్పేది జాగ్రత్తగా విను. ఈ హత్యతో ప్రజల్లో మన పార్టీ సానుభూతి పెంచుకోవాలి. జాగ్రత్తగా పావులు కదిపి రాబోయే ఎన్నికల్లో ఓట్లను క్యాష్ చేసుకోవాలి......'

అంటూ కొన్ని సూచనలను ఇచ్చాడు.

యాదగిరి హత్య వార్త చుట్టూపక్కల ఊళ్లకు వ్యాపించినట్టుంది. జనాలు కదలి రాసాగారు. చూస్తుండగానే వందల కొద్ది మంది పోగయ్యారు. తెలిసింది కొంత, తెలియనిది మరింత ఊహించుకొంటూ మాట్లాడుకుంటూన్నారు. రెండు పోలీసు జీపులు, ఒక ట్రాక్టర్ వచ్చి ఇంటిముందర ఆగాయి. పోలీసులు లాఠీలు విదలిస్తూ జనాన్ని దూరంగా జరిపారు.

ఇంట్లోకి వెళ్లి ఒకరు చాప తీసుకొచ్చి వాకిట్లో పరిచాడు. కొంతమంది ట్రాక్టర్ లోంచి యాదగిరి మృతదేహాన్ని బయటకు తీసి చాపమీద పడుకోబెట్టారు. ఆరడుగుల పొడవు, దాదాపు వంద కిలోల శరీరాన్ని కిందకు దింపటానికి పదిమంది కష్టపడ్డారు.

ఏడుస్తున్న లక్ష్మమ్మ కంఠం ఒక్కసారిగా మూగపోయింది. రెప్పవేయని కళ్లు నిర్జీవంగా నిలిచిపోయాయి. మంచంలోంచి నెమ్మదిగా లేచింది. ఒక్కొక్క అడుగేసుకుంటూ కొడుకు శవం దగ్గరికి చేరుకుంది. చివరికి తనకేం గతి పట్టింది? కన్న కొడుకు శవంగా మారిపోయాడు. తండ్రిలేని కొడుకును గారాబంగా, కంటికి రెప్పలా కాచుకుంటూ పెంచింది. భర్తలాగానే మళ్లీ కొడుకుని రాజకీయాలు బలికొన్నాయి.

ఉన్నట్టుండి ఛాతీమీద చేతులతో కొట్టుకుంటూ రోదించసాగింది. పది నిమిషాలైనా ఆ తల్లిశోకం ఆగలేదు. సర్పంచ్ దగ్గరికి ఇన్స్పెక్టర్ వెళ్లి మాట్లాడాడు. 'లక్ష్మమ్మ ఏడుపు భరించ లేకుండా ఉన్నాం. ఇక్కడి నుంచి ఆమెను తీసుకెళ్ళితే మనం మిగతా పనులు చూసుకోవచ్చు' అన్నాడు. పరిస్థితిని కంట్రోల్ చేసి, ఈ కేసును సరిగ్గా హాండిల్ చేస్తే డీఎస్పీ దగ్గర మంచిపేరు సంపాదించుకోవచ్చు. లంచాలు తీసుకుంటున్నాని తనపై ఉన్న మచ్చను తుడిచేసుకొవటానికి ఈ హత్య మంచి అవకాశమని భావిస్తున్నాడు. సర్పంచ్ ఆజ్ఞతో కొంతమంది ఆడవాళ్లు లక్ష్మమ్మను ఇంట్లోకి తీసుకెళ్లారు.

'లోపల్నుంచి యాదగిరి భార్యను పిలవండి' అన్నాడు ఇన్స్పెక్టర్. లోపలున్న సునీతను బయటకు తీసుకొచ్చారు. రక్తసిక్తమై తెల్లటి బట్టల్లో చుట్టివున్న యాదగిరి శవాన్ని చూడగానే అప్పటివరకు ఆమె మనస్సులో దొర్లుతున్న అనుమానం నిజమై పోయింది. తన భర్త హత్య చేయబడ్డాడు. కొండత అండగా ఉండే మనిషి జీవచ్ఛవంలా మారి ముందు పడున్నాడు. ఆమె గుండె కొట్టుకులాడింది. కళ్లు బైర్లు కమ్మాయి. శరీరం వశం తప్పితే దభాలున కిందపడింది.

ఇంతలో జిల్లా పార్టీ అధ్యక్షుడు కారులో వచ్చాడు. అతని వెంట పదిమంది మార్బలం ఉంది. వస్తూ జిల్లాలో ఇంజనీరింగ్ చదువుతున్న యాదగిరి కొడుకు రమణను కారులో తీసికొచ్చాడు. ఆ వెనుకే డీఎస్పీ చేరుకొన్నాడు. పోలీసు బలగం రెండింతలయ్యింది. ఖిన్నుడై తండ్రి శవాన్ని చూస్తూ కొద్ది నిమిషాలు నిలుచున్నాడు రమణ . తర్వాత జీవచ్ఛవంలా పడున్న తల్లి దగ్గరకు వెళ్లాడు. కొడుకును చూడగానే సునీత శోకం రెండింతలయ్యింది. రమణ భుజంపై తలపెట్టి వలవల ఏడవసాగింది. జిల్లా అధ్యక్షుడు రెండు నిమిషాలు శవం దగ్గర మౌనం పాటించిన తర్వాత సర్పంచ్ ను, పార్టీ కార్యకర్తలను పక్కకు తీసుకెళ్లి మంతనాలు జరపసాగాడు.

'మూణ్ణెలలో ఉప ఎన్నికలు రాబోతున్నాయి. యాదగిరికి ఈ ఊర్లో, మండలంలో మంచి పేరుంది. అతని హత్యను మనం క్యాష్ చేసుకోవటంలో విఫలం కావద్దని హైద్రాబాద్ ఆఫీసు నుంచి నాకు ఆజ్ఞలు వచ్చాయి. పైగా యాదగిరి బీసీ కులానికి చెందినవాడు కాబట్టి

పార్టీ అధిష్టానం కులం కార్డ్ ప్లే చెయ్యొచ్చు. ఇందుకు సంబంధించిన మీ అభిప్రాయాలు తెలపండి' అంటూ ఎత్తుగడలు వేయసాగాడు.

'దినాలు పెట్టే పది పదకొండు రోజులు ఘనంగా జరుపుదాం. ఏటల్ని కోసి మండలం లోని అందర్ని భోజనాలకు పిలుద్దాం 'అన్నాడు మండల ఉపాధ్యక్షుడు. అతనికి యాదగిరి హత్య వల్ల ఖాళీ అయిన అధ్యక్ష పదవిని చేపట్టాలని ఉంది. కాని అది అతన్ని వరిస్తుందో లేదో, అందుకు పార్టీ ఏమటుందోనన్న సందిగ్ధంలో ఉన్నాడు. ఈ సందర్భంలో తన బలమేమిటో
నిరూపించుకోవచ్చనుకున్నాడు.

'యాదగిరి భార్య సునీతమ్మ పదో తరగతి వరకు చదువుకున్నది. ఎన్నికల్లో ఆమెకే ఎం ఎల్ యే టికెట్ ఇస్తే బాగుంటుంది. ఆడోళ్ల ఓట్లు కూడా ఆమెకే వస్తయ్' అన్నాడు ఇంకొకడు.

'యాదగిరి విగ్రహాన్ని మండలంలోని ప్రతి ఊళ్లో స్థాపిద్దాం. ఆయన కొడుకు ఇంజనీరింగ్ చదువుతున్నడు. ఆయనకు టికెట్ ఇస్తే మేమంతా ఊరూర సభలు పెట్టి ప్రచారం చేస్తాం ' అన్నాడు ఉడుకు రక్తంతో ఉన్న పార్టీ యువజన అధ్యక్షుడు. అభిప్రాయం తెలుసుకోవటానికి రమణను తమవద్దకు పిలిపించుకొన్నారు.

'శాంతి భద్రతల దృష్ట్యా శవాన్ని చీకటి పడేలోపు దహనం చేయాలి. అందుకు ఏర్పాట్లు చేయండి ' అక్కడున్న వారిని పురామాయించారు డీఎస్పీ, ఇన్స్పెక్టర్. కుమ్మరింటికెళ్లి కుండను, మంగలిని, పాడె కట్టేవాళ్లను, బ్యాండుమేళాలను క్షణాల్లో తీసుకొచ్చారు. పనులు చకచకా మొదలయ్యాయి.

లోపల్నుండి లక్ష్మమ్మ బయటకు రావడం ఎవరూ గమనించినట్టులేదు. ఆమెకు తన భర్త చనిపోయినప్పటి సంఘటనలు సినిమా రీలు తిప్పినట్టు స్పష్టంగా గుర్తు. రాజయ్యను ఎడ్లబండిలో వేసుకొని రావడం తను చూసింది. తనెంత మరణవేదన పడిందో గుర్తుకు తెచ్చుకుంది. రాజయ్య హత్యకేసు కోర్టుకెళ్లింది. హత్యను కళ్లార చూసినవాళ్లున్నారు. కాని తమకు, తమ కుటుంబాలకు ఏదైనా జరుగుతుందనే భయంతో కోర్టుకు రాలేదు. సాక్ష్యం లేదన్న కారణంతో కేసు కొట్టివేయబడింది. అప్పుడు యాదగిరికి పదేళ్లు. గుండెను పాషాణంగా చేసుకొని కొడుకుని పెంచి పెద్దచేసింది.

అప్పుడు భర్త చనిపోయాడు. ఇప్పుడు కొడుకు చనిపోయాడు. రేపు మనవడు కూడా చనిపోతాడు. తల్లిమనసు ఆక్రోశించింది. కడుపులోంచి ఉక్రోషం పొంగగా ఒక్క అంగంలో ముందుకు దూకింది లక్ష్మమ్మ. వంగి రెండు చేతుల్లోకి మట్టి తీసుకొంది. ఏ జరుగుతుందో తెలుసుకొనే లోపల పోలీసుల, నాయకుల మొహాలపై జల్లింది. దుమ్ము కళ్లలో పడగానే మంటలు లేచాయి. ఇంకో దోసిలి మట్టి తీసుకొంటున్న లక్ష్మమ్మ చేతులపై లాఠీతో  కొట్టాడు ఒక పోలీసు. ఇంకొక పోలీసు ఆమె చేతులు విరిచి వెనక్కు చుట్టాడు.

'ఆ ముసల్దానికి పిచ్చి లేచినట్టుంది. ఇంకొద్దిసేపుంటే రాళ్లతో కొడుతుందేమో. గోళ్లతో గీరి, నోటితో కరుస్తుందేమో. దీన్ని వెంటనే పిచ్చాసుపత్రికి పంపించండి ' అన్నాడు అవమానంతో మోహం జేవురించుకుపోయిన అధ్యక్షుడు.

'ఇంకాస్సేపుంటే ఇక్కడ పెద్ద న్యూసెన్స్ అయ్యేటట్టుంది. దహనసంస్కారాలు త్వరగా జరిపించి ఇక్కడనుంచి వెళితే మంచిది ' హడావుడి చేసాడు డీఎస్పీ.

ఊరి బయటనున్న చెరువు పక్కనున్న శ్మశాన వాటికకు యాదగిరి శరీరం తీసికెళ్లారు. ఇంకోపక్క చెరువు కట్టపై జీపులో లక్ష్మమ్మ పిచ్చాసుపత్రికి తరలించబడుతున్నది. పోలీసు బందోబస్తు మధ్య దహనం జరుగుతుంటే లక్ష్మమ్మ శాపనార్థాలు పెడుతునే ఉంది. కాని అవి శ్మశానం చేరకుండా గాలిలోనే కలిసిపోతున్నాయి.

★★★

"When the power of love overcomes the love of power, the world will know peace."

## ఓ విశ్వప్రేమికా...వినాయకా

- గరిమెళ్ళ సుజాత

డియర్ వినాయకా (లేదా) ప్రియమైన వినాయకా (లేదా) నీకు నచ్చిన మరే సంబోధనైనా స్వీకరించి, నా ఈ ఉత్తరాన్ని తప్పనిసరిగా పరిశీలించవలసినదిగా సవినయ ప్రార్థన.

ఈ సంవత్సరం వినాయకచవితి రోజే ఈ ఉత్తరాన్ని వ్రాసి తీరాలని అనుకున్నా, నవరాత్రులు గడిచిపోయే వరకూ వీలుపడలేదు. కారణం, నీకు కోపం కల్గించకుండా ఎలా వ్రాయాలా అని చేసిన కసరత్తుల పుణ్యమే. అదేం విచిత్రమో! నువ్వు అందరి దేవుళ్ళ మాదిరి గా కాకుండా, ఇంట్లో మనిషిలా అనిపిస్తావు. అందుకే ఒక్కోసారి నీ భారీకాయం చూసి నవ్వొచ్చినా 'మన మనిషేలే' అని సరిపెట్టేసుకుంటాము.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే, వినాయక చవితి ముందురోజు నేను ఎప్పటిలా పత్రులు తెద్దామని ఇంటి దగ్గరలోని మొక్కలు, చెట్ల దగ్గరకి బయల్దేరాను. నాతో పాటూ నా మూడేళ్ళ మనుమరాలిని కూడా వెంటబెట్టుకెళ్ళాను. నేనిలా తుంచడం మొదలెట్టానో లేదో, నా మనవరాలు ఒక్కటే వారించడం మొదలు పెట్టింది "ఆకులు కొయ్యకు, నువ్వు ఆకులు తెంపేస్తే చెట్లు ఏడుస్తాయి" అని. తను ఎప్పుడో మొక్కలను పట్టుకుని ఆకులు తుంచుతున్నప్పుడు మేము వద్దని చెప్పిన మా మాటలనే మాకు ముద్దు ముద్దు మాటల హెచ్చరికలుగా చెబితే ముచ్చటేసింది. నిజమే కదా! బాల వాక్కు బ్రహ్మ వాక్కు అని ఎలాగూ అంటారు కదా? ఈ సారికి ఇప్పటికే ఉన్న పత్రులు, పూవులతో పూజ చేద్దాము. మనుమరాలు చూపించిన అహింసాయుత మార్గంలో నడుద్దాము అని నిర్ణయించుకుని వెనుదిరిగి ఇంటి ముఖం పట్టాను.

ఎప్పటినుండో అనుకొంటున్న విషయాలన్నీ అప్పుడే అలోచనల్లోకి రావడం మొదలు పెట్టాయి. నువ్వు ఎలాగూ ఇంట్లోని మనిషిలా, బాగా తెలిసిన దేవుడిలా అనిపిస్తావు. అందుకే స్వతంత్రంగా నాకు అనిపించిన అన్ని విషయాలనూ నీతో సమగ్రంగా పంచుకుంటున్నాను. నీ గురించి వందలు, వేలు, లక్షలు ఖర్చు పెట్టి మరీ వినాయక-చవితి తొమ్మిది రోజులనూ అంగ రంగ వైభవంగా జరుపుకుని తరువాత మేళ తాళాలతో కోలాహలంగా నిన్ను నదులలోనో, చెరువులలోనో నిమజ్జనం చేసే భక్తులున్నందుకు నిజంగా గర్వించాల్సిన విషయం. తమలో తమకు స్పర్ధలు రగిలించి పబ్బం గడుపుకునే కొందరు నాయకుల కన్నా, ఏ గొడవలనూ ప్రేరేపించక అనేక మందిని కలిపి నడిపించే వినాయకుడు గొప్పే కదా మరి!

జనము, ఐకమత్యమూ, సామూహిక పూజలూ, ఉత్సవాలు మొదలైనవన్నీ చూడడానికీ, వినడానికీ హాయిగా ఉంటాయి. కానీ, తరచి చూడగా ఇంత ఆడంబరం అవసరమా అనిపిస్తోంది. కారణం, బిక్కు బిక్కుమంటున్న రోజువారీ జీవనం, ఈ పండగలు పబ్బాల సమయాలలో మైక్ ల హోరులతో, జనాలతో పూర్తిగా నిండిపోయి నడవడానికీ, ప్రయాణాలకీ ఇతరత్రా దైనందిన కార్యక్రమాలకీ విఘాతమౌతోందనిపిస్తోంది. అన్నీ తెలిసీ ఎవరూ కిమ్మనకుండా ఉండిపోయే పరిస్థితులు అనేకం ఉన్నాయి. 'కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకి కోపం' అన్న చందంగా తయారయ్యింది. ఒక పెద్ద గది పరిమాణంలో గడచిన శతాబ్దంలో మొదలైన కంప్యూటర్ అనబడే ఈ గణన యంత్రం, ఈ రోజు ఐ-ప్యాడు గానో, ఐ-ఫోను గానో అతి చిన్న రూపాలలో అరచేతిలోకి అందుబాటులోకొస్తుంటే, అంతలేసి భారీ విగ్రహాలతో నిన్ను ప్రతిష్ఠించి నిర్వహించడం అవసరమా అనిపిస్తోంది. ఈ రోజుకీ నీ చిన్న విగ్రహాలని కారుల్లో,

ఆఫీసుల్లో పెట్టుకుని పూజించే అనేక మందిని నాకు తెలుసు. వారంతా 'మనసులో అభిమానం, ఆరాధనలు సవ్యంగా ఉండాలి కానీ, విగ్రహం పరిమాణంతో పనేముంది' అని నిరూపిస్తున్నారు. ఐనా, తమరి ఎలుక వాహనం కూడా మీ విగ్రహం గురించి ఎప్పుడూ 'కొంచెముందుటెల్ల కొదువ కాదు' అనుకుంటుందని నా నమ్మకం. నేను చెబుతున్న ఈ మాటలు నీకు కూడా సబబనిపిస్తే నీ భక్త శిఖామణులందరికీ కలలలో కనిపించి 'భక్తుల్లారా, నిరాడంబరంగా చిన్న విగ్రహాలతో పూజలు చేసి, డబ్బులేమైనా మిగిలితే పదిమందికీ పనికొచ్చే పనులకు ఖర్చుపెట్టండని' చెబితే బాగుంటుందని నాకనిపిస్తోంది.

నీకు మరోసంగతి అనుభవ పూర్వకంగా అనేకసార్లు తెలిసొచ్చి ఉంటుందనుకుంటున్నాను. అసలే అంతంతమాత్రంగా ఉన్న భూగర్భ జలవనరులు, భూమి పైనున్న నదీ నదాలలో నీరు, దాని పరిశుభ్రత సన్నగిల్లిపోతున్న తరుణంలో నీ భారీ-విగ్రహాల తయారీ, నిమజ్జనం మొదలైన కార్యక్రమాలు నీటిని, ఇతర సహజ వనరులను ఇతోధికంగా కాలుష్యంతో నింపేస్తున్నాయి.

ఈ కారణల వల్ల నువ్వు విగ్రహాల పరిమాణం, వాటి తయారీకి వాడుతున్న పదార్థాలలో మిళితమైన రసాయనాల విషం, మైక్ లు పెట్టి చేస్తున్న శబ్ద-కాలుష్యం, వీధులకు వీధులు ఆక్రమించి రాకపోకలకు భంగం కల్గిస్తున్న వైఖరి గురించి మా బోటి భక్త గణానికి పనిగట్టుకుని మరీ తెలియజేస్తే ఈ కొత్త శతాబ్దానికి మేలు చేసిన నవీన-వినాయకుడిగా తప్పకుండా పేరు తెచ్చేసుకుంటావు అనిపించేస్తోంది. అది కూడా ఆలోచించవలసినదని నా విన్నపం.

నా ఈ విన్నపాలు (లేదా) వినతులు (లేదా) కోరికలు నీ మనసును నొప్పించవనే తలుస్తున్నాను. "ఇంత మంది దేవుళ్ళూ, ఇన్నేసి మతాలు ఉన్న భూమి మీద కేవలం వినాయకుడి వలన, వినాయకచవితి నాటి ఆడంబరాల వలనే అనర్థాలు జరిగిపోతున్నాయా? నాకు మాత్రమే ఇన్ని విన్నపాలు ఎందుకు చేస్తున్నారు? మిగిలిన దేవుళ్ళకూ, మతాలకూ ఇవన్నీ విన్నవించనక్కర లేదా?" అని నువ్వు కన్నెర్ర చేసే హక్కు, అదికారం మా రాజకీయ నాయకుల మాదిరి నీకూ తప్పకుండా ఉన్నాయి. ఉంటాయి కూడా. కానీ, అన్ని పూజలకూ ముందు, విఘ్నాలు రాకూడదని వినాయకుడ్ని పూజించడం మాకు ఎంత సాధారణమో, ఇంట్లో మనిషిలా అనిపించే నీతోనే ఈ నవీన పోకడలకు ఆరంభం పలికితే బాగుంటుందన్న ఆశ ఉండడం కూడా అంటే సబబు కదా! అందుకే దయచేసి నా ఈ విన్నపాలని నిర్మలమైన నీ మనస్సుతో పరిశీలించి భక్తులందరికీ తెలియజేసే బాధ్యత తీసుకోగలవని ఆశిస్తున్నాను. విశ్వాన్నంతటినీ సమానంగా ప్రేమిస్తారని ప్రతీతి ఉన్న నీ లాంటి దేవుడే నాంది పలకాలి. కాదంటావా?

ఇట్లు,

వినయ విధేయతలతో

నవీన – వినాయక భక్తురాలు

## శాంతి నిలయం

- ఉమా దేవి అద్దేపల్లి

''Peace comes from within us,

do not seek it without '' – Buddha

'' ఏ ఇంట శాంతి నెలకొని వుంటుందో ఆ ఇంటి నుండి పిడికెడు గింజలు తెస్తే , వాటితో శాంతివనమే సృష్టించవచ్చు '' అన్నాడట గౌతమబుద్ధుడు శిష్యునితో. పగలంతా కాళ్ళరిగేలా తిరిగినా శిష్యునకు అటువంటి శాంతి పూరిత గృహమే దొరకలేదట. ఖాళి చేతులతో తిరిగి వచ్చాడు. అందుకే బోధివృక్షం క్రింద తపః సమాధి స్థితిలో కూర్చొని అంతర్ముఖుడై అన్వేషణ గావించాడు బుద్ధుడు. ఆ శాంతి బీజాలు ఎక్కడో బయట దొరకవని, అవి మన అంతరాంతరాలలోనే నిక్షిప్తమై వున్నాయని తపశ్శక్తితో గ్రహించాడు. వాటిని వెలికితీసి, ప్రపంచంలో శాంతి పంట పండించమని లోకానికి హితవు పలికాడు ..

గతకాలంతో పోలిస్తే , ఈ కాలంలోనే అశాంతి, అలజడి అధికాదికంగా ప్రపంచం అంతటా పెరిగిపోతోంది. ఆధునిక సౌకర్యాలు పెరిగాయి, అంతరంగ సౌహార్ద్రత నశించింది. విజ్ఞాన శాస్త్రం సర్వోన్నత శిఖరాలను అధిరోహిస్తోంది కాని మానవత్వపు విలువలు మట్టికరుస్తున్నాయి. దానికి కారణం ఏమిటి? రోదసిలో ఏముందో శోధించి, సాధించాలనుకొనే మనిషి తనలో ఏముందో తెలుసుకోలేకపోతున్నాడు. సముద్రపు లోతులను తెలుసుకోగాలిగాడేకాని తన లోతుల్లో ఏముందో వెతకడానికి ప్రయత్నించడం లేదు .

''బయట రణగొణ ధ్వనులతో గడియలు పడిన నీ చెవులకి నీ లోలోపలి అంతర్వాణి సన్నని పిలుపు వినిపిస్తుందా ! ఈ బాహ్య ధ్వనులకు కాస్సేపు దూరంగా నిలబడి, నీ సర్వేంద్రియాలను నిశ్శబ్దం గావించగలిగినప్పుడు నీ అంతరాల్లో వున్న అంతరాత్మ పిలుపును వినగలుగుతావు. అంతర్వాణి ప్రభోదాలను వినగలుగుతావు'' అన్నారు శ్రీ అరవిందులు.

విజ్ఞాన శాస్త్రం, ఆధ్యాత్మికం ఈ రెండు ఒకే నాణానికి బొమ్మ బొరుసు లాటివి. ఒకదానికొకటి పరస్పర పూరకాలు. ప్రఖ్యాత శాస్త్ర వేత్త ఐన్ స్టీన్ కూడా చెప్పింది అదే, '' మనిషి ఉన్నతిని సాధించడానికి విజ్ఞాన శాస్త్రం ఎంత అవసరమో, ఆధ్యాత్మిక తపస్సు అంతే అవసరం '' అన్నాడతను .

బాహ్య జగత్తు గురించి తెలిపేది విజ్ఞాన శాస్త్రమైతే, అంతర్లోకాలను దర్శింపజేసేది ఆధ్యాత్మిక పరిజ్ఞానం. నిజానికి యీ విద్య బిడ్డ తల్లి కడుపులో వుండగానే నెరపాలని మన పూర్వీకుల సిద్ధాంతం. దానినే ' Prenatal Education' అన్నారు శ్రీ అరవిందులు.

మన సంస్కృతి సాంప్రదాయాలను విస్మరించడం వలననే సమాజంలో అనేక లోటుపాట్లు చోటుచేసుకుంటున్నాయి, బిడ్డకు ఐదు సంవత్సరాల వరకు నేర్పిన విద్య ద్వారానే సంస్కృతి అనే పునాది ఏర్పడుతుంది. విద్య అనగానే స్కూలు, చదువు అని మాత్రమే కాదు, తల్లి ఒడిలో ఆడుతూ పాడుతూ స్వేచ్ఛగా, ఆనందంగా పెరగవలసిన బిడ్డలు ఆయా చేతిలో, డే కేర్లలో, ప్రేమ రాహిత్యంలో బిక్కు బిక్కుమంటూ మసలుతుంటే, వారిలో వ్యక్తిత్వ వికాసం ఎలా కలుగుతుంది? బిడ్డ తప్పటడుగులు వేస్తున్న దగ్గర నుండి నర్సరీ క్లాసులు, స్కూలు. అర కేజీ, కేజీ క్లాసులలోనికి వచ్చేసరికి ఇరవై

కేజీల మోయలేని బరువు పుస్తకాలు. ఆ పుస్తకాల్లో ఏమున్నాయో, ఏం చదువుతున్నారో, ఎంత చదువుతున్నారో, చదివిన దానిని ఎంత వంట పట్టించుకుంటున్నారో అది ఆ పిల్లలికి, దేముడికే తెలియాలి. దడదడా ఇంగ్లిష్లో మాటాడేస్తేచాలు, పిల్లలు మేధావులైపోయినట్లు మురిసిపోతుంటారు. దానికి తోడు నేటి కంప్యూటర్ విజ్ఞానం. నెలల వయసు నుండే ఐపాడ్ లు, లాప్టాప్ లు. పుట్టిన దగ్గర నుండి మిషన్ల మీద ఆధార పడితే పిల్లల్లో ఆలోచన, అవగాహన అనేవి ఎలా ఏర్పడతాయి ?

ఏ దేశ సంస్కృతి అయినా ఆ దేశ భాష మీదే ఆధార పడి వుంటుందని నిస్సంకోచంగా చెప్పొచ్చు. వంగ దేశ సంస్కృతి బెంగాలి భాషలోని మాధుర్యం ద్వారానే రసగుళికల్లా ఆస్వాదించి , ప్రపంచ స్థాయిలో కీర్తి ప్రతిష్టలు పెంచుకున్నారు. మహోన్నత తెలుగు సంస్కృతి సాంప్రదాయాలు తేట తెలుగు తియ్యందనాల ద్వారానే మన నరనరాల్లో జీర్ణింపజేసుకోగలుగుతాము .

బ్రిటిష్ వారి పాలనలో వున్నపుడు మన సంస్కృతికి, సాంప్రదాయాలకు గ్రహణం పట్టినట్టుగా దాఖలాలు లేవు. రవి అస్తమించని సామ్రాజ్యంగా వర్ణింపబడిన ఆ రోజుల్లో, సంస్థానాధిశులుగా, జమిందారులుగా, దివాన్ లుగా రాచరికపు హోదాలో మెలిగిన వారిలో కూడా సత్సాంప్రదాయ భారతీయ సంస్కృతులు చెక్కు చెదరకుండా వుండేవి., శాంతి సౌహార్ధతలు అందరిలో వెల్లివిరుస్తుండేవి. దయ, జాలి, దాతృత్వం అనేవి పుష్కలంగా వుండేవి. కట్టుబాట్లు వుండేవి కనుక రక్షణ వుండేది. ప్రతి లోగిలి ఒక లక్ష్మి నిలయమై విలసిల్లేది. సరస్వతి వారి నాలుకల మీద నాట్యమాడేది. ధనవంతులైనా, నిరుపేదలైన ఐకమత్యంతో కలసి మెలసి సహజీవనం సాగించేవారు. ఉమ్మడి కుటుంబాలు, పాడి పంటలు, ప్రేమానురాగాలతో, ఇంచు మించు ఎల్లెడలా శాంతి, సౌభ్రాతృత్వాలు నెలకొనేవి. తాతయ్యల దగ్గర, అమ్మమ్మ, నాన్నామ్మల ఒడిలో వారుచేప్పే కథలు, నీతి పాఠాలు వింటూ పిల్లలు పసితనం నుండే హైందవ సంస్కృతిని జీర్ణింపజేసుకుంటూ పెరిగేవారు. మరి నేడో! ఒంటికాయ శొంటి కొమ్ముల్లా ఒకరో,ఇద్దరో పిల్లలు, దూర దేశాలు వలస పోయిన వారి మాట సరేసరి, స్వదేశంలో వున్నవారు కూడా పెద్దలను దరిజేరనీయడానికి ఒప్పుకోవడం లేదు. ఇటువంటి ఒంటెత్తు గుణాలు, లక్షణాలు ప్రజల్లో ప్రబలబట్టే రాష్ట్రాలలో కూడా విభజన ఏర్పడుతోంది. ఇంట గెలిచి రచ్చ గెలవాలి. ఐకమత్యం అనే బీజం ఇంట్లో నాటుకోగలిగితేనే అది విశ్వవ్యాప్తమై విస్తరిల్లుతుంది.

ఆ రోజుల్లో ఎనిమిదవ తరగతి చదివినవారు కూడా తెలుగు ప్రధానంగా చదివినా, ఇంగ్లీష్ లొ అనర్గళంగా మాటాడి అదరగొట్టేవారు. ఏడవ తరగతి వరకు చదివి జాతీయ స్థాయిలో మహోన్నత జ్ఞానపీఠ అవార్డ్ గ్రహిత శ్రీ రావూరి భరద్వాజ గారి ఒక్క ఉదాహరణ చాలదా! వారి పుస్తకాలు విశ్వవిద్యాలయంలో పాఠ్య గ్రంధాలుగా ఎన్నుకోబడ్డాయంటే పునాది అనేది ఎక్కడ వుంది ? కాలేజి ,విశ్వ విద్యాలయం చదువుల్లోనా! ఇంగ్లీష్ మీడియం స్కూళ్ళ ల్లోనా!

ఆ నాటి ఉపాధ్యాయుల్లో చిత్తశుద్ధి వుండేది. ఐదవ తరగతి లోపలే నేర్చుకున్న వేమన పద్యాలు, సుమతి శతకం మొదలైనవి తెలుగు భాషలోని మాధుర్యంతో పాటు, జీవితం పట్ల చిన్నతనం నుండే సదవగాహన నరనరాల్లో ప్రవహించేది . పిల్లల బొమ్మల రామాయణం ,మహా భారతం ,పంచతంత్ర కథలు ,చందమామ ,బాలమిత్ర లాటి

బాలసాహిత్యంలోని చిన్నచిన్న కథల ద్వారా నీతి సూత్రాల రూపంలో జీవన సత్యాలను విశదీకరించేవారు. అవి చదవడం వలన పిల్లల్లో భాషా జ్ఞానంతో పాటు, మనోవికాసం కలిగేది. ఆలోచనా సరళితో పాటు సృజనాత్మక శక్తి పెంపొందేది.

అటువంటి విలువైన పుస్తకాలు, సాహిత్యంతో పాటు తెలుగు భాషకూడా అంతరిస్తుందేమో అనిపిస్తుంటుంది. తమ పిల్లలు పెద్దవారయ్యాక తెలుగులో చదివితే విదేశాలు వెళ్ళేఅవకాశాలు దొరకవేమోననే భయంతో ఇంచుమించు రెండు దశాబ్దాల నుండి తలితండ్రులు పిల్లల్ని తెలుగు భాషకి దూరం చేసారు.

ఒకప్పుడు భారతదేశం దాస్య శృంఖ లాల్లో వున్నా, వ్యక్తులు కట్టుబాట్లలో వున్నా, మనసులు స్వేచ్చగా వుండేవి, దేశానికి స్వతంత్రం లేకపోయినా, భావాలలో, ఆలోచనల్లో స్వచ్చత , స్వాతంత్ర్యం వుండేవి. కాని నేటి స్వతంత్ర భారత దేశంలో సంపూర్ణ స్వేచ్చా స్వాతంత్ర్యాలు.

మా జన్మ హక్కు అన్నట్లు ప్రవర్తిస్తున్న మనవారిలో స్వేచ్చ అంటే కట్టుబాటు లేకపోవడం , స్వతంత్రం అంటే విచ్చలవిడితనం అని అర్థం వచ్చేలా ప్రవర్తిస్తున్నారు. ఎంత సంపాదించినా భావ దారిద్ర్యంతో బానిసలవుతున్నారు.

సైన్స్ వెర్రితలలు వెయ్యక ముందు మన భారతీయ ఆధ్యాత్మిక పరిజ్ఞానమే ఒక విజ్ఞాన శాస్త్రంగా ఆరోగ్య సూత్రాలను భోధించేది. మన ప్రతి సాంప్రదాయం వెనుక ఒక అర్థం పరమార్థం దాగి వుండేవి. సూర్యోదయానికి ముందే ఇంటి ఇల్లాలు (వారు సంపన్నులైనాసరే) నిద్రలేచి, వీది గుమ్మం ఊడ్చి, కళ్ళాపు జల్లి ముగ్గు పెడితే ఆ ఇంట మహాలక్ష్మి కొలువు తీరుతుంది అనేవారు. అవును మరి. ఆరోగ్యమే మహా భాగ్యం.. ఆ ఇల్లాలు ఉదయాన్నే చేసే ఆ పని ముందు ఏ వ్యాయామం పనికి వస్తుంది.? బారెడు పొద్దెక్కాక బద్ధకంగా లేచి, ఫాస్ట్ ఫుడ్స్ వెచ్చపెట్టుకొని, తను తిని, ఇంట్లో వాళ్ళ ముఖాన్న కొట్టి, ఏ సాయంత్రమో ఎక్సర్సైజ్ కోసం జిమ్ములకి పరుగెత్తడం ప్యాషన్ అయిపోయింది. ఉదయం నుండి కాలికి మిషను, చేతికి మిషను. మనుషులు గుమ్మటాల్లా వున్నా పట్టుమని పది అడుగులు నడవలేరు. నడవడం అంటే టైట్ జీన్స్ తో, షూస్ తో, గాలికి సుతారంగా బాబ్డ్ హెయిర్ ఎగురుతుంటే, తమని చుట్టు పక్కల వాళ్ళు చూస్తున్నారా, లేదా ! అని ఓర చూపులు చూస్తూ సాగిపోయే వాకింగ్ ప్రహసనమే కాని, ఏదయినా గుడికి కాని, షాపింగ్ కీ కాని ఒక మైలు నడిచి వెళదామంటే కళ్ళు,కాళ్ళు తేలవేస్తారు. మనుషుల్లో బలంలేదు, మనసుల్లో బలం లేదు .

'' ఈసురోమని మనుషులుంటే, దేశమేగతి బాగుపడునోయ్ ..'' అన్నారు గురజాడవారు. విగ్రహ పుష్టి వుండటం ఒక్కటే కాదు మనోబలం కావాలి, ఆత్మ బలం కావాలి .

విదేశీ నాగరికత వ్యామోహంలో పడి కొట్టుకుపోతున్న నేటి సమాజంలో వ్యక్తులు ఇలా ఈసురోమని సాగిలపడి పోతుంటే మన సంస్కృతి సాంప్రదాయాలు మరుగున పడిపోకుండా వుంటాయా ! సంస్కృతి నశించాక మానవత్వపు విలువలు ఇంకా ఎక్కడ మిగిలివుంటాయి? అవి అంతరించాక సమాజంలో అశాంతి,అలజడి విలయతాండవం చేయకుండా వుంటాయా!

విశ్వశాంతి, విశ్వమానవ సౌభ్రాతృత్వం ప్రపంచమంతటా నెలకొనాలంటే ముందు యువతలో పరివర్తన రావాలి. జీవన

విధానంలో మార్పు కావాలి, విద్యా విధానంలో మార్పు తేవాలి. ఇంటికో పూవైతే ఈశ్వరునికో మాల అన్నట్టుగా ఒక్కొక్క ఇల్లు ఒక్కొక్క శాంతి నిలయం కాగలిగితే ప్రతి వ్యక్తి హృదయాంతరాలలో దాగి వున్నశాంతి బీజాలు వెలికి తేగలిగితే విశ్వమే శాంతి వనంగా మారుతుంది, వసుదైక కుటుంబకం నెలకొంటుంది.

అలా జరగాలంటే ముందు ప్రతి ఒక్కరు తమ మూలాలను తెలుసుకోవాలి , ఆ మూలమే మనలోని అంతరాత్మ. దానితో సంబంధం కలుపుకోవాలి. ఏది మంచి ఏది చెడు వివరించి భోదించే సద్గురువు మనలోని అంతరాత్మయే. జీవితం అంటే యీ బాహ్యాడంబరాలేకాదు, కంటికి కనిపించే జిలుగు వెలుగులే కాదు, అంతర్జీవనం కూడా. లోపలనున్న అంతర్జ్యోతిని వెలిగించాలి, ఆ వెలుగులే తమ ఇంటి దివ్వెలై ప్రకాశించాలి. నేను, నా ఇల్లు, నా ఊరు, నా దేశం నుండి నా ప్రపంచంగా తమని తాము విస్తరింప జేసుకోవాలి. సర్వమానవ సౌభ్రాతృత్వానికి బాటలు పరవాలి. అది కేవలం ఆధ్యాత్మిక జీవనం వలననే సంభవమవుతుంది.

ఆధ్యాత్మికం అంటే సాంప్రదాయ పూజలు, భజనలు, గీతోపదేశాలు, పురాణ శ్రవణాలు కాదు. తన ఆత్మ గురించి తాను తెలుసుకోవడం, అంతః సత్త లోనికి మేల్కొనడం, మన అంతరాత్మతో సంపర్కం ఏర్పరుచుకోవడం. దానికొకటే మార్గం. ఉరుకుల పరుగుల ఆరాటాలు కొంత తగ్గించి, రోజులో కొన్ని క్షణాలైనా ప్రశాంతంగా కళ్ళు మూసుకొని కూర్చోవాలి. అది ధ్యానం అని అనుకోనవసరం లేదు. శరీరానికి విశ్రాంతినిచ్చినట్టే మనసుకి విశ్రాంతి నివ్వాలి.

Arise ! Awake !

And stop not till the goal is reached

అన్నారు స్వామి వివేకానంద. ఒక లక్ష్యం, గమ్యం లేని జీవితాలు వ్యర్థం, నిరర్థకం. విదేశాలకు వెళ్ళి బాగా సంపాదించాలి, లేదూ, చాలా చాలా గొప్ప పనులు చేసి అనుకున్నవి సాధించాలి , ఇదే నా లక్ష్యం, నా ధ్యేయం, గమ్యం .అని చాలా మంది అనుకోవచ్చు, అయితే అనుకున్నవన్నీ అమిరాక, సాధించాక అంతటితో తృప్తి, ఆనందం కలుగుతున్నాయా! అని అడిగితే జవాబు శూన్యం ..

మన సంస్కృతి సాంప్రదాయాల గురించి, మన ఆధ్యాత్మిక తత్వచింతన గురించి తెలుసుకోవాలని విదేశీయులెందరో తహతహ లాడుతున్నారు. ఎంతో శ్రద్ధగా మన వేదాలను, ఉపనిషత్తులను అధ్యయనం చేయడమే కాదు, ఆ తత్వ చింతనలో జీవిస్తున్నారు. మనలోని సారమంతా వారు గ్రహిస్తుంటే, వారిలోని నిస్సారాన్ని మనం తీసుకుంటున్నాము. ఉదయం లేచిన దగ్గర నుండి రాత్రి పడుక్కొనే వరకు పాశ్చాత్య ధోరణులలో జీవిస్తున్నాం.

యుగయుగాల నుండి అలుపెరుగక అలా నిలబడి వుండి,కోట్లాది ప్రజల నుండి నిలువు దోపిడిలు అందుకుంటున్నా, కోట్ల సంఖ్యలో ప్రజలు నిత్యం సందర్శిస్తూ, గోవింద నామాలతో హోరెత్తిస్తున్నా, కోట్ల విలువైన రత్నఖచిత వజ్ర వైడుర్యాలతో ఆపాద మస్తకం అలంకరించినా, మూడు పూటలా మృష్టాన్నభోజనాలు నివేదిస్తున్నా, ఇవేమి పట్టనట్టుగా, వీటితో తనకి నిమిత్తం లేదన్నట్టు, పెదవులపై మధుర మందస్మితం చిందిస్తూ, కళ్ళని నామాలతో కప్పుకొని, తానెప్పుడు యీ బాహ్య ప్రపంచానికి, బాహ్య సంపదలకు అతీతంగా అంతర్ముఖుడనై వుంటానని సూచిస్తుంటాడు శ్రీనివాసుడు. ఈ తత్వాన్ని యీ భులోకవాసులకు అందించి వారిని తనలో పోదువుకుందికే యీ కలియుగ అవతారం ధరించాను అన్నట్లుగా హస్త ముద్రల ద్వారా అభివ్యక్త పరుస్తున్నాడు. ఎంత గొప్ప భారతీయ తాత్విక చింతనను

మనకి మౌనంగా భోదిస్తున్నారు మన వేల్పులు !!..

.అది అర్ధం చేసుకోలేకపోవడం మన దురదృష్టం.

''ఈ ప్రపంచానికే గొప్ప మార్గదర్శకం కాగల ఆధ్యాత్మిక గురువు భారత దేశం '' అన్నారు శ్రీ అరవిందులు.

శాన్ ఫ్రాన్సిస్కోలో ఒక అమెరికన్ ప్రొఫెసర్ తమ అమెరికన్స్ కి ప్రతివారం మన పురాణేతిహాసాలతో పాటు, ఉపనిషత్తులు, శ్రీ అరవింద సావిత్రి పాఠ్యాంశాలుగా భోదిస్తున్నారు. ఫ్లోరిడా నుండి ఏడుపదులు దాటిన అమెరికన్ ఒకాయన గత నలభై ఐదు సంవత్సరాల నుండి భారతీయ ఆధ్యాత్మిక చింతనలో గడుపుతూ, గాయత్రీ జపం తన ఊపిరిగా జీవిస్తున్నానని వ్రాసారు.

ఎన్ని రకాల దేశస్థులు మనదేశం పైకి దండెత్తి వచ్చి మన సంపదని కొల్లగొట్టుకుపోయినా, ఊట బావిలో నీరులా ఎక్కడెక్కడో నేల మాళిగల్లో ధనరాశులు బయట పడుతూనే వున్నాయి. ఎవరు కొల్లగోట్టలేనిది, ప్రపంచస్థాయిలో మనలను మహోన్నతులుగా నిలబెట్టగలిగేది ఒకే ఒక దివ్య సంపద ఆ చంద్ర తారార్కం మన దేశంలో నిలిచి వుంటుంది, అదే ఆధ్యాత్మిక సంపద.

ఈ నాటి యీ అగచాట్లకి, అశాంతికి కారణం మనుషుల్లో ఆధ్యాత్మిక చింతన లోపించడమే. విజ్ఞాన శాస్త్రం ప్రపంచాన్ని దగ్గరగా చేరుస్తోంది. దేశాల మధ్య దూరాలు చెరిగాయి. అంతర్జాలం ప్రపంచానంతా ఒక్కటిగా అల్లుకుపోతోంది. వృత్తి పరంగా వ్యాపార పరంగా వున్నచోట వుంటూనే కంప్యూటర్ ద్వారా ప్రపంచం అంతా చుట్టి వచ్చేస్తున్నాం. అంతవరకు బాగానే వుంది. సైన్స్ దేశాల్ని కలుపుతోంది కాని మనుషుల మనసుల్ని కలపలేక పోతోంది. అలా కలప గలిగేది కంటికి కనిపించని దారం లాంటి ఆధ్యాత్మికత ఒక్కటే. ప్రేమే దైవం, ధైవమంటేనే ప్రేమ. అది పెంచుకుంటూ పోవడమే ఆధ్యాత్మికం.చెట్టులో, పుట్టలో, ఏడు కొండల్లో, హిమాలయాల్లో నక్కి కూర్చోడు దైవం. సర్వే సర్వత్రా వ్యాపించి వున్న సర్వవ్యాపి. మనలోనే వున్నాడు, మనతోనే వున్నాడు, మనముగానే వున్నాడు.

తత్ సత్

సర్వేజనాః స్సుఖినో భవన్తు.

★★★

## ఉత్తిష్టత జాగ్రత ప్రాప్యవరాన్నిబోధత!

- హైమా శ్రీనివాస్

" అమ్మోగోరండా! రేపటాల్నుంచీ మూడ్దినాలు రజేత్తున్ననండా!మేం కొత్తిల్లేసుకున్నామని సెప్పిన్నుగ దండా! గాఇండ్లల్లోకిపోతన్నమండా! బందుజలగాలువత్తరుగదాండా !అల్లకి మరియాదకాలు సేయాలగదండా. అదండీ కత " అంటూ పనంతా ముగించుకుని చీరచెంగుకు చేతులు తుడుచుకుంటూ నేనడగబోయే ప్రశ్నలన్నింటికీ ముందుగా తానే సమాధానాలు కలిపి చెప్పేసి , నోటి తోనే 'సెలవు అర్జీ' ఇచ్చేసింది లక్ష్మి. రోజంతా ఫ్రెష్ గా శుభ్రంగా ఉంటుంది., పనిచేసి అలసిపోయినట్లు కనిపించదు. ఎప్పుడూ నవ్వు మొహమే! అదీ లక్ష్మి లోని ప్రత్యేకత !

ఉదయం టిఫిన్, లంచ్, రాత్రి డిన్నర్ ఏ ఇంట్లో ఆ వేళకు పనిచేస్తుందో అక్కడే తింటుంది. అదీనీ చాలామితంగానే! రాత్రి అన్నం తిన్నఇంట్లో అప్పటికపుడే గిన్నెలన్నీకడిగి డిష్ వాషర్లో వేసి ఆన్చేసి మరీ వెళుతుంది. చివరగా పని ముగించేది మా ఇంట్లో, రాత్రి డిన్నర్ మా ఇంట్లోనే! లక్ష్మి పనంతా అయ్యేసరికి టైం చూసుకోకుండానే ఖచ్చితం గా చెప్పవచ్చు రాత్రి తొమ్మిదని! అలా గడియారంతో పోటీ పడుతూ పని చేస్తుంటుంది లక్ష్మిరోజంతా.

" మరీ మూడు రోజులెందుకే లక్ష్మి.! ఒక్కరోజు సరిపోదూ?" అన్నాన్నేను మూడురోజులు లక్ష్మి రాక పోతే ఇల్లు ఎలా ఉంటుందో ఊహించుకుంటూ,' అది సరే ' గుడెసె గృహ ప్రవేశానికి మూన్నాళ్ళు శలవా!' అని మనస్సులో అనుకుంటూనూ.

"అట్టంటా రేందమ్మోగోరండా! కొత్తిల్లల్లోకెల్తా ఉంటే మనకాడికొచ్చీ బందుజలగాలకు ఊర్జూ పెట్టాల గదండా !' మీ రెల్లి పోండా ! మేం పనుల్లో కెల్లాలని 'ఎట్టాగంటామండా! అది మరియాదంటా రాండా ? కుసీ చేసి పంపాలగదండా! " అంటూనాకే ఎదురుప్రశ్నవేసింది మా లక్ష్మి . ఏమాటకామాటే చెప్పుకోవాలి, లక్ష్మి చాలా మంచిది,ఎప్పుడూ నాగా వేయదు. కష్టపడి ఒళ్ళొంచి పని పర్ఫెక్ట్ గా చేస్తుంది. అది పని చేసిందంటే తిరిగి చూసుకోనక్కర్లేదు. ఇల్లు వదిలేసి పోయినా ఏమీ ముట్టుకోదు. అంత నమ్మకస్తురాలు. నిజాయితీ పరురాలు.

మా కాలనీలోని ఇరవై ఇళ్ళూ లగ్జరీ విల్లాలే! సగం మంది ఆడవాళ్ళు ఉద్యోగాలకు పోతే, మిగిలిన వారు కొందరు రోజంతా ఏదో పని వున్నట్లే బయటికి షాపింగ్ కో ,షికార్లకో వెళతారు, పిల్లలు బళ్ళనుండీ, మగవారు ఆఫీసుల నుండీ వచ్చేలోగా కొనటాలు పూర్తిచేసుకుని వస్తారు. మరి కొందరు బధ్ధకంగా టీవీల ముందు కూర్చుంటుంటారు. లక్ష్మి ఉదయం ఆరో గంట కల్లా వచ్చిందంటే రాత్రి తొమ్మిది గంటల వరకూ కాలనీలోని ఇళ్ళలో పనిచేస్తూనే ఉండి ,రాత్రి తొమ్మిదో గంట కాగానే ఇహ ఉండనే ఉండదు, కాలనీ వదలి తన ఇంటికి వెళుతుంది . లక్ష్మి మొగుడు తొమ్మిది గంటలకల్లా సైకిలేసుకుని వచ్చి దాని కోసం గేటు దగ్గర కాచుక్కూర్చుంటాడుట! దారి పొడుగునా ఇద్దరు ఆ రోజు వారు చేసిన పనుల గురించీ కబుర్లు చెప్పుకుంటూ వెళతారుట!. ఒకరోజున తొమ్మిదయ్యాక నేనేదో పనిచెప్తే "అమ్మగోరండా !మావోడు నాకోసం గేటుకాడ కాచుక్కూచో నుంటడండా ఏ పనున్నా రేపు సేస్తానండమ్మగోరూ ! " అని పరుగెట్టుకెళ్ళి పోయింది. వారి దాంపత్య సఖ్యతకు నాకెంతో ఆశ్చర్యమేసింది. పైగా వారి కాలనీకి ఎవరో స్వామీజీ అట, వచ్చి వారానికో మారు ఒకగంట రాత్రిపూట ఉపన్యసించిపోతాట్ట! అతడు చెప్పిన విషయాలన్నీ చెప్పుకుంటూ వెళతారుట!

లక్ష్మి అందరికీ తలలో నాలుకలా ఎవరికేం కావల్సినా చేసి పెడుతుంది. చేసిన ప్రతిదానికీ మొఖమాటం లేకుండా కష్టానికి తగిన ప్రతిఫలం అడిగి మరీ తీసుకుంటుంది. మా అందరికీ లక్ష్మి పెద్ద అండ. మేం ఎవళ్ళం ఊళ్ళకెళ్ళినా మరొకరికి బీగమిచ్చి వెళితే ఏ రోజుకారోజు ఇల్లు శుభ్రం చేసి తోటలో మొక్కలకు నీళ్ళు పెట్టి జాగ్రత్తగా చూసుకుంటుంది. దాని చెయ్యి చాలా లక్కీ హ్యాండ్. అది ఏ మొక్కవేసినా, ఏ పాదు పెట్టినా ఇట్టే బతికి బండెడు పూలో కాయలో కాయవలసిందే! మా మొక్కల సంరక్షణ తానే చూసుకుంటుంది. లక్ష్మి. మనస్సు మంచిది. ఏదీ కావాలని నోరు తెరిచి అడగనే అడగదు. ఏదైనా ఇస్తే తీసుకుంటుంది వద్దనకండా, అలాంటి లక్ష్మి మూడు రోజులు రజా వేస్తే మా కాలనీ అంతా ఎమైపోను? ! మాకెవ్వరికీ మా ఇళ్ళ గురించీ సరిగా పట్టదు,తెలీదు కూడా.

" అమ్మగోరండా ! మరి మీరంతా వొత్తారుగదండా ! మర్చేపోయిన్నండా !నా మతిమండా !మా ఇంటోడు కారడ్లిచ్చి' ఓచీ లచ్చిమీ! మీఅమ్మ గోర్లందర్లకూ కారడ్లిచ్చి, రమ్మని పిలుయే !చుబం అవుద్ది. అట్టంటోల్లంతా మనింటో కాలిడితే చుబమే చుబం' అని మరి మరి సెప్పిండండా."అంది లక్ష్మి, దాని యాస భాష మాకొచ్చింది తప్ప దానికి మా భాష రానే లేదు. భాషదెలా ఉన్నానిజానికి దానికున్నమంచితనం మాకు లేదని నిర్మహమాటంగా అంగీకరించాల్సిందే!

పసితనంలోనే తల్లితో పాటు తిరుగుతూ పనులన్నీనేర్చేసుకుందిట! వాళ్ళనాయన తాగుబోతైతే వాళ్ళమ్మే అన్నీచూసేదిట. ఐతే ఏ బిడ్డకూ సదూసెప్పించలేకపోయిందిట! చూశారా !ఇలా లక్ష్మి భాష మాకొచ్చేసిందిమరి! వాళ్ళమ్మ పెద్ద పెద్ద కాలనీల్లో పనిచేస్తూ లక్ష్మిని వెంటేసుకు తిరగటంవల్ల అన్ని భాషలు మాట్లాడే వాళ్ళ ఇళ్ళలో పని చేయటం వల్ల దీనికి చిన్నతనం నుండే అన్ని భాషలూ కొద్దికొద్దిగా వచ్చాయి. అన్నీకలగలిపి మాట్లాడుతుంటుంది.

లక్ష్మి, ఆమె ఇంటాయనా పిల్లలూ, తమ్ముళ్ళూ , మరదళ్ళూలూ, వారి పిల్లలూ అంతా కలిసిన ఉమ్మడి కుటుంబం లక్ష్మిది. అందరికీ దీనిమాటే వేద వాక్కు. ఆమె చాలా తెలివైందని, చాకచక్యంగా పనులన్నీ చక్కబెడుతుందని ఆ కుటుంబం నమ్మకం, దాన్నెప్పుడూ వమ్ము చేయలేదు లక్ష్మి. ఎలా తెలుసుకుందో కానీ వివేకానందుడంటే ఆమెకు చాలా భక్తి.' ఆ మగానుబావుని మాటలు శానాబాగుంతయమ్మగోరూ! కట్టపడి పని సేత్తేనే మడిసి బాగుపడతడమ్మ గోరండా, దేవుడిచ్చిన జీవితాన్నిసరిగ్గుపయోగించాలండా,

మనొంట్లోబలగాన్ని సరిగ్గుపయోగించకుంటే ఆ దేవుడు కోపగిత్తాడండమ్మాగోరూ! మా కోలనికాడికి రాతిర్లప్పుడు ఓ సాములోరొచ్చి మంచిషయాలన్నీ సెప్తుంటడమ్మ గోరండా ! 'అని ఖాళీ దొరికితే ఎప్పుడైనా చెప్తుంటుంది. అలాగే తాను కష్టపడి రోజంతా మిషన్ లాగా పనిచేస్తూనే ఉంటుంది. లక్ష్మి నుండీ చాలానే నేర్చుకోవాలి. బంధు మర్యాద, అపేక్ష పొదుపు!, ఒళ్ళొంచి పనిచేయడం! అన్నీనీ!. అవన్నీ మాకాలనీలో ఎవ్వరి నిఘంటువుల్లో లేనివే మరి!

" ఏంటమ్మొగోరండా ! తప్పకొత్తరు గదండా! ఇద్గోండి కారద్దు." అంటూ నాకు గృహపవేశపు కార్డు ఇచ్చి," అమ్మొ గోరండా అందరమ్మ గోర్లకీ ఇయ్యాల, బెగెళ్తానండమ్మొగోరో! అందరూ కలిసొత్తారు గదండమ్మొ గోరూ?" అంటూ గబగబా వెళ్ళిపోయింది . లక్ష్మి అలా వెళ్ళగానే నేను ఇంటర్కాం వద్దకూర్చుని అందరితో మాట్లాడ సాగాను.

“ ఏమండీ వినోదినిగారూ !ఇన్నేళ్ళుగా మనకాలనీలో పని చేస్తున్న లక్ష్మి కొత్త ఇంట్లో చేరుతుందిట! గృహప్రవేశం కార్డుకూడా తెచ్చి అందరికీ ఇచ్చినట్లుంది, వెళ్ళకపోతే బావుండదేమో! లక్ష్మికి కోపం వచ్చి మనిళ్ళలోపని మానేస్తే ఇలాంటి సర్వెంట్ మైడ్ మనకు దొరకడం కష్టం.ఏమంటారు?” అన్నాను.

“ నేనూ అదే అనుకుంటున్నానండీ నర్మదగారూ! వెళ్ళి ముఖం చూపించి వస్తే సరి! పైగాఆదివారం కూడానాయె! మళ్ళీ అది మనస్సు నొచ్చుకుని మానేస్తే నాకసలు అవదు అది లేకుండా.” అంది వినోదిని.

“ నా ఆఫీసు టైంకి వచ్చేవాళ్ళెవ్వరూ నాకు దొరకరు. నేను తప్పక వస్తాను.” అంది వాసవి.

“ లక్ష్మి లేపోతే నా బ్యాంక్ ఉద్యోగ మేమైపోను? రాత్రి వంట కూడా చేసి ఉంచుతుంది లక్ష్మి, నేనూ వస్తాను “ అంది దమయంతి.

“ లక్ష్మిని వదులుకునే ప్రసక్తేలేదు.ఎవ్వరు రాకున్నా నేను వెళతాను “ అంది వనజ.

“నాపిల్లల కెవరు వండిపెట్టి , స్కూల్ బస్ ఎక్కిస్తారు? మే మిద్దరం ఏడుగంటలకు ముందే బయటికెళ్ళిపోతామాయె! నేను రానని ఎలా అనుకున్నారు ?” అంది అనుపమ.

“ రిటైరయ్యాక ఈ మోకాళ్ళనొప్పులు వచ్చి నిల్చోలేకపోతే పాపం లక్ష్మేగా మాయిద్దరికీ ఇంత వండి పెడుతున్నది వేడివేడిగా ! కార్లో వెళ్ళివద్దామంటే నేను రెడీ!” అంది అనూరాధమ్మ, పాపం ఇటీవలే స్కూల్ ప్రిన్సిపల్ గారిటైరై మోకాళ్ళ నెప్పులతో మంచం దిగలేక టీ.వీ.తో కాలక్షేపంచేస్తూ అవస్త పడుతున్నది.

ఇలా అంతా అంగీకరించాక, ఆరు బయటి పిల్లల ఆటస్థలంలో కాలనీ వాసులంతా, ఆడ, మగా భోజనాలయ్యాక అలవాటు ప్రకారం ఆరాత్రి నడుస్తూ మాట్లాడుకో సాగారు.

“ మనం ఊరికే లక్ష్మిఇంటి గృహ ప్రవేశానికి వెళ్ళటం ఏం బావుంటుంది? మన స్థాయికి తగినట్లు అందరం కల్సి ఏదో ఒక మంచి బహుమతి తీసుకెళితే లక్ష్మికి సంతోషంగా ఉంటుంది. ఏమంటారు “ అనే ప్రొపోజల్ పెట్టింది ప్రేమావతి.

“ అలాగే చెప్పండి ఎంత వేసుకుందాం? ఏం కొందాం? “ అని అంతా చర్చించాక “లక్ష్మికి ఒక కలర్ టీ.వీ ప్రెజెంట్ చేస్తే ఎలా ఉంటుందంటారు ?”అని ఉమ అంది.

“ అది ఇంట్లో ఎప్పుడుంటుంది గనుక కలర్ టీ.వి. చూడదు. పైగా దాని గుడిసెలో కరెంట్ ఉంటుందో లేదో! అసలు టి.వి. పెట్టుకునేంత స్థలం ఉండాలి కదా?” తన సంశయం వెలిబుచ్చింది” వందన. చర్చవాడిగా వేడిగాసాగి చివరకు అంతాకల్సి ఒక కవర్లో తలో ఐదు వందలూ వేసుకుని ఈరవై ఇళ్ళకూ కల్సి పదివేలు పెట్టి ఇస్తే ఘనంగా ఉంటుందని నిర్ణయించారు.

అలా ఆ కాలనీ మహిళలంతా లక్ష్మి కొత్తింటి’ గృహ ప్రవేశానికి ‘ప్రజెంటేషన్ తో వెళ్ళే ప్రొపోజల్ను ఏకగ్రీవంగా ఆమోదించారు. మగ వాళ్ళుమాత్రం “ మీకేమన్నాపిచ్చా! చాదస్తమా! పనిమనిషి ఇంటికెళ్ళడమేంటి! వింటే ఎవరైనా నవ్వి పోతారు! అసలా గుడిసెలో మీరంతా ఎక్కడ కూర్చుంటారు?” అని కోప్పడ్డారు.

“మీకేం ఏమైనా అంటారు, అది పని మానేస్తే అయ్యేది మా పనే! మీకు తెల్లారగానే కాఫీకి పాలెవరు తెస్తారు? ఉదయాన్నేనేవెళ్ళి తేలేను. పోనీమీరే మన్నాతెస్తారా ! లక్ష్మిపనిలో చేరక ముందు ఆ పాల పిల్లాడు ఏడింటికో ఏడున్నరకో పాలప్యాకెట్స్ వేస్తే ‘కాఫీకాఫీ’ అని గొడ వెట్టేవారా కాదా!? అది పనిలో చేరినప్పట్నుండీ ఉదయం ఆరో గంటకే అన్నిళ్ళకూ పాలప్యాకెట్లు తెచ్చిస్తోంది. కనుక మేం వెళ్ళక తప్పదు. కావలిస్తే మీరూ రండి ఇదో చూడండి గృహ ప్రవేశం కార్డు

! " అంటూ తన్మయి భర్త భరత్ కు ఇచ్చింది.

భరత్ కలెక్టరేట్లో గజిటెడ్ ఉద్యోగి. కలెక్టర్ గారికి పీ.ఏ. 'ఆ ఇన్విటేషన్స్ తమ ఆఫీసులో అందరికీ రావటమే కాక కలెక్టర్ గారు రేపు ఆ గృహ ప్రవేశానికి వెళ్ళాలనీ త్వరగా రమ్మనీ చెప్పారు.'భరత్ కేమీ అర్ధం కాక భార్యతో " ఇదేంటి తన్మై ! ఆశ్చర్యంగా ఉంది." అన్నాడు. "ఆ కాంపౌండ్లో ఓ చిన్నగుడిసె వేసుకుని ఉన్నారేమో! లేదా రాత్రి కాపలాకోసం ఒకపాకవేసుకోనిచ్చి ఉంటారు ఆ ఇంటి వారు" అంది తన్మై.

" మరి పేర్లు మహాలక్ష్మమ్మ , మహేశ్వరబాబు అని ఉన్నాయే!"

" మీ దంతా చాదస్తం . మన సర్వెంట్ మైడ్ పేరు లక్ష్మి. మహాలక్ష్మి అనే పేరెవ్వరికీ ఉండదాఏం? అనవసరపు అనుమానాలు ఆపేసి పడుకోండి మేం తప్పకవెళతాం." అని లైట్లార్పేసి పడుకుంది తన్మై.

అందరూ గుర్తుంచుకుని ఎదురు చూసిన ఆదివారం రానే వచ్చింది. అందరికీ ఆ ఆదివారం చాలా బాగా గుర్తుంది. ఎందుకంటే గత రోజంతా లక్ష్మి రాకపోడంతో అంతా ఇళ్ళు ఊడ్చలేక గిన్నెలు రుద్ది డిష్వాషర్లో వేసుకోలేక నానా ఇబ్బందీ పడటం వలన అంతా వెళితే లక్ష్మి ఆ మరునాడైనా తప్పక వస్తుందని వారి నమ్మకం, ఆశా కూడానూ. అందుకే ఆ ఆదివారం అందరికీ బాగా గుర్తుంది.

" ఇంట్లోపిల్లలతో మేం వేగలేం మీరే తీసుకువెళ్ళండి, మేం ఎక్కడైనా హోటల్లో తినేస్తాం, మీరూ అలాగే ఎక్కడైనా తిని రండి పిక్నిక్లా గడిపేయండి " అని మగవారంతా చెప్పడం వల్ల, వారి వారి పిల్లలతో సహా బయల్దేరారు. కార్లకు డ్రైవర్లు లేని వారు మాత్రం మగవారు కొందరు రాక తప్పలేదు.

"కానీ ఇదీ బానేవుంది ,'లక్ష్మిగృహ ప్రవేశం 'చూశాక ఎటైనా పార్కుకో, దేవాలయానికో, షాపింగ్ కో వెళ్ళి ఎక్కడో లంచ్ కానిచ్చేసి వెళదాం,ఇంట్లో వండటం నావల్ల కాదు" అనుకున్నారంతా. ఎలాగో ఉదయాన్నేలేచి అంతాచేరి 5, 6 ఇన్నోవాకార్లలో సర్దుక్కూర్చుని బయల్దేరారు.

ఆ ప్రదేశం ఊరికి చివరగా ఉన్నా చాలా విశాలంగా ఉంది. చుట్టూ చల్లని నీడనిచ్చే పండ్ల చెట్లు.పూల మొక్కలు. మధ్యలో చక్కని అందమైన మూడు అంతస్తుల భవనం.! గాజు కిటికీలు! తమ ఇండ్లకంటే లగ్జరీ ఇండిపెండెంట్ హౌస్లా ఉన్నఆ పెద్ద బంగళాని చూసి అంతా ముచ్చటపడ్డారు.ఇంటి ముందు మూడు నాలుగు కార్లు, బేండు మేళం ,పచ్చని మామిడాకుల తోరణాలు, అరటి పిలకలు, పూలమాలలతో అలంకరించిన ఆ పెద్ద ఇల్లు చూడముచ్చటగా ఉంది. ఇంటి ముందు కార్లాపి, చిన్నపాటి గుడిసెకానీ, రేకుల షెడ్డు కానీ ఉందేమోని వెతకసాగారు.ఇంతలో ఆ ఇంట్లోంచీ చిలక పచ్చని కంచిపట్టు చీరకట్టుకున్న ఒక వనిత గబగబా బయటికివచ్చి, కార్ల వద్ద దిగి ఉన్నవారి దగ్గరికి రాసాగింది. తాము ఆ ఇంటి గృహప్రవేశానికి వచ్చేవారమని భావించి ఆహ్వానించను వస్తున్నదని అంతా అనుకున్నారు. ఆమె కార్లదగ్గరికి వచ్చి"మాలచ్మలంతా ఒక్కపారెల్పోయొచ్చీసి నారేంటండమ్మగోరండా!" అంటూ సంబరంగా పలుకరించింది. ఆమె తమ సర్వెంట్మైడ్ లక్ష్మిగా గుర్తించి అంతా నిర్ఘాంతపోయారు. అందర్లోకీ ముందుగా తేరుకున్న వసంత ," ఏమోయ్ లక్ష్మీ!ఎక్కడ నీ ఇల్లు ? చూసి వెళ్ళిపోతాం " అంటూ పలకరించింది.

" అదేంటమ్మగోరండో! మీరంతొచ్చింది మా ఇంటోకేగా? రండెళదారిలోగాకి " అంటూ చనువుగా వసంత చేయి పట్టి లాగి అందర్నీ లోనికి ఆహ్వానించింది లక్ష్మి. అంతా ముఖముఖాలు చూసుకుంటూ, మనస్సుల్లో 'పాపం ఇంత ఇంటికి నైట్ వాచ్మన్

గాలక్ష్మి భర్తని అపాయింట్ చేసి ఉంటారు! అందుకే ఇది తమ ఇల్లులా ఆనందపడుతున్నట్లుంది.' అను కుంటూలోనికి దారితీశారు.

లోపల హాల్లో షుమారుగా వంద కుర్చీలు వేసి ఉన్నాయ్. అన్నిట్లోనూ ఆడ మగ జనాలు ,పిల్లలూ కూర్చునున్నారు. వారిలోంచీ కొంతమందిని లేపి వీళ్ళందరినీ కూర్చోబెట్టింది లక్ష్మి. త్వరగా తన ఇల్లు చూపితే దానికిచ్చే బహుమతి ఇచ్చేసి,' ఎల్లుండి నుండీ తప్పక వస్తావుగా! 'అని అడిగి వెళ్ళిపోదామని అంతా లోలోపల అనుకుంటుండగానే ఎవరో "కలెక్టర్ గారు వస్తున్నారు, కలెక్టర్గారు వస్తున్నారు దారివ్వండి" అంటుండగానే కలెక్టర్ గారు , ఆయన వెనకాలే ఆయన పర్సనల్ సెక్రెటరీ భరత్, మీడియా జర్నలిస్టులూ గబగబా హాల్లోకి వచ్చారు. కలెక్టర్ ఎదురుగా ఉన్న వేదిక వద్దకు రాగానే, ఎవరో పట్టుపంచతో ఉన్నఒక వ్యక్తి వచ్చి మెడలో పూలమాల వేయగా, అది తీసి ఆయనమెడ లోనే వేశాడు కలెక్టర్ . కెమెరాలు క్లిక్ మనిపిస్తూ, మైక్ లను కలెక్టర్ గారి మూతి దగ్గర పెట్టారు జర్నలిస్టులంతా.

"ఈరోజు నా జీవితంలో పర్వదినం.కలెక్టర్ గా నేను ఇంత ఆనందించిన రోజు ఇదే అని మనస్ఫూర్తిగా చెప్తున్నాను. ఈ మహా లక్ష్మమ్మ, మహేశ్వరబాబులు దేశంలోని వారందరికీ ఆదర్శ శ్రమజీవులు. వీరిది ఉమ్మడి కుటుంబం. మేము ప్రభుత్వం తరఫున వీరికి పదేళ్ళ క్రితం కుటుంబానికి ఒక మేక, గొఱ్ఱె, గేదె, కోడిపెట్ట చొప్పునఇచ్చాం. వీరంతా ఉమ్మడి కుటుంబమైనా ప్రతి జంటకు ఒకటి చొప్పున ఇచ్చినవి, వీరి కుటుంబానికి వచ్చిన ఐదేసి జీవాలను వీరు ఈనాడు పెంచి వీరిలా పెద్ద ఉమ్మడి కుటుంబంలా చేసి, వాటి మీద వచ్చిన అయివేజును తిని తాగివృధా చేసుకోక శ్రమ జీవనం గడిపి, ప్రభుత్వం అందించిన సాయంతో ప్రభుత్వానికే గర్వకారణంగా నిలిచారు. మేము ఇళ్ళస్థలాల క్రింద పంపిణీ చేసిన స్థలంలోపండ్ల తోటలూ, పూల మొక్కలూ వేసి పెంచుకుని ఆ రాబడిని సైతం బ్యాంక్ లో దాచుకుని, బ్యాంక్ తరఫున అందిన అప్పుతో ఈ భవనం నిర్మించుకున్నారు, వీరంతా స్వయంగా కూలీలతో కలసి పనిచేసి ఈ భవన నిర్మాణం చేసుకున్నారు. అందుకే ప్రభుత్వం వీరిశ్రమను, దీక్షనూ గుర్తించి ఈభవనాన్నిజిల్లా ప్రభుత్వ కార్యాలయానికి అద్దె క్రింద తీసుకుంటున్నామని తెలియజేయను ఆనందిస్తున్నాను. ఈరోజు నుండీ ఇది కలెక్టరేట్ భవనం. ఈ భవనం ఈ రోజునుండీ 'లక్ష్మీ నిలయం' గా పిలువబడు తుందని తెలియజేస్తున్నాను. మానవులు తలచుకుంటే సాధించలేనిది లేదని ఈ లక్షమ్మ నిరూపించింది, ఈమెను నేను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నవారూ, ఇళ్ళలోనే ఉండేవారూ తమ పనులు తాము చేసుకోను బాధ పడుతూ, సర్వెంట్ మెయిడ్స్ మీద ఆధారపడి, తగిన శరీర శ్రమ లేక అనారోగ్యం పాలబటం. డాక్టర్ల చుట్టూ తిరగడం మనకు తెల్సు. మేము అప్పు ఇప్పించను 'ఎలా తీరుస్తారని? అడగ్గా' , ఈ లక్ష్మమ్మ ఉదయం నుంచీ రాత్రి వరకూ ఇళ్ళలో పనిచేస్తూ సంపాదిస్తుందనీ ఆ ఆదాయం అంతా కడతామనీ చెప్పారు. ఇప్పుడే భరత్ ఈమె తన కాలనీలో పని చేస్తుందని చెప్తున్నాడు. అంతా కష్టపడి సంపాదించుకుని దాచుకుని భద్రపరుచుకుంటే పేదరికమన్నదే ఉండదు. ఇలా శ్రమైక జీవన సౌందర్యాన్ని అందరికీ ఆదర్శంగా చూపిన ఈమెను ప్రభుత్వం తరఫున అభినందిస్తూ ఈ ఇరువురికీ సన్మానం చేస్తున్నాం. ఈ ఏడాది మహిళలకిచ్చే 'పొదుపులక్ష్మి 'అవార్డుకు లక్షమ్మ పేరును రెకమెండ్ చేస్తున్నాం" అని చెప్పి రిబ్బను కత్తిరించి దంపతులిద్దరినీ పూలమాలలతో సన్మానించి, శాలువాలు కప్పి, గౌరవించి, సత్కరించారు కలెక్టరు గారు. ఆహూతులంతా

ఆశ్చర్యంగా చూస్తూ తమను తామే మరచిపోయారు. చప్పట్లూ, కెమెరా క్లిక్ల తోహాలు దద్దరిల్లి పోయింది.

చివరగా లక్ష్మి మైక్ అందుకుని "అయ్యలారా! అమ్మలారా! మా కోలనీ కాడికి రాత్రుల్లొచ్చి మాకు మంచి ఇసియాలు బోదించే సాములోరు, యియేకానంద సావి సెప్పిన మాటలిన్నాక మేవంతా చెడ్డలవోటులు మానేసుకుని కట్టబడి సంపాదించినసొమ్ముని జాగరత్త సేసుకొని మా పిలగాల్లందరిని సదియించి బాగుసేయాలనుకున్నామండా! అట్టాగే మా ఇలాకా పిలగాల్లంతా రేత్తిరి బల్లకెల్లి సదూకుని ఇప్పుడిప్పుడే ఐచ్చూల్ల కెలుతున్నారండా! కడుపులో అన్నం పడినప్పుడే యాంపనిసేసి ఆబలాన్నుపయోగించాలో సెప్పిన యియేకానందసావి సిస్సులోరు ఈసావు లోరే మాకు దేవులండా! ఈ మా ఇంటికి కలకటేరుగారు' లచ్చిమీనిలయామని పేరెడతానన్నరు, కానీ దీనికి 'ఇయేక నిలయం' అనే పేరెట్టమని కోరతాండా." అని చెప్పి అక్కడ వివేకానంద స్వామిలాంటి దుస్తుల్లో వున్న స్వామీజీకి పూల మాలవేసి, శాలువా కప్పి, లక్ష్మీ, ఆమె భర్తా నమస్కరించారు. ఆ స్వామీజీ వాటితో తిరిగి వారినే సన్మానించారు. అంతా చప్పట్లు చరిచి స్పందించారు. ఆయన ముఖంలో కనిపిస్తున్న ఆనందం, దయ ,కరుణ ,ప్రేమ ,పట్టుదల అందర్నీ ఆశ్చర్య పరిచాయి. జీవితం తమ కోసం మాత్రమే ఖర్చుచేసుకుంటున్న అక్కడ చేరిన వారంతా ఆయన్నుచూసి సిగ్గుపడ్డారు కూడానూ.

లక్ష్మి "అయ్యా! సావిగోరండా! మాకు సెప్పిన ఇసియాలు కాసిన్ని సెప్పండయ్యగోరా!" అని నమస్కరించి అడిగాక ఆ స్వామీజీ లేచి,అందరినీ చూసి చేతులు ముకుళించి" వివేకానంద స్వామివారు చెప్పిక నాల్గు మాటలు , నేను లక్ష్మమ్మ కాలనీ వాసులకు అనేక విధాలుగా కథల్లో చెప్పినవి ఒక్క నిముషం చెప్తాను.- ఈమె తమ గృహానికి 'వివేకనిలయం 'అనే పేరుపెట్టమని కోరటం ఈమె వివేకానికి చిహ్నం .

'యువతా! మేల్కొనండి! మీ శక్తిని తెలుసుకోండి! మీ మేధను వృధా చేయకండి. దేనికి భయపడకండి, పాపానికి తప్ప. మీరు అద్భుతమైన ఘన కార్యాలు సాధించగలరు, భయం మనిషిని కృంగదీసి ఎందుకూ పనికి రాకుండా చేస్తుంది. ఈ ప్రపంచంలోని ఘోరమైన బాధలన్నింటికీ అసలు కారణం భయమే. భయమే దుఃఖాలన్నిటికి కారణం. నిర్భయత్వం మనకు స్వర్గాన్నిచూపితే భయం దుఃఖాన్ని కల్గిస్తుంది. కాబట్టి లేవండి! మేల్కోండి! గమ్యాన్నిచేరుకునేవరకూ ఆగకండి! మీలోని శక్తినంతా ఉపయోగించండి. మీరు ఏమైనా సాధించగలరు. దీన్నినమ్మండి. మీరు బలహీనులని భావించకండి. ధీరులై లేచి నిలవండి, మీ లోని దివ్యత్వాన్ని ప్రకటించండి. ఓ సింహాల్లారా రండి! 'మేము గొర్రెలం' అని మీరు అనుకునేలా చేసే ఆ మాయను విసిరి పారేయండి. మీరు అనంతమైన ఆత్మస్వరూపులు. స్వేచ్చాజీవులు, ధన్యులు, శాశ్వతులు, మీరు వస్తువులు కాదు, శరీరాలు కాదు అని భావించండి. వస్తు సంపదలు మన బానిసలు. మనం వస్తు సంపదకు బానిసలం కారాదు. మనకిప్పుడు కావలసినది ఏమిటంటే. వేదాంతంతో జత గూడిన శాస్త్రీయ విజ్ఞానం, మన ల్ని సరైన దారిలో పెట్టే ఆదర్శంగా బ్రహ్మ చర్యం. వాటితో పాటు శ్రద్ధ, ఆత్మవిశ్వాసం, పట్టుదల. మహా వీరుడైన హనుమంతుణ్ణి మనం ఆదర్శంగా చేసుకోవలసి ఉంది. ఆయన తన ఇంద్రియాలను పరిపూర్ణంగా అదుపులో ఉంచుకో వడమే కాక అద్భుతమైన సూక్ష్మ బుద్ధి కలవాడు. గురువుకు ఏ మాత్రం ఎదురు చెప్పని విధేయత, కఠోరమైన బ్రహ్మచర్యం – ఇవే విజయ రహస్యాలు. లేచి నిలబడి, ధైర్యంగా, బలంగా ఉండాలి. బాధ్యతల్నిమన భుజాల మీద వేసుకోవాలి.

మన తలరాతలకు సృష్టికర్తలం మనమేనని తెలుసుకోండి. తనమీద తనకు నమ్మకంలేని వాడే నాస్తికుడు, మనలోనే దైవం ఉన్నాడు. దేవుణ్ణి నమ్మనివాడు కాదు నాస్తికుడు, తన మీద తనకే నమ్మకంలేని వాడు నాస్తికుడని వివేకానందవాణీ! ఈవిషయాలన్నీ లక్ష్మమ్మ కాలనీ వాసులకు చెప్పాను. ముఖ్యంగా ఈమె కుటుంబ సభ్యులంతా పాటించి విజయం సాధించారు. ఇది చాలా ముదావహం!. ఈమెను ఆదర్శంగా తీసుకుని యువత అంతా ముందుకు సాగి విజయాలు సాధించాలి, మనల్నిమనం ఉద్ధరించుకుని ఇతరులను ఉద్ధరించే ప్రయత్నం చేయాలి. ఉత్తిష్టత జాగ్రత ప్రాప్యవరాన్నిబోధత. " అని అందరికీ నమస్కరించి కూర్చున్నారు స్వామీజీ.

వసంతాదులు సిగ్గుపడ్డారు, ఆలోచనలో పడ్డారు. అప్పుడు తోచింది వారికి, తమ ఇరవై ఇళ్ళకూ కలిపి మొత్తం లక్ష్మి నెల ఒరుంబడి నలభైవేలు! కొత్తగాఉద్యోగం లో చేరిన సాఫ్ట్ వేర్ ఇంజనీరంత!! సం.కి లక్ష్మి షుమారుగా ఐదు లక్షలు సంపాదిస్తుంది, ఆదాయపు పన్ను లేకుండా. తన జీతం అంతా ఏం చేస్తుందో తామెప్పుడూ అడగనూ లేదు, అది చెప్పనూ లేదు. లక్ష్మిఇలా జీతమంతా దాచుకుని ఈ ఇల్లు నిర్మించుకోడం నిజంగానే అద్భుతం అనుకున్నారంతా. తామంతా ఎన్నోవిషయాలు వింటారు, చూస్తారు, చదువుతారు, చెప్తారు కానీ ఆచరించరు. లక్ష్మినిజంగానే ఆదర్శ మహిళ. తాము తమ సమయాన్నీ, ధనాన్నీ ,వంట్లో శక్తినీ ఎంత దుర్వ్యయం చేస్తున్నామో తలుచుకుని సిగ్గు పడసాగారు. లక్ష్మి ముందు తాము చిన్న బోయామని లోలోపల అనుకున్నారు. స్వయంశక్తితో, ఉమ్మడి కృషి, శ్రమతో, పొదుపుగా, ఐకమత్యంతో నిర్మించుకున్న ఆ ఎత్తైన భవనంలోని లక్ష్మి వారి కంటికి ఒక అమ్మవారులా, పైపై కెదిగిన విశ్వరూపంలా, మహిషాసుర సంహారిణి' దుర్గామాత'లా, నరకాసురుని వధించిన సత్యభామలా, మహిళా వివేకా నందునిలా కనిపించింది, ఉన్న ధనాన్నీ కాలాన్నీ వంట్లో శక్తినీ దుబారాగా చేసుకుంటూ, తామంతాఎలా ఆనందం అనుభవించి, జల్సాచేయాలాని తమ కున్నదంతా దుర్వ్యయం చేస్తున్నారో అందరికీ అర్థమైంది. అక్కడికి వచ్చిన విద్యా వంతులైన ఉన్నత కుటుంబాల, స్త్రీ పురుషులంతా తమకు తామే కుంచించుకుపోయిన మరుగుజ్జుల్లా భావించుకున్నారు. వారందరి 'వివేక' లోచనాలు తెరుచుకున్నై .

★★★

# వృక్షో రక్షతి

- ప్రతాప వెంకట సుబ్బా రావు

పొద్దున్నే పేపర్ చేతుల్లోకి తీసుకున్న నేను ఒక ప్రకటనకి ఆకర్షితుడనయ్యాను.

**శ్రద్ధాంజలి**

**గత సంవత్సరం మా కాలనీలో మా స్వార్థానికి 153 చెట్లు అసువులు బాసాయి. వాటి ఆత్మకి శాంతి కలగాలని కాలనీ కమ్యూనిటీ హాలులో ఈ ఆదివారం ఒక కార్యక్రమం ఏర్పాటు చేశాము. వృక్ష ప్రేమికులందరూ వచ్చి భాగం పంచుకుంటారని ఆశిస్తున్నాము.** – వాసవి కాలనీ వాసులు

ఆదివారం.

మా ఆవిడ పెట్టిన ఉప్మా పెసరట్టు లాగించి.. చిక్కటి కాఫీ తాగి.. తాపీగా మాకు రెండు కిలోమీటర్ల దూరంలో వుండే ఆ కాలనీకి బయలుదేరాను.

నేను కమ్యూనిటీ హాలుకి చేరుకునేసరికే ఓ వందమంది దాకా వచ్చి వున్నారు. నన్ను సాదరంగా ఆహ్వానించి హాల్ లోపలికి తీసుకెళ్ళి కుర్చీలో కూర్చోబెట్టారు. నేను గమనించిందేమిటంటే, అన్నిచోట్లా థర్మాకోల్ పై చెట్ల బొమ్మలు వేసి వాటికింద చక్కటి కొటేషన్లు రాసారు. అంతేకాకుండా హాల్ చుట్టుపక్కలా, హాల్లోనూ పూల కుండీలను చక్కగా అలంకరించారు. నిర్వాహకులు వాళ్ళ కుటుంబ సభ్యులూ ఆకుపచ్చటి దుస్తులు ధరించారు. విచ్చేసిన అందరికీ పచ్చదనపు విలువను చాటిచెప్పే బ్యాడ్జీని దానిక్రింద భాగానికో నల్లటి గుడ్డ ముక్కనీ తగిలించారు. మైకుల్లోంచి మంద్రంగా విషాద సంగీతం వినిపిస్తోంది.

అరగంటలో కార్యక్రమం వృక్ష ప్రార్థనతో ప్రారంభమైంది.

అధ్యక్షుడి ప్రారంభోపన్యాసం:

“ఆహుతులకి సాదర ఆహ్వానం. ‘వృక్షో రక్షతి రక్షితః’ ఇది అందరికీ తెలిసిందే. వృక్షాలు మనకి ప్రాణవాయువు నిచ్చి కాపాడుతున్న మూగ జీవాలు. మనిషి జీవితం మామిడాకుల శుభంతో మొదలై.కట్టెలలో కాల్చే అశుభంతో ముగుస్తుంది. చెట్టు యొక్క ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. సకుటుంబ వనభోజనాలకి వేదికవుతుంది. భోజన వడ్డనకి అరిటాకవుతుంది..నీళ్ళు తాగడానికి దోనె అవుతుంది. విసన కర్రవుతుంది..ఆచ్ఛాదనకి అంగ వస్త్రమవుతుంది. మనకే కాదు సమస్త జంతు జాలానికీ ఎండ నుండి వర్షం నుండి కాపాడే గొడుగవుతుంది.. ఆకలితీరుస్తుంది. ఇలా జీవ మనుగడకి అడుగడుగునా తోడుంటుంది. ఇది మీకందరికీ తెలియదని కాదు. మరోసారి పునశ్చరణ అంతే.

చెట్టు విలువ తెలిసీ దాన్ని పట్టించుకోకపోవడం మనకే చెల్లింది. అలా మా నిర్లక్ష్యానికి గత సంవత్సరం 153 చెట్లు బలయ్యాయి. ఇది చెప్పింది ఏ మేధావో.. పర్యావరణ పరిరక్షణ సభ్యుడో కాదు.. ఓ ఏడేళ్ళ అబ్బాయి. వాడు ఎక్కడ చెట్టు నరుకుతున్నా అడ్డుకున్నాడు.. తన నోట్ పుస్తకంలో రాసుకున్నాడు. నేను ఒకసారి రోడ్డు విస్తరణ కోసం చెట్లు నరుకుతుంటే.. వాడి తాపత్రయం చూశాను. సిగ్గేసింది. అప్పుడే మనసు ఈ కార్యక్రమానికి నాంది పలికింది.

దయచేసి మీ అందరికీ ఓ విజ్ఞప్తి. చెట్లని ప్రాణులుగా చూడండి. అప్పుడే వాటికి అపకారం తలపెట్ట బుద్ధి కాదు. ఒకవేళ అవి నేల రాలినా వాటికి మనుషుల్లాగే శ్రాద్ధకర్మలు చేయండి అలా అన్నా వాటి ఆత్మకి శాంతి చేకూర్చుదాం.

ఇప్పుడందరూ లేచి నిలబడి మరణించిన చెట్ల ఆత్మ శాంతికై రెండు క్షణాలు మౌన ప్రార్థన చేయండి. అని లేచి నిలబడ్డాడు. మేమందరం భారమైన మనసులతో లేచి నిలుచుని కళ్ళు మూసుకున్నాం. కళ్ళముందు నేలకు రాలుతున్న చెట్ల ఆక్రందనలు.. వాటి పక్కన మనుషుల వికటాట్టహాసం మనోచక్షువులకి వినిపించసాగాయి. గుండె బరువెక్కింది. 'వృక్షవిలాపం' ప్రభోదాత్మక నాటకం, పద్యాలు, కవితలు, పాటలు అన్నీ అందరి మనసుల్నీ గెలుచుకున్నాయి. కార్యక్రమం ఉద్దేశం నెరవేరినట్టే అనిపించింది.

మనకోసం మన స్వార్థం కోసం ఎన్నో కార్యక్రమాలు చేసుకుంటాం.. కాని ఇలాంటి నిస్వార్థ సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమనిపించింది. ఇంటికెళ్ళి మిగిలిన ఆదివారాన్ని సినిమాలకి.. షికార్లకి కాకుండా మా పెరటిలోని చెట్ల మధ్య వాటికి సేవ చేస్తూ గడపాలని నిశ్చయించుకున్నాను.

లేచి బయట కొస్తుంటే రెండు మొక్కలు చేతిలో పెట్టారు. గాలికి ఊగుతూ నా చేతిని అవి స్పర్శిస్తుంటే ఏదో అనిర్వచనీయ ఆత్మీయ అనుభూతి కలిగింది.

.ఇప్పుడవి నేను దత్తత తీసుకున్న నా పిల్లలు..

★★★

## ధూర్జటి దూషణాభాషణభూషణాలు

- రావు తల్లాప్రగడ

స్తుతమతి యైన ఆంధ్రకవి – ధూర్జటి పల్కుల కేలగల్గెనో, అతులిత మాధురీ మహిమ అని రాయలు వారు ప్రశంసిస్తూ వుంటే, తెనాలి రామకృష్ణుడు దానిని పూరించి ఇలా అన్నాడట.

**చం|| స్తుతమతి యైన ఆంధ్రకవి - ధూర్జటి పల్కుల కేలగల్గెనో**
**అతులిత మాధురీ మహిమ!** - - - - - - - - - - - - - -
**హా తెలిసెన్, భువనైక మోహనో**
**ద్ధత సుకుమార వార వనితా జనతా ఘనతాప హారి సం**
**తత మధురాధరోదిత సుధా రస ధారలు గ్రోలుటం జుమీ!**

ధూర్జటిని వారవనితల దగ్గిరకెళ్ళే వాడంటూ విసిరిన చలోక్తినే అందరూ గమనిస్తారు, కానీ అది ఒక అద్భుతమైన పూరణ! దీనిలోని అసలైన శ్లేషార్థం -- మంచి కుమారులతో భార్యతో కూడిన పరివారబంధ విముక్తి, మహాతపస్సుతో సాధించిన అమృతఫలమే అని చెప్పాడు. ధూర్జటి కవిత్వంలో వున్న విలక్షణతను గుర్తించే అటు రాయలవారి దగ్గరనుంచీ రామకృష్ణుడు దాకా అందరూ పొగిడారు. ధూర్జటి తన భక్తి భావనలో సాంఘిక సంక్షేమాన్ని కూడా జోడించి రచించడం ఒక ముఖ్యమైన విలక్షణత. దీన్ని అందరూ గుర్తించారు. కానీ దూర్జటి సాహిత్యంలో విలక్షణతలు అనేకం. భక్తి భావనలో అందరు కవులూ భగవంతుడిని పొగడటమే ధ్యేయంగా పెట్టుకుంటారు. కానీ అవసరమైతే దైవాన్ని విమర్శించడం, కోపగించుకోవడం ధూర్జటి వంటివాడు మాత్రమే చేయగలిగిన ప్రయోగం. ధూర్జటి భక్తుడా కాదా అన్నది అసలు ప్రశ్నే కాదు. ఆయన భక్తికి ఒక పరాకాష్ఠ. ఆయన భక్తుడే అనడానికి అనేక పద్యాలు ఉదాహరణలుగా ఇవ్వచ్చు. అలాగే ఆయన భగవంతుడిని విమర్శించిన సందర్భాలు కూడా అనేకం. శ్రీకాళహస్తీశ్వర మహత్యంలో దాదాపు ప్రతి భక్తుడూ తమ తమ భక్తిలో ఆ పారవశ్యంలో దేవుడిపైన కోపాన్ని ప్రదర్శించారు, విమర్శించారు. ధూర్జటి వీటిని ఎలా ఎంత అందంగా ఆవిష్కరించాడో చెప్పడానికి కొన్ని పద్యాలు ఉదాహరణగా చెప్పుకుందాం. ముందుగా కాళహస్తీశ్వర శతకంలోని భక్తి పద్యాలు రెండు చెప్పి తరువాత భగవద్విమర్శలోకి వెళ్దాము.

**శా|| ఏ వేదంబు పఠించె లూత? భుజంగ బే శాస్త్రముల్ సూచె దా**
**నే విద్యాభ్యసనం బొనర్చెగరి; చెం చే మంత్ర మూహించె? బో**
**ధావిర్భావ నిదానముల్ చదువు లయ్యా? కావు; నీ పాద సం**
**సేవాసక్తియే కాక జంతు తతికిన్ శ్రీకాళహస్తీశ్వరా!**

భగవంతుని చేరుకోవడనికి ఏ వేదాలు, శాస్త్రాలు, మంత్రాలు, చదువులు అక్కరలేదు, కేవలం భక్తి పైన ఆసక్తి చాలు అంటూ తన భక్తిని ప్రదర్శించిన ఈ పద్యం అందరికీ సుపరిచితమే. అలాగే నాకిష్టమైన మరొక పద్యంలో, రోషం చచ్చినట్లే అనిపిస్తుందీ చావదు, సంసారబంధాలు తెగినట్లే వుంటాయి, తెగదు, నిన్ను ప్రార్థిద్దామనే అనుకుంటాను, మనసు నిలవదు అంటూ మనకున్న సహజసిద్ధమైన చంచల మనస్సు నుంచీ విముక్తి కల్గించమంటూ ఇలా అంటాడు.

**శా|| రోసీ రోయదు కామినీ జనుల తారుణ్యోరు సౌఖ్యంబులన్,**
**బాసీ పోయదు పుత్రమిత్రజన సంపద్భ్రాంతి, వాంఛాలతల్**
**కోసీ కోయదు నామనం బకట! నీకుం బ్రీతిగా సత్క్రియల్**
**చేసీ చేయదు, దీని త్రు ళ్ళడపవే శ్రీకాళహస్తీశ్వరా!**

ఇక, కాళహస్తీశ్వర మహత్యంలోని భక్తులు దేవుడిపైన చూపిన కోపాన్ని ఇలా వర్ణించాడు. ఈ కావ్యలో అనేక భక్తుల ప్రస్తావనలొస్తాయి. ముందుగా కృతయుగంలోని ఓ సాలీడు పురుగు చూపిన అమాయక భక్తి చాలా ప్రాచుర్యం పొందినది. తరువాత త్రేతాయుగాంత కాలంలో ఒక పాము అనేక మణులు రత్నాలతో పూజలు చేయడం మొదలుపెట్టిందట. ద్వాపరయుగంలో ఒక ఏనుగు ఆ మణులను రత్నాలను తీసి పారేసి కోపంతో శివుడిని ఇలా దూషించిదట.

**చ||ఉనికి శిలోచ్చయంబు, నిజ యోష శిలోచ్చయ రాజపుత్రి, నీ**
**ధనువు శిలోచ్చయంబు పురదాహ! రథీకృతరత్నగర్భ! నీ**
**మనమున కీ శిలాశకలమండలమెట్లు ప్రియంబు సేసె? నే**
**మనగలవాడ నిన్ను? వ్రత హాని యొనర్చు దురాత్ముడుండగన్!**

నీవుండేది బండలగుట్టపైన, నీ భార్య ఆ బండలరాజు అంటే పర్వతరాజు కుమార్తె, నీ ధనస్సు రాతితో చేసినది, ఎప్పుడు పురాన్ని హరిద్దామా అనే దాహంతో వుండేవాడా, ఈ రాళ్ళముక్కలెలా నచ్చుతాయయ్యా నీకు. అయినా నిన్ను అని ఏమి ప్రయోజనం, వీటిని పెట్టేవాడినాలి గానీ, అని మందలించి, ఆ రత్నాలనీ తీసి పారేసి, ఆకులు పూలు పెట్టి పూజచేసి వెళ్ళిపోయింది ఆ ఏనుగు. తరువాత ఆ పాము వచ్చి ఈ ఆకులు, ముళ్ళ కంపలూ, ఈ చెత్తా ఏమిటయ్యా, నిన్ను నువ్వు చూసుకోలేవా, నిన్ను నువ్వు కాపాడుకోవడానికి నీకు మూడవ కన్ను అన్నది ఒకటుంది. అది కూడా తెలియదా అంటూ ఆ పాము జాలి పడింది. ఇదొక వెటకారమన్న మాట.

అక్కడితో అయ్యిందా? తరువాత కలియుగంలో తిన్నడు అడవిలోనున్న ఆ స్వామిని చూసి, నీకు ఇల్లా వాకిలా, పెళ్ళామా పిల్లలా, మిత్రులా బంధువులా, అసలు నీకంటూ ఏదైనా వుందా నీకు, మా ఇంటికి రా పోదాము; అని చిన్నబుచ్చుకుంటూ, చిన్నబుచ్చుతాడు పాపం. తరువాత శివుడికి తాను తినే మాంసము వగైరాలన్ని తినిపిస్తాడు. అయినా శివుడేమీ అనుకోడు.

తరువాత, ఆ శివలింగానికి వారానికొక సారి వచ్చి పూజచేసే, ఒక సత్సాంప్రదాయ బ్రాహ్మణుడు వస్తాడు. ఆ ఎంగిలి మంగలమైన ముంగిలిలో, శివుడిని తుడుస్తూ, ఆ చెత్తనంతా ఎత్తి పోసి, ఇలా అంటాడు. నీపైన ఈ చెత్తపోసినవాడిని క్షమిస్తాను, కాని నువ్వు మాత్రం తక్కువ తిన్నవాడివా, నీచులతో కూడి భోజనం చేస్తావు, ఒక భక్తుడిని తార్చావు, శ్మశాన్న బూడిదను రాసుకుని తిరుగుతావు, మాకు రాయిస్తావు, కపాలంలో భోజనం చేస్తావు, చేయిస్తావు, ఇన్ని రోతల మద్య ఉండే నీకు రోషమన్నది వస్తుందనుకోను. నీకిది ఇష్టమైనా సరే నిన్ను ఇలా పాడు చేసే వాడెవడొ చెప్పు, లేకపోతే నేనే మరణిస్తాని అని ఇలా ప్రతిజ్ఞ చేస్తాడు.

**ఉ|| ప్రాతలు మీదగప్పిన గృపామతి నోర్చితి, నీచుపొత్తునన్**
**బ్రాతిమెయిన్ మొసంగితివి, భక్తుండు కుంటెన బంపబోతి, మై**
**పూత యొనర్చుకొంటి శవభీతి, గపాలమున్ భుజించి, తీ**
**రోతలు పెక్కులుండ నివి రోయుదువే? యిక భక్త వత్సలా!**

**కం||నీకిష్టంబిదిగానీ**
**నాకా పాపాత్ము జెప్పినం బది లక్షల్**
**లేకున్న విడితు బ్రాణము**
**నీకై కూడుగ్గబట్టి నీలగ్రీవా!**

ఇలా దిక్కరించినా శివుడు కనికరించి కనిపించి అసలు విషయం చెబుతాడు. తరువాత నత్కీరోపాఖ్యానము, ఈ కథలో సాక్షాత్తు

పరమేశ్వర ప్రణీతమైన పద్యాన్ని రాజు గారికి చూపించి ఒక బహుమానము పొందగోరి ఓ పేద బ్రహ్మణుడు రాజసభకి వెళ్ళాడు. అక్కడ మహా పండితుడైన నత్కీరుడు ఆ పద్యంలో వాడిన అలంకారాలనూ, సమయాలనూ, తప్పుపట్టి అవమానించి ఇలా పంపిస్తాడు.

**ఉ: 'తప్పిది చెప్పరాదు, కవితాసమయంబున కొప్పు గాదు, నీ**

**విప్పగిదిన్ రచింపదగునే?' యన విప్రుడు చిన్నవోయి, 'నా**

**కప్పరమేశ్వరుండు వసుధాపుపై రచియించి ఇచ్చినా**

**దొప్పును దప్పు నేనెఱుగ నుత్తములార!' యటంచు గ్రమ్మఱన్**

అదివిన్న శివుడు తానేవచ్చి స్వయంగా తన పద్యంలో తప్పులేదని చెప్ప ప్రయత్నించాడు. నేనే శివుడని అని కూడా తెలుపగోరి, మూడవకన్నును చూపిస్తాడు. అదిచూసి నత్కీరుడు పరిహసిస్తూ ఇలా అంటాడు.

**కం: తలచుట్టువాఱ గన్నులు**

**గలిగిన బద్యంబు దప్పు గాదన వశమే**

**వలదిచ్చట నీ మాయా**

**విలసనములు పనికిరావు విడువు మటన్నన్**

అలా పరిహసించిన నత్కీరుడు శివుని శాపానికి గురియై, చివరికి ఒక మహా శివభక్తుడై శాపవిముక్తుడై, చరిత్రలో నిలిచిపోతాడు.

ఇలా ఈ కావ్యంలో భక్తులందరూ దైవాన్ని ఏదో ఒక రకంగా అవమానించినవారే, కోపించుకున్నవారే. కానీ ప్రేమ వున్నచోటే కోపం పుడుతుంది. ప్రేమ లేకపోతే అది కోపం కాదు క్రోధమవుతుంది. కోపం తప్పుకాదు. క్రోధం తప్పు. ముఖ్యంగా ఒక స్థాయి దాటిన ప్రేమలోనూ భక్తిలోనూ కోపతాపాలు వుంటాయని, అందులో తప్పులేదని, ఈ కావ్యంద్వారా తెలుసుకోవచ్చు. అంటే ధూర్జటి చెప్పిన దాని అర్థం భయంతో పూజల చేయకండి. భక్తితో మాత్రమే చేయండి. భక్తి వున్నంత కాలం పూజలో ఈ విధానం తప్పు, ఇలా చేస్తే దేవుడికి కోపం వస్తుంది, అలా చేస్తే దేవుడు శపిస్తాడు వంటి మాటలు నమ్మకండి. అహం బ్రహ్మేశ్మి – నేనే దేవుడిని అని మన ధర్మం చెబుతోంది. అలాంటప్పుడు, నీపైన నీకు కోపం ఏమిటి? నిన్ను నీవు దేవునిగా గుర్తించగలిగిన నాడు పూజలో లోపం కనపడదు, దోషం కనపడదు. భక్తి వుంటే చాలు మనం ఏవిధంగా పూజించినా సరే దేవుడు సంతోషిస్తాడు, ఎప్పుడూ మంచే చేస్తాడు. అదే హైందవ ధర్మం లోకానికిచ్చే శాంతి సందేశం. అదే దూర్జటి మన లోకశాంతికై ఇచ్చిన అన్యాపదేశం.

సర్వేజనా సుఖినోభవంతు!

★★★

## కాలం కత్తెరలో

- ఆకెళ్ళ

పరదేశికి నిద్రపట్టడం లేదు. అటు, ఇటూ వత్తిగిల్లేడు. అతను దొర్లినప్పుడల్లా పాతమంచం అతని బాధను పంచుకున్నట్లు మూలుగుతోంది. ఆలోచనలు కుమ్మరిపురుగుల్లా దొలుస్తున్నాయి. జారిపోతున్న పాత తలదిండును సర్దుకుని, కొడుకిచ్చిన కొత్త దుప్పటీని ఒంటి నిండా కప్పుకున్నాడు. పుష్యమాసం చలిగాలులు దుప్పట్లో దూరడం లేదు. పాత దిండు నించి, కొంత మెతకవాసనా, గడి విప్పిన కొత్త దుప్పటీ నించి గంజి వాసనా కలగాపులగంగా వస్తున్నాయి.

పరదేశి నవ్వుకున్నాడు. ముందురోజు కోడలన్న మాటలు గుర్తొచ్చాయతనికి. ఆమె చదువుకున్నది. తను పాతదిండు వదలకపోవడం గమనించి నవ్వుతూనే అంది 'మావయ్యా! మీ పక్క పాత కొత్తల మేలు కలయికలన్నమాట' కోడలి మాటలకు కొడుకు నవ్వలేదు.

నిజమే, తన జీవితం పాత కొత్తల మేలు కలయికే. ఎక్కడ పుట్టేడు, ఎక్కడ పెరిగేడు, ఎక్కడ బ్రతుకుతున్నాడూ' ఎక్కడో నిద్రరాని జీవం ఒక్కటి మూలిగింది.

'ఏమిటీ తెల్లారిపోతోందేమిటి? కంగారుగా లేచాడు పరదేశి.

గచ్చు అరుగు దిగి, ఆకాశం కేసి చూశేడు.

ఆసుక్క ... ఇంకా ఈ సెట్టు ఎక్కలేదు అంటే గంట పన్నెండయి ఉండచ్చు అంతే! గొణుక్కున్నాడు.

ఆరు బయట నించోటంతో చల్లగాలి చుట్టబెట్టింది. మళ్ళా ఆలోచనలూ – చుట్టు ముట్టేయి. ఒంటికి చుట్టుకున్న వేడి, చల్లగాలికి కరిగిపోతోంది. పరదేశి ముడుచుకుంటూ మూలుక్కున్నాడు.

'ఈ యేళకి బయల్దేరాలి' ఆ ఆలోచన రావడంతో, బాధ ఎగసి వచ్చింది. నిట్టూర్చేడు పరదేశి.

కీచురాళ్ళు రొదపెడుతున్నాయి. ఊరి వెట్టివాడు 'పారా హుషార్' అంటూ పక్క వీధిలోంచి వెళ్ళిపోతున్నాడు.

'వెట్టి తాత గుడీధికొస్తే గంట పన్నెండే' అనుకుంటూ అరుగెక్కాడు. నిద్రపోవాలనిపించలేదు. అరుగు కొసకి చతికిలపడి స్థంభానికి ఆనుకుని కూర్చున్నాడు. అరుగుమీద తెల్లటి వెన్నెల పడుతోంది. ఆ వెలుగులో నిన్నటి తెల్లచార – గచ్చుమీద మెరుస్తోంది.

'అవును' ఇది నిన్నటి చారే, నిన్న ఈ యేళకి, నూతికాడ స్నానంచేసి బొట్టు పెట్టుకుని బయల్దేరిపోయాడతను. అప్పుడే ఆ బొట్టు పెట్టుకునేడప్పుడే కొంత బొట్టు ఒలిగింది. తెల్లటి చారగా మిగిలింది.

ఆ చారని వేలితో రాస్తూ గొణుక్కున్నాడు పరదేశి. అప్రయత్నంగా ఆ వేలిని నుదుటిమీద దిద్దుకున్నాడు. గుండె బరువెక్కింది. ఆలోచనలు, కొలిమిలో కాలుతున్న ఇనుపచువ్వల్లా వెలుగుతున్నాయి.

మొదటిసారి తనకు అయ్య బొట్టు పెట్టేడు. 'ఒరేయి మన కులాచారం ఇది. ఈ వేళనుంచి ఆ ఆచారం నీకప్పగిత్తున్నాను. ఎప్పుడో మన ముత్తాతల్నాడు ఈ ఊరు మనపాలి పంపకానికొచ్చింది ఇక్కడే

ఉండి మనం గ్రామంకి సేవసేసుకోవాల! పంటల పండగముందు ఈ రోజుల్లో మనం గ్రామ సంచారం సేయాలా! మన కులదైవం ఎఱ్ఱిమారికమ్మ. ఆయమ్మకి దణ్ణం పెట్టుకుని, నడిరేయి దాటిన కాణ్ణించి ఈ ఢమరుకం వాయిస్తు మనం తిరగాల! కోడి కూసిందా! తల్లులు – తలుపులు తెరిచి పాచిపని మొదలెట్టారా, మనం గూటికి చేరాల, అట్టా చేస్తే గ్రామానికి కీడు పోద్ది. గ్రామం సల్లగుంటది' అయ్య చెప్పుకుంటూ పోయాడు.

ఆ రోజు స్నానం చేసినాక అయ్య బొట్టు పెట్టినాడు. తర్వాత గ్రామం దక్షిణ దిక్కు వెళ్ళి పేడని దొరివి చేసి ఆ పేడ దొరివిలో ఆముదం పోసి వత్తి వెలిగించేడు. ఎఱ్ఱమారికమ్మని కొల్సి గ్రామ సంచారానికి బయలుదేరాడు.

ఆదిశక్తిని కీర్తిస్తూ, చేతిలో ఢమరుకాన్ని మ్రోగిస్తూ, సలిని సంపేస్తూ, సీకట్ని సీలుస్తూ...కీడుని తరిమికొడుతూ, తను గొంతెత్తి పాడేడు.

నలభై ఏళ్ళుగా తను పాడుతూనే ఉన్నాడు. తన పాటలు నిద్రరాని వాళ్ళకు, జోలపాటలు, దొంగలకు తిరుగుపాటలు అయ్యేయి.

'ఆడి ముండా మొయ్యా' ఆ బుడబుక్కలోడు నల్లరాయిలా ఉన్నాడ్రా' నడిరాత్రి దాటనివ్వడు. ఢమరుకాన్ని వాయిస్తూ సంకీర్తన చేస్తూ తిరుగుతూనే ఉంటాడు. కీడుని తరిమికొట్టే మాటెలా ఉన్నా ఎదురుపడితే మెడగూళ్ళు విరిచేత్తాడు' అని దొంగలనుకోవడం తనకు తెల్సు.'

గతం గుర్తుకొచ్చిన పరదేశి నిట్టూర్చాడు. అతనికి ఒకనాటి ఊరు వైభవం గుర్తుకువచ్చింది.

'ఆ రోజులే వేరు' సంక్రాంతి వస్తే చాలు పొట్టలు నిండిన ధాన్యం పొణుకులు, లోగిటి ముందు ముత్యాల్లాంటి ముగ్గులు, గంగిరెద్దుల మేళాలు, దాసర్ల హరినామ సంకీర్తనలు, జోస్యం చెప్పే కొండరాజులు, సంక్రాంతి శంఖం ఊదే బసవయ్య, పనసలు చదివే బ్రాహ్మలు, రోజుకో వాహనం ఎక్కి ఊరేగే వేణుగోపాలుడు. ఊరంతా హడావిడే. ఆనందమే. దానధర్మాలే, భక్తి విశ్వాశాలే.

తను పెద్ద పండుగనాడు బయల్దేరేవాడు. పెద్దరాజుగారి కాణ్ణించి, పరశురామయ్య పాకవరకు వెళ్ళేవాడు. అది కావాలని ఇది కావాలని తనెన్నడు ఎవర్ని అడగలేదు. అయితేనేం. అమ్మలు, అక్కలు, అన్నలు, బాబాయిలు.. ఊరంతా పలకరింపులే.

ఏటి అన్నా?

ఏటి మావా?

ఏటి బాబాయి?

ఏటి అబ్బాయి?

'ఏడాదికొచ్చావు. నీ పాట రాత్రివేళ ఇనిపిస్తుంది. పగటేళ కనపడవు. పండగకొస్తే మళ్ళా పండక్కివస్తావు.? ఏదైనా కబుర్లు సెప్పు.! ఒకటే గొడవ.

ఇక బట్టలు, గింజలు, దినుసులు, ఒకటేంటి బండికేసి తేవాల్సిందేగా. సంవత్సర గ్రాసం. మధ్యలో తను ఎన్నడైనా ఏదైనా సేయిసాచి అడిగేవాడా! అడగాల్సిన అవసరం వచ్చేదా? చేతినిండా డబ్బు. ఒక్కగానొక్క కొడుకు. అందుకేగా ముత్యాలయ్యని ఇస్కూలికి పంపింది.

ఆలోచనలు కొడుకుకేసి మళ్ళడంతో – పరదేశి మూసి ఉన్న తలుపుకేసి చూశాడు. కొడుకు కోడలు నిద్రపోతున్నారు. 'బయల్దేరితే'? ఆ ఆలోచన రావడంతో గబగబా నూతిదగ్గరకెళ్ళాడు.

ఇంటికి ముందే ఉంది నుయ్యి. బొక్కిన నీళ్ళు ఒంటిమీద పడగానే చలికి, సన్నటి ఒణుకు కలిగింది. వయసు అయిపోయిందిగా. ఇంటిది వెళ్ళిపోయింది. బంధాలు తను తెంచుకున్నా బ్రతుకు తన్ను వదలటంలేదు. గొణుక్కున్నాడు ఆకాశం కేసి చూసి, 'సుక్క ఈ సెట్టు ఎక్కింది. మూడో జాముదాటి ఉండదు' అనుకుంటూ అరుగెక్కాడు.

పాత దిండు క్రిందనుంచి బొట్టు పెట్టి తీసుకుని బొట్టు పెట్టుకున్నాడు. నామాలు చీకట్లోనే సరిదిద్దుకుని దండెంమీద బట్టలేసుకున్నాడు.

'మారికమ్మని కొల్సి తనిక బయల్దేరవచ్చు. ఊరిసివర పేడ దొరక్కపోదు! అనుకుంటూ మెట్లు దిగుచున్న వాడల్లా ఆగిపోయాడు.

'అవును ఢమరుకం ఏది?' గబగబా దిండు కింద వెతికేడు, కనపడలేదు. కొడుకు గదికేసి బాధగా చూసి చతికిలపడ్డాడు. 'చేతిలో ఢమరుకం ఉంటేనే నోటపాట గంగాఝరిలా వెలువడుతుంది! ఎలా? ముత్యాలు దాచేసి ఉంటాడు.

పరదేశి గోడవారని చతికిలపడి మొదటిసారి, కొడుకును చదివించినందుకు పశ్చాత్తాపం పడటం మొదలుపెట్టాడు. 'తన వంశానికి చదువెటూ రాదని, తను నమ్మకంగా ఉండిపోయాడు. అయితే ముత్యాలుగాడు ఆపేరెట్టిన పాపానికో ఏటో – ముత్యంలా చదివేడు. రత్నంలా ఎదిగేడు. సదువుతున్న కొడుకుని, ఎదుగుతున్న ఆలోచనల్ని సదివేశాడు. ఇప్పుడు కాలేజీలో మేట్టారు. పెద్దాళ్ళు అంతాకూడా ఆడ్ని గౌరవిస్తారు. ఆడి టీవీ, దర్జా చూసి తనూ గర్వపడుతుంటాడు.

నువ్వొక్కడివి ఆ పల్లెలో ఏం చేస్తావు నాన్నా! వచ్చి మాతో ఉండిపో! అన్నాడు. వాడు. ఆడి మాటే నెగ్గించుకున్నాడు. కోడలు అమ్మలా సూసుకుంటోంది. రోజులు సల్లగానే వెళ్ళిపోతున్నాయిరా అనుకుంటే ఈ పండక్కేవచ్చింది చిక్కు.

ప్రతి పండుగముందు తనొచ్చి మూడు రోజులు సంకీర్తన చేసి తన కార్యక్రమం తను కానిచ్చుకుని వెళ్ళిపోతున్నాడు. అయితే ఎవర్నీ ఏం అడగడం లేదు. ఆశించడమూ లేదు. ఈసారే అ ఉద్దేశంతోనే బయల్దేరాడు.

'పండుగ రోజుల్రా, లంకంత ఇంటికి సిన్న దీపమైనా పెట్టకపోతే తప్పు నేనెళ్ళి వత్తాను' అన్నాడు తను 'దాన్దేముంది పనివాడ్ని పంపి, పండుగ నాల్గు రోజులు దీపం వెలిగించి రమ్మంటే సరి' అన్నాడు ముత్యాలు. అమ్మ కడుపు సల్లగా.. కోడలు కలుగజేసుకుంది.

'ఆయనే కాదండీ, మనమంతా ఈ పండగ మీ ఊళ్ళో గడుపుదాం. పల్లెలో పండగ వేడుకలు చూసినట్టు ఉంటుంది. కోడలు నొక్కి చెప్పింది.

అంతా బయల్దేరారు.

'పోన్లే ఆనవాయితీ తప్పకుండా ఓ మూడు రోజులు గ్రామం సంచారం చేయవచ్చనుకున్నాడు.

ఊరు ఊరంతా అబ్బాయిని, తన్ని పలకరించడానికొచ్చారు. 'ఏం బాబాయి క్రిందటేడు వచ్చేవు నీ పాట వినిపించింది. మనిషివి మాత్రం కనపడకుండా వెళ్లిపోయావు. నిన్ను చూసి ఎంతకాలమైంది. పలకరించేరు..

ఊళ్ళో దిగగానే ఊరిని కలియ దిరిగేడు. పీడలా పట్టిన రాజకీయాలు, చీడపట్టిన పంటలు, కులాల కొట్లాటలు, అధికారం కోసం పోట్లాటలు,

ఊర్ని చూస్తే కళ్ళనీళ్ళు గిర్రున తిరిగేయి. కలియుగం. అయినా తనపని తను కానివ్వాలి. ఊరినే కీడూ కొట్టగూడదు. సల్లంగుండాలి.

ముత్యాలు ఎంత చెప్పినా వినకుండా వీధి అరుగుమీద పడుకుని అర్ధరాత్రి లేచి రెండురోజుల తన కార్యక్రమం యధావిధిగా జరుపుకున్నాడు. అయితేఉదయం తలక్రింద ఢమరుకాన్ని చూసి ముత్యాలు తను చేస్తున్నపనిని పోల్చేసుకున్నాడు. ముఖం ఎరుపుచేసుకున్నాడు. ఇద్దరికి మధ్య రగడే లేచింది.

'గ్రామానికి నువ్వుపాడే పాటలవల్ల, వాయించే ఢమరుకం వల్ల, కీడు పోతుందనుకోవడం సిల్లీ! అదేంకుదరదు, నువ్వు ఇల్లు కదలద్దు. మనిషి చంద్రుడిపై కాలుపెట్టినా, ఈ చాదస్తాలు వదలకుంటే ఎలా! గట్టిగానే చెప్పాడు.

తను చిన్నబుచ్చుకోవడం కోడలు గమనించి కలుగజేసుకుంది.

'పోన్లెండి ఆయన నమ్మకాలు ఆయనవి. నమ్మకాలు, ఆచారాలు ఒకరి హానిని కోరకుండా, మంచిని కోరేటప్పుడు ఆచరణ యోగ్యాలేనండి' నచ్చచెప్పడానికి ప్రయత్నించింది.

'నీ తండ్రి ఇలా వీధుల్లో పాడుకు తిరిగితే నువ్వు భరించగలవా?'

కోడలు ఏదో అనబోయింది. కొడుకు వినలేదు. సాయంత్రం మాత్రం కోడలు వచ్చి 'మీరిలా చేయడం ఆయనకిష్టం లేదు ఆయన బాధపడుతున్నారు, మానేయండిమావయ్యా' అంది.

పరదేశి నిట్టూర్చి కొడుకు నిద్రపోతున్న గది తలుపుకేసి చూశాడు. వాడే దాచేసి ఉంటాడు. వెళ్ళి తలుపుకొట్టి అడిగితే, తన బ్రతుకు తను బ్రతకగలనని చెప్పేస్తే, ఆవేశంతో లేచేడు తలుపు వరకు వెళ్ళి ఆగిపోయాడు. అన్ని విషయాల్లోను తనకు గౌరవం ఇచ్చి అభిమానంతో చూస్తున్న కొడుకుతో – ఎలా గొడవ పెట్టుకునేది? అడుగులు నిలిచిపోయాయి. మళ్ళావచ్చి చతికిలపడ్డాడు.

ఆవేశం, ఆలోచన ఈ రెండింటి మధ్య నలిగిపోతున్నాడు పరదేశి. చిన్నప్పటి ఆలోచనలు ఆచారాలు మనసులో మరతిరుగుతున్నాయి. మంచంమీద వెన్నెల ముద్దలా పడుతోంది. కొత్త దుప్పటి, పాత తలదిండు పెనవేసుకుని మెరుస్తున్నాయి.

అరుగు దిగి ఆకాశం కేసి చూసి నిట్టూర్చేడు. మళ్ళా అరుగెక్కేడు. అతని ఆలోచనల్లాగే అతని కాళ్ళు అతన్ని నిలువనీయడంలేదు. గుండె బరువెక్కుతోంది. నిరాశగా గోడకి చేర్లబడ్డాడు.

నిన్నటి చారవెక్కిరిస్తోంది. వెన్నెలదన్ని ధిక్కరిస్తోంది.

గుండె మూగగా రోదిస్తోంది. రక్తంపంచిన కొడుకు – రక్తంలో ఇంకిన సంప్రదాయం. కళ్ళ వెంబడి నీరు కారుతోందని పరదేశి ఆలశ్యంగా తెలుసుకున్నాడు. మోకాళ్ళలో తలెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చేశాడు. వెక్కి వెక్కి ఏడుస్తూనే ఉన్నాడు. చాలాసేపు గుండె పగిలేలా ఏడుస్తూనే ఉన్నాడు పరదేశి.

ఇంతలో చల్లటి హస్తం ఒకటి నుదుటిని తాకింది. తలెత్తాడు. ఎదురుగా ఢమరుకం – దాన్ని పట్టుకున్న గాజుల చేతిని చూడగానే – పరదేశిలో ఆనందం పెల్లుబికింది.

'అమ్మా ఎవరమ్మా నువ్వు! అమ్మలగన్నయమ్మ పార్వతీదేవివా తల్లీ! నా తండ్రి శంకరయ్య చేతిలో ఢమరుకాన్ని నాకిస్తున్నావామ్మా!

ఈ పరదేశి కోసం ఆ పరమశివుని కోపానికి బలి కావడానికి సిద్ధపడ్డావామ్మా! ఆనందంతో కళ్ళనీళ్ళు ఉబికాయి పరదేశికి.

అతని కళ్ళు తుడిచిందా తల్లి.

'వెళ్ళిరండి మావయ్యా' సన్నగా అంది. ఢమరుకం చేతికి తగలగానే అపర శివునిగా లేఛాడు పరదేశి. అరుగు దిగేడు సంకీర్తన చేస్తూ సాగిపోతున్నాడు.

వెళుతున్న పరదేశిని చూసి గుమ్మంలో నిలబడిన భర్తకేసి తిరిగిందామె.

'చూడండా సంతృప్తిని. చూడండా తేజస్సును. ప్రజలకు ఏ కీడు రాకూడదని సదాశయంతో మహా శాంతి కోరే ప్రవక్తలా వెలిగిపోతున్నాడాయన' అంది. గుమ్మంలో నిలబడి, వెళ్తున్న తండ్రికేసి చూసి చేతులు జోడించి ముత్యాలు మెల్లిగా తలూపేడు.

(29.7.82 – ఆంధ్రభూమి లో ప్రచురితం)

★★★

## అనుమానితుడు

- ఆర్. శర్మ దంతుర్తి

సెప్టెంబర్ 14, 2002

06:45:

పెంటాగాన్ కి వెళ్ళే ట్రైన్ సిద్ధంగా ఉంది ప్లాట్ ఫాం మీద. ఓ చేతిలో బేగ్, ఇంకో చేతిలో చిన్న సంచీతో రైలెక్కేడు కబీర్. ఒక మూల చోటు చూసుకుని కూర్చున్నాక కుడిచేయి చేతిలో ఉన్న చిన్న సంచీలోకి పోనిచ్చి కళ్ళు మూసుకుని కూర్చున్నాడు.

తన స్టాప్ చివరిదే కనక దిగే కంగారు ఏమీ లేదు. చుట్టూ ఉండే జనం కబీర్ చేతినీ, నల్లగా ఉండే మొహాన్నీ భయం భయంగా చూస్తున్నారు. తమ మీద దాడి జరిగి ఏడాదే కదూ?

బ్లూ లైన్ మీద కాపిటల్ హైట్స్ లో ఎక్కి స్ప్రింగ్ ఫీల్డ్ లో దిగే కబీర్ కి ఇవేమీ పట్టినట్టు లేదు. కళ్ళు మూసుకుని అలాగే కూర్చున్నాడు.

07:00: వచ్చే స్టేషన్ పోటోమేక్ అవెన్యూ అని చెప్తున్నారు స్పీకర్లోంచి. కొంతమంది ఎక్కేవాళ్ళూ దిగేవాళ్ళతో హడావిడిగా ఉంది. కబీర్ పక్కనే కూర్చున్న తెల్లాయన ఎదురుగా కూర్చున్న నల్లాయనతో కళ్ళు కబీర్ కేసి ఆడించి 'వీడి సంగతేమిటంటావ్?" అన్నట్టు అడిగేడు. నల్లాయన భుజాలెగరేసాడు తెలీదన్నట్టూ.

07:17: మెల్లిగా నల్లాయన్ని తెల్లాయన కబుర్లలోకి దించేడు. ఇద్దరూ వెళ్ళేది పెంటాగాన్ కే. ఈ కబుర్లు గడుస్తున్నా కబీర్ ఏమీ వింటున్నట్టు లేదు. ఏదో ట్రాన్స్ లో ఉన్నట్టు ఉన్నాడు.

07:18: తెల్లాయన చెప్తున్నాడు నల్లాయనతో కబీర్ కి వినీవినపడకుండా.. "ఇలాంటివాళ్ళవల్లే పోయినేడు మనం ఎటాక్ చేయబడ్డాం గుర్తుందా? ఇప్పుడు వీడ్ని చూస్తే ఇంకో ఉగ్రవాదిలా ఉన్నాడు. చేతిలో సంచీతో ఏం చేస్తున్నాడు? రెండో సంచీలో ఏముందో? పోలీసులకి చెప్దాం. పెంటాగాన్ స్టేషన్లో వీణ్ణి దింపి వాళ్ళకి అప్పగిస్తే వాళ్ళే చూసుకుంటారు."

07:22: వచ్చేది స్మిత్ సోనియన్ స్టాప్ అని అరుస్తోంది స్పీకర్. నల్లాయన ఇంకా నమ్మినట్టూ లేదు. ఎక్కే జనం దిగే జనం గోలా ఈ నల్ల-తెల్ల కబుర్లూ కళ్ళు మూసుకున్న కబీర్ కి పట్టట్లేదు.

07:73: "మీరు అమెరికన్ కాదా? మీకు ధైర్యం లేదా? ఇలాంటి అనుమానితుల్ని గురించి పోలీసులకి చెప్పమని మనకి చెప్పేరుకదా? అదీ గాక రోజూ పేపర్లలో చూస్తున్నాం. రేప్పొద్దున్న మీరో, మీ పిల్లలో వీడి వాతన బడితే మీకెలా ఉంటుంది, ..." తెల్లాయన ఆగకుండా ఎక్కిస్తున్నాడు నల్లాయనకి.

07:25 నల్లాయనకి జ్ఞాననేత్రం తెరుచుకున్నట్టుంది. "అయితే ఇప్పుడేం చేద్దాం?" అనడిగేడు.

07:26: నేను పోలీసులకి ఫోన్ చేస్తాను. వాళ్ళొచ్చినప్పుడు మనిద్దరం ఒకటిగా ఉండి వీడ్ని అప్పగిద్దాం. అడిగితే చెప్పొచ్చు వీడ్ని చూస్తే మాకు భయం వేస్తోందని, చెప్పేడు తెల్లాయన. నల్లాయన సరే అన్నాడు. రూల్ ప్రకారం కదిలే ట్రైన్ లో ఫోన్ వాడొచ్చా అనేది చూడకుండా తెల్లాయిన సీట్లోంచి లేచి తలుపు దగ్గిరగా వెళ్ళేడు ఫోన్ చేయడానికి. నల్లాయన కబీర్ కేసి చూస్తూ కూర్చున్నాడు.

07:45:పెంటాగాన్ స్టేషన్. ఇక్కడే దాదాపు అందరూ దిగిపోయేది. ఒక్కసారి ఎవరో కదపడంతో కబీర్ కళ్ళు తెరిచి చూశాడు. ఎదురుగా

ఇద్దరు పోలీసులు. ఏమీ అర్థం కానట్టూ వాళ్ళకేసి చూసాడు. "లే ముందు, నిన్ను స్టేషన్ కి తీసుకెళ్ళాలి ప్రశ్నించడానికి" అన్నాడు ఒక ఆరడుగుల పోలీస్.

"ఎందుకూ?" అడిగేడు కబీర్.

తెల్లాయన చెప్పేడు వెంటనే "వీడు ఎక్కినప్పట్నుండీ చూస్తున్నాము. ఆ చేయి బేగ్ లోంచి తీయడు. అందులో ఏముందో తెలియదు. మాకందరికీ భయం వేస్తోంది." నల్లాయన చెప్పేడు, "అవును వీడ్ని పోలీసులకి అప్పగించాల్సిందే!" కబీర్ లేచి పోలీసుల వెంట కదిలేడు. కుడి చేయి ఇంకా అలా చిన్న సంచీలోనే ఉంది.

"మీరిద్దరూ కూడా రండి సాక్ష్యులుగా" పోలీసాయన చెప్పేడు నల్లాయనతో, తెల్లాయనతో.

"అలాగే, మేం దిగేది ఇక్కడే కూడా" అంటూ ఇద్దరూ దిగేరు.

08:30: ఎక్స్ రే లోంచి తీసుకెళ్ళి పెంటాగాన్ బిల్డింగ్ పోలీస్ స్టేషన్ లో కూర్చున్నాక సాక్ష్యులనిద్దర్నీ బయటకూర్చోపెట్టి కబీర్ ని లోపలకి తీసుకెళ్ళేరు పోలీసులు. కబీర్ చేతి సంచీ, బేగ్గూ రెండూ శోధించబడ్డయ్. చిన్న సంచీలో ఓ పూసల దండా, రెండో సంచీలో ఏవో కాయితాలూ. అన్నీ ఇంగ్లీషులో ఉన్నవే. అన్నీ తను పనిచేసే కంపెనికి సంబంధించినవి.

08:49: కబీర్ ని కొన్ని ప్రశ్నలేసాక వీడితో భయపడేది ఏమీలేదని అనిపించి వదిలేసారు. బయటకెళ్ళేముందు చెప్పేడు పోలీస్, "కబీర్, 9/11 ఎటాక్ తర్వాత ఎవర్నైనా ఇలా శోధించమని మాకు ఆర్డర్స్ ఉన్నాయ్. నువ్వెళ్ళవచ్చు." కబీర్ కి చెప్పనిది ఏదైనా ఉంటే "నిన్ను వచ్చే మూడు నెలలూ జాగ్రత్తగా – నీకు తెలియకుండా — గమనిస్తూ ఉంటాం."

కబీర్ సరే అన్నట్టూ తలాడించి బయటకొచ్చేడు.

09:20: బయటకొచ్చిన కబీర్ ని చూసి తెల్లాయనా నల్లాయనా పోలీసుని అడిగేరు, "వదిలేసారా? అదేమిటి?"

పోలీస్ ఇద్దర్నీ చూస్తూ చెప్పేడు, ఈసంచిలో ఈ పూసలదండ తప్ప మరేమీలేదు. బేగ్గులో ఆఫీసు కాయితాలున్నై అంతే. పేరు ఎడ్రస్సూ తీసుకుని వదిలేస్తున్నాం. మా పరిశోధనలో ఏదైనా తేల్తే మళ్ళీ ఎప్పుడు కావలిస్తే అప్పుడు పట్టుకోగలం వీడ్ని.

తెల్లాయన అడిగేడు "మరి చేయి సంచీలోంచి తీయడే ఎంతకీ, ట్రైన్లో కూర్చున్నప్పుడు? ఆ చేత్తో ఏం చేస్తున్నాడు?" నల్లాయన వంతపాడేడు, "ఆ పూసలు ఏం మెటీరియల్? ఆ మెటీరియల్ హజార్డస్ మెటీరియల్ అవునో కాదో మీరు కనుక్కున్నారా?"

సమాధానం కోసం పోలీసు కబీర్ కేసి చూసేడు.

కబీర్ అడిగాడు "మీకు నిజంగా తెల్సుకోవాలని ఉందా?"

"అఫ్ కోర్స్ ఉంది. అది మా బాధ్యత కూడా, మేం అమెరికన్ సిటిజెన్స్ అవ్వడం వల్ల."

"అయితే వినండి, ఈ పూసలదండ నా జపమాల. నేను ప్రపంచ శాంతి కోసం జపం చేస్తున్నాను. కళ్ళు మూసుకుని మనస్సు భగవంతుడి మీద పెట్టి "హరేకృష్ణ హరేకృష్ణ, కృష్ణకృష్ణ హరేహరే, హరేరామ హరేరామ రామరామ హరేహరే" అదీ నేను చేసే మంత్రం."

"నువ్వా? ప్రపంచ శాంతికోసమా" అన్నారు శ్రోతలందరూ నోరు వెళ్ళబెట్టి

"ఏం చేయకూడదా?"

"ఆ, అదికాదు ఎందుకూ అని" నసిగేడు తెల్లాయన.

తన బేగ్గులు రెండూ తీసుకుని ముందుకి వెళ్ళబోతూ చెప్పేడు కబీర్

"నేను హిందువుని. గత ఐదువేల సంవత్సరాలలో భారతదేశం ఏ దేశమ్మీదా యుద్ధానికి వెళ్ళలేదు, తనే యుద్ధం ప్రారంభించి. అయితే మా మీద దాడి జరిగితే తిప్పి కొట్టేం. ఇప్పుడు నేను ఎందుకు జపం చేస్తున్నానంటే నా తల్లితండ్రులూ, ఉన్న ఒక్క అన్నయ్యా 9/11 దాడుల్లో చనిపోయేరు కాబట్టి. ఆ రోజు మా అన్న తను పనిచేసే ఆఫీస్ చూపించడానికి అమ్మనీ నాన్ననీ తీసుకెళ్ళేడు న్యూయార్క్ లోని వర్ల్డ్ ట్రేడ్ సెంటర్ కి. ఇప్పుడు నేను ప్రపంచంలో ఏకాకిని ఎందుకంటే నాకున్నది అన్న, తల్లీతండ్రీను. వాళ్ళందరూ ఇప్పుడు పోయారు."
"ఉగ్రవాదులు మీ వాళ్లందర్నీ పొట్టనపెట్టుకున్నా నువ్వు శాంతి కోసం జపం దేనికీ?" గునిసేడు నల్లాయన.

"ఉగ్రవాదంతో ఉగ్రవాదం ఎప్పటికీ చల్లారదు సార్. ఎప్పటికైనా జయించేది శాంతే. అందుకే ఈ జపం." కబీర్ నడుచుకుంటూ వెళ్ళి జనంలో కల్సిపోయేడు.

నల్లాయన మొహం పాలిపోయి తెల్లబడింది. తెల్లాయన మొహం మాడిపోయి నల్లబడింది. పోలీసుకి ఇంకేం చేయాలో తెలీక "సరే అయితే" అని లోపలకి వెళ్ళిపోయేడు.

★★★

## భారతదేశం

- పెయ్యేటి శ్రీదేవి

మానవ జన్మ చాలా ఉత్కృష్టమైనది. మనం భారతదేశంలో జన్మించడం, తెలుగువారిగా పుట్టడం చాలా గొప్ప విజయం. మన భారతదేశం చాలా గొప్పది. చండీయాగం చేసి వర్షం తెప్పించగల మహాపండితులున్నారు. అందుకే యజ్ఞయాగాదులకి ఆలవాలమైన మనదేశం యాగభూమి, యోగభూమి, కర్మభూమిగా పేరు తెచ్చుకుంది. రాముడు, కృష్ణుడు, హనుమంతుడు, వేంకటేశ్వరస్వామి, త్రిమూర్తులైన బ్రహ్మ విష్ణు మహేశ్వర్లు..... ఇలా ముక్కోటి దేవతలున్న మన దేశం ఒక దేవాలయం. లక్ష్మి, సరస్వతి, పార్వతి – ముగ్గురమ్మల దేవతామూర్తులున్న దేశం మనదే. మనం సూర్యుడ్ని ఆరాధిస్తాం. మాఘమాసంలో వచ్చే రథసప్తమికి సూర్యనారాయణమూర్తికి పూజ చేసి, సూర్యుడెదురుగుండా పొయ్యి పెట్టి ఆవుపాలతో పాయసం చేసి, ఆదిత్య హృదయం చదివి నైవేద్యం పెడతాం. మనదేశంలో సూర్యదేవాలయాలు కూడా వున్నాయి. అందుకే దేముడు మన భారతీయుడే. అగ్ని, భూమి, ఆకాశము, నక్షత్రాలు – వీటన్నిటినీ మనం దేముళ్ళుగా కొలుస్తాము. గంగ, యమున, సరస్వతి, కృష్ణ, కావేరి, తుంగభద్ర... ఇలా ఎన్నో పవిత్ర పుణ్య జీవనదులున్న దేశం మనదే. తిరుపతి, శ్రీకాళహస్తి, కాశి, రామేశ్వరం, హరిద్వార్, అన్నవరం, అరసవిల్లి, సింహాచలం, కాణిపాకం.... ఇలా ఎన్నో పుణ్యక్షేత్రాలున్న పుణ్యక్షేత్రం మన దేశం. అజంతా, ఎల్లోరా, మహాబలిపురాల్లో శిల్పసంపద కలిగిన శిల్పసుందరి మన దేశం. నాలుగు వేదాలతో, వేదమంత్రోచ్చారణలతో పునీతుల్ని చేసే వేదభూమి ఈ మన భారతదేశం. నవరత్నరాశులతో తులతూగిన రత్నగర్భ ఈ దేశం.

సంగీత చక్రవర్తి త్యాగరాజు పుట్టిన దేశం మనది. తన భక్తి పారవశ్యంతో భగవంతునికి ఊయలలూపి , జోలలు పాడి నిదురపుచ్చి, నిదుర లేపే సుప్రభాత కోయిల శ్రీమతి ఎమ్.ఎస్ .సుబ్బలక్ష్మి పుట్టిన దేశం మనది.

'ఏమీ సేతురా లింగా.... ఏమీ సేతురా
మహానుభావా.... మా లింగమూర్తీ, మా దేవశంభో....
ఏమీ సేతురా లింగా.... ఏమీ సేతురా
అక్షయావుల పాలు తెచ్చి
అర్పితము చేదమంటే
అక్షయావుల లేగ దూడ
ఎంగిలంటున్నాయి లింగా...

అంటూ పాడిన తెలుగు వాగ్గేయకారుడు శ్రీ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ పుట్టిన దేశం మనది.

మొట్టమొదటి దైవం 'అమ్మ' అమ్మని పూజించే దేశం మనది. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథి దేవోభవ అని, ముఖే ముఖే సరస్వతి అంటూ ఎదుటివారికి వినమ్రంగా రెండు చేతులూ జోడించి నమస్కారం చేసే సంస్కృతి – సంప్రదాయాలున్న సంస్కార దేశం మనది.

హిందీ కోయిల లతా మంగేష్కర్, తెలుగు కోయిల సుశీలమ్మ, జానకమ్మలు పుట్టిన దేశం మనదే. శహనాయ్ విద్వాంసుడు బిస్మిల్లాఖాన్, వైణిక విద్వాంసుడు చిట్టిబాబు పుట్టిన సంగీత నిలయం మనదేశం. 'దేశభాషలందు తెలుగు లెస్స' అని బహు లెస్సగా కీర్తించిన శ్రీకృష్ణదేవరాయలవారు, కాళిదాసు పుట్టిన కళల కాణాచి

మన దేశం....

స్వర్ణాభరణాలు ధరించి, కంచిపట్టు చీర సింగారించుకుని, నుదుట అందాన్నిచ్చే ఎఱ్ఱని కుంకుమతో పార్వతీదేవిలా కళకళలాడుతూ ఆరాధనభావం కలిగించే అందమైన స్త్రీమూర్తులున్న దేశం మనదే. కళ్ళకు కాటుక, నుదుట కళ్యాణతిలకం, బుగ్గన చుక్క, జడకుప్పెలున్న పొడావాటి పూలజడ, నడుముకి వడ్డాణం, మెడలో కాసులపేరు, కంచిపట్టు చీర సింగారాలతో గోరింట పండిన నిండు ఎఱ్ఱని గాజుల చేతులతో, కొబ్బరిబొండాం పట్టుకుని జీరాడే పసుపు పట్టుచీరకి ఎర్రజరీ అంచున్న కుచ్చిళ్ళలోంచి తొంగిచూసే మెరిసే వెండిపట్టీల పసుపు పారాణి పాదాలతో కళ్యాణ మంటపానికి కలహంసలా నడిచి వచ్చే లక్ష్మీదేవిలాంటి సొగసైన పెళ్ళికూతుళ్ళని ముస్తాబు చేసేది ..... ఒక్క మనదేశంలోనే...... కదూ?.........

పటిష్టమైన వివాహవ్యవస్థ, కుటుంబ వ్యవస్థ వున్న దేశం మనది. అతిథి అభ్యాగతులను ఆదరించే దేశం మనది. సంవత్సరం పొడవునా పూజా పునస్కారాలతో నిండుగా పండుగలు జరుపుకునే పూజామందిరం ఈ మనదేశం. బుద్ధుడు మనవాడు. కనకధారా స్తోత్రం, లలితా సహస్రనామాల సృష్టికర్త శ్రీ ఆదిశంకరాచార్యులు మనవారే. పద కవితా పితామహుడు అన్నమయ్య, పురందరదాసు, జయదేవుడు..... మనవాళ్ళే. మొన్నటి గురజాడ, వేయిపడగల విశ్వనాథ సత్యనారాయణ, నిన్నటి ఆత్రేయ, కృష్ణశాస్త్రి, శ్రీ శ్రీ.... ఎందరో మహా రచయితలు, మహా కవిరాజులు పుట్టినదేశం మనది. వీనులకు పసందైన విందులందించిన పాటల 'స్వరరాజులు' పుట్టిన దేశం మనదే. తెలుగింటి అమ్మాయిల అందాలను తన అందమైన రేఖలలో మలచి, అందమైన అమ్మాయిని చూడగానే 'బాపు' బొమ్మలా వుంది అని చెప్పుకునే బాపు పుట్టిన దేశం మనది. అంకెలలో సున్నా కనిపెట్టిన ఆర్యభట్టు మన భారతీయుడే. గీతాంజలి రచయిత, శాంతినికేతన్ స్థాపకుడు, జనగణమన అధినాయక జయహే అన్న మన జాతీయ గీత రచయిత రవీంద్రనాథ టాగూర్, స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామ రాజు – ఇలా ఎందరో మహానుభావులున్న గాంధీ పుట్టిన దేశం ఈ దేశం.

తులసి మొక్కని పవిత్రంగా పూజించే దేశం మనదేశం. వేప, బిల్వ, జమ్మి చెట్లు మనకి పూజనీయమైన వృక్షాలు. బిల్వపత్రాలతో శివునికి మనం పూజ చేస్తాం. వినాయకచవితికి గరిక దగ్గర్నుంచి అనేకరకాల పత్రాలతో, పుష్పాలతో వినాయకుడికి ఘనంగా పూజ చేస్తాం. ప్రతి చెట్టులోను ఔషధ గుణాలు కనిపెట్టింది కూడా మన దేశంవాళ్ళే. పసుపు, కుంకుమ, అక్షతలు, అనేకరకాల పుష్పాలతో దేవుళ్ళని పూజించేది ఒక్క మనదేశంలోనే. గాలి, నీరు, భూమి, ఆకాశం, అగ్ని ఈ ఐదింటిని మనం పంచభూతాలుగా ఆరాధిస్తాం. పాలు, పెరుగు, తేనే, ఆవునెయ్యి, పంచదార – ఈ ఐదు పంచామృతాలతో దేవునికి అభిషేకం చేస్తాం. ఈ దేశంలో మన హిందూ మతం చాలా గొప్పది. మనం చేసే ప్రతి పనిలోను, ప్రతి మాటలోను దైవ సంబంధమైన మాటలుంటాయి. ఆపదలో వుంటే 'దేవుడా నువ్వే రక్షించు, నువ్వే కాపాడు' అంటాం. మంచి జరిగితే దేవుడి దయ అంటాం. మంచి జరగకపోతే దేవుడికి కనికరం లేదు, అంతా ఖర్మ అంటాం. ఏ దిక్కూ లేకపోతే దేవుడే దిక్కు అంటాం. నోటితో ఎప్పుడూ దైవాన్నే స్మరిస్తాము, మంత్రాలను కూడా జపిస్తాము. అలా మన పక్కనే, మనతోనే దైవం వున్నట్లు భావిస్తూ, అనుక్షణం దైవంతో సంబంధం కలిగివుంటాం. మనలోనే దైవాన్ని ప్రతిష్టించుకుంటాం. ఇదే మన దేశంలో వుండే హిందూ మతం యొక్క గొప్పతనం. ఇలా మన భారతదేశం గురించి

ఎంత చెప్పినా తక్కువే.

విశ్వసుందరి మన దేశం. ఎక్కడో అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్ అని ఇలా ఇతర దేశాలన్నీతిరిగి, అది చూసాం, ఇది చూసాం, చాలా బాగుంది అంటూ గొప్పగా చెప్పుకునే గొప్పవాళ్ళున్నారు గాని... మన దేశంలోనే కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎన్నో అందాలుంటే, అవి చూసి, ఆస్వాదించి, ఆనందించే వాళ్ళు ఎంతమంది వున్నారు?

మనకున్న గొప్ప సంపద భగవద్గీత, భారత, భాగవత, రామాయణ పురాణ ఇతిహాసాలు చదివిన వాళ్ళు ఎంతమంది వున్నారు?

పుట్టినావీ భరతఖండాన.... చేత పట్టినావా నువు 'గీత' ఎప్పుడైనా.....

రామరాజ్యం పేరు చెబుతావు.... నీవు 'రామాయణం' ఎప్పుడైనా చదివావా?

భారతీయుడనేనని అంటావు. నీవు భారతం సగమైన చూసావా?

అస్సలు చేడలేదు కదూ? ఐనా ఆ ఇతిహాసాల సారాంశం తెలియకపోయినా, భారతంలో కౌరవులని, రామాయణంలో రావణాసురుణ్ణి ఆదర్శంగా తీసుకుని, వాళ్ళకన్నా దుర్మార్గంగా తయారవుతున్నారు.

భారతదేశం ఎంత గొప్పదో తెలుసా?

ఖండఖండాంతరాలలో ఖ్యాతి గొన్న భరతఖండమిది
జగజగాల చరిత పుటలలో పసిడివన్నె నొంది యున్నది
ఈ ధరణి పుణ్యకారిణి – గీతార్థసార బోధిని
ఇచ్చోట జన్మనొందుట– ఇది ఎంతో పుణ్య ఫలమట
ఇట త్రివేణి సంగమం–ఘోరాఘభగ్న కారకం
బహుజాతుల సంగమం – విశాల భావప్రేరకం
ఈ ధరణి కర్మచారిణి–క్షమమా ధరిత్రి రూపిణి
ఇచ్చోట జన్మనొందుట–ఇది ఎంతో పుణ్య ఫలమట

శతసహస్ర శాఖల తనరుచున్న తరువిది
దశానీక భాషల నిస్వనించు పికమిది
ఈ ధరణి తత్వరూపిణి–ఏకత్వసాధ్యకారిణి
ఇచ్చోట జన్మనొందుట–ఇది ఎంతో పుణ్యఫలమట
మతము మతము మధ్యన మమతలతో వంతెన
భాష భాష నడుమన భావాలతో స్పందన
ఈధరణి ప్రేమచారిణి– నిస్వార్థ తత్వదాయిని
ఇచ్చోట జన్మనొందుట–ఇది ఎంతో పుణ్యఫలమట.

-----

ఇంతవరకూ మనం చూసింది నాణేనికి ఒకవైపు. దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా, వట్టి మాటలు కట్టిపెట్టోయ్, గట్టి మేల్ తలపెట్టవోయ్.

పాడవోయి భారతీయుడా, ఆడి పాడవోయి విజయగీతిక, స్వాతంత్ర్యం వచ్చెనని సభలే చేసి, సంబరపడగానే సరిపోదోయి.

జయజయ ప్రియభారత జనయిత్రి, దివ్యధాత్రి, జయజయజయ శత సహస్ర నరనారీ హృదయనేత్రీ,

గాంధీ పుట్టిన దేశం, రఘురాముడు ఏలిన రాజ్యం, ఇది మమతకు, సమతకు సందేశం.

ఇలా ఆనాటి కవులు రాసిన ఈ దేశభక్తి పాటలు వింటేనే తెలుస్తుంది. అప్పుడు నరనరాన దేశభక్తి అందరిలో నిండిపోయేది. అలాంటి ఈ భారతదేశం రెండవ వైపు పరికించడానికి ప్రయత్నిస్తే ఈనాటి

దేశపరిస్థితి చాలా అస్తవ్యస్తంగా వుంది.

ఇంటర్నెట్ రంగం, సెల్ ఫోన్లు, టివి, ఇలా ఎన్నో వినోద విజ్ఞాన వైద్యపరంగా యాంత్రికంగా అమోఘమైన మేధాసంపత్తితో మనిషి ఎంత అభివృద్ధి సాధించినా, అది సరైన మంచి మార్గంలో ఉపయోగించుకోలేక, వక్రమార్గంలో అడ్డదారులు తొక్కుతున్నాడు. మనసులు కలుషితమైపోయి, ఈర్ష్యా ద్వేషాలు, కక్షలు, కార్పణ్యాలతో దురాశకు పోయి, అవినీతి, అక్రమాలు, దొంగతనాలు, దోపిడీలు, పట్టపగలే మారణహోమాలు ....

ఇలా ఎన్నో మోసాలకి, దౌర్జన్యాలకి పాలు పడుతున్నాడు. కాలేజి అమ్మాయిల వెంట పడి, ప్రేమించమని వేధిస్తూ, ప్రేమించక పోతే అమ్మాయిల మీద యాసిడ్లు, మరుగుతున్న నూనెలు పోస్తున్నాడు. అందమైన ప్రేమబంధాలని, మానవతా సంబంధాలని అతి కర్కశంగా, అతి కిరాతకంగా, యాసిడ్ దాడులతో అంతం చేసేస్తున్నాడు. “ఏదేశమేగినా, ఎందు కాలిడినా పొగడరా నీ భూమి భారతిని, నిలుపరా నీ జాతి నిండు గౌరవమూ’. అని రాయప్రోలు వారన్నారు. ఇప్పుడు అటువంటి మన గొప్ప దేశాన్ని పొగుడుకోవడానికి ఏంలేదు. నిలుపుకొనేంత గౌరవము లేదు. ప్రపంచదేశాలన్నిటిలో సిగ్గుపడేలా వుంది నేటి మనదేశ పరిస్థితి. ఛండాలమైన గ్యాంగ్ రేపుల స్థాయికి దిగజారింది ఈ దేశం. ఎవరూ అరికట్టే ప్రయత్నాలు చేయరెందుకు? మార్పు రావడానికి సినిమావాళ్ళ దగ్గర్నుంచి, టి.వి.సీరియల్సు, మీడియా, పత్రికలు, ప్రభుత్వం – ఇలా అందరూ సమానబాధ్యత వహించాలి. హింస, అసభ్యత, అవినీతి, దోపిడీలు, లంచ గొండితనాలు – ఇవన్నీ టి.వి.ల్లో, సినిమాల్లో చూపిస్తున్నారు. ఇవే జనం కూడా నేర్చుకుంటున్నారు. ప్రజల ఆలోచనా విధానం కూడా హింసవైపు ఉండేలా మారిపోయింది. ఇలాంటివి కఠినంగా అరికట్టే చర్యలు, దోషులకి కఠినశిక్షలు అమలు చేయాలి. మనకున్న భక్తి సంపద రామాయణ భారత గ్రంథాలలోని రావణాసుర, కీచక,కౌరవ పాత్రలని ఆదర్శంగా తీసుకుని వాళ్ళ కన్నఘోరంగా తయారవుతున్నది నేటి యువత! నేటి సమాజంలో ఈ అవినీతి అక్రమార్కుల మధ్య నీతి నియమాలతో బ్రతకాలనుకునే వారు ఒక్కో క్షణం ఒక్కో యుగంలా బ్రతుకుతున్నారు. మరొక పక్క పాశ్చాత్య పోకడలని అలవరుచుకుని, పాశ్చాత్యులకన్నా రెచ్చిపోయి, నేటి యువత గాని, సినీహీరోయిన్లు గాని ఫ్యాషన్ల పేరుతో అసభ్య వస్త్రధారణ చేస్తున్నారు. పాశ్చాత్యానుకరణ వల్ల తెలుగు అమ్మలు ఇంగ్లీషు మమ్మీలయారు. తెలుగు నాన్నలు ఇంగ్లీషు డాడీలయారు. వాళ్ళని గౌరవించడానికి, ప్రేమించడానికి, పూజించడానికి ఏడాదిలో ఒకరోజు చాలులే అని, మదర్స్ డే అని, ఫాదర్స్ డే అని దయతో రెండు ఇంగ్లీష్ డేలు పడేసారు. ఈ పడేసిన వాళ్ళు ఎవరో, ఇలా ఎవరు ఎందుకు ఎలా ప్రారంభించారో, ఎవరికీ తెలీని ప్రశ్న! పాశ్చాత్య దేశాలలో తల్లి, తండ్రి ఎల్లకాలం పిల్లలతో కలిసి వుండరు. కొంత వయసు రాగానే ఎవరి బ్రతుకులు వారివి. చందమామ రావే, జాబిల్లి రావే అంటూ పిల్లల నోట్లో అమ్మ ప్రేమతో గోరుముద్దలు తినిపించే ప్రేమసంస్కృతి కాదు వాళ్ళది. ముందరనించీ పిల్లలకి స్వతంత్రభావాలు నేర్పి, వాళ్ళ పనులు వాళ్ళే చేసుకునేలా పెంచుతారు. జీవితాంతం అమ్మా నాన్నలతో కలిసివుండరు కాబట్టి, ఒక రోజు పండగలా మదర్స్ డే అని, ఫాదర్స్ డే అని ఏర్పాటు చేసుకున్నారు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్టు, మన సంప్రదాయాల్ని వదిలేసి, వాళ్ళ ఫేషన్లు, వాళ్ళ సంప్రదాయాలు మనం పాటించడమేమిటి? మనకా ఇంగ్లీషు ఫేషన్లు వద్దు. మనం ఎప్పటికీ భారతీయులమే. భారతీయులుగానే వుందాం. మన సంప్రదాయాల్ని ఇష్టపడి గౌరవించే పాశ్చాత్యుల మనసులలో మన గౌరవాన్ని నిలుపుకుందాం.

ఇప్పుడైనా మళ్ళీ పూర్వపు వైభవాన్ని తీసుకొచ్చి, మన ప్రాభవాన్ని కాపాడుకోవడమే కాకుండా, మరింత పెంపొందించుకుంటూ, మన సంస్కృతీ సంప్రదాయాల విలువలనెరిగి, ఈ వేదభూమిలో పుట్టిన మహద్భాగ్యాన్ని సద్వినియోగం చేసుకుంటూ, మన జన్మలని చరితార్థం చేసుకుని భారతీయదనాన్ని అనుభవిద్దాం. ప్రపంచదేశాలన్నిటిలో మన భారతదేశ గొప్పదనాన్ని చాటుదాం. విశ్వశాంతి స్థాపించడానికి మనమే యోగకారకులవుదాం.

★★★

## విశ్వశాంతి - విశ్వప్రేమ

- రాధిక

ధరణీ సినిమాకెళదామన్నావుగా, టిక్కెట్లు కూడా తెచ్చాను. నీవు రెడీయేనా అన్నాడు శ్రీధర్.

'నేను రాను' ఖచ్చితంగా అంది.

మరి ప్రొద్దున్న వెళదామన్నావుగా. ఆఫీసునుండి వస్తూ టిక్కెట్లు కూడా తెచ్చాను. ఇప్పుడు నీవు రానంటే అవి వేస్టయిపోతాయి.

'మిమ్మల్ని చేసుకుని నా జీవితమే బూడిదలో పోసిన పన్నీరులా తయారయి బుగ్గల మీద కన్నీరులా మిగిలింది' కోపంగా అంది.

ఓ ! అదా ఫోనులో కోప్పడ్డాననా నీ కోపం. నేను మంచి పనిలో నున్నప్పుడు సినిమాకెళదాం, సరదాగా తిరుగుదాం అంటూ మాట్లడితే కోపం రాదా మరి.

ఇది ఈ రోజు కొత్తకాదులెండి. రోజూ ఏవో చీవాట్లు వేయకుండా మీరు ఉండలేరు కదా.

నేను చీవాట్లు వేస్తే నీవేమీ కామ్ గా ఉండవుగా. నేను ఒకటంటే నీవు పది అంటావు. ఒక తిట్టుకి, తొమ్మిది తిట్లు తిడతావు. ఒకటి కొంటే తొమ్మిది ఫ్రీలాగా. ఆమె మూడ్ మార్చాలని అన్నాడు. ఆమెనవ్వలేదు. ధరణికి పంతం పట్టింపు ఎక్కువ. తాను సాధారణ కుటుంబం నుండి వచ్చినా ఏ కలెక్టరో తనకు భర్తగా రావాలని కోరుకుంది. శ్రీధర్ మామూలు ఉద్యోగి కావడంతో ఆమెలో చెప్పలేని అసంతృప్తి అతనికి చీవాట్ల ప్రాప్తి.

ప్రతీరోజు ఆ యింట్లో జరిగే తతంగమే ఇది. శ్రీధర్ ఆఫీసు పని ఒత్తిడితో ఏదో చికాకుపడతాడు. దానితో ధరణి భర్తను అర్థం చేసుకోకుండా రెచ్చిపోతూ ఉంటుంది.

ధరణీ! ఎక్కడో చదివిన ఓ జోక్ నీకు చెప్పనా! ఇద్దరు స్నేహితులు ఒకసారి ఒకచోట కలిసారు. మొదటి అతను రెండవ అతనితో నాకు చాలా తల నొప్పిగా ఉంది అంటూ కబుర్లు మొదలుపెట్టాడు. ఒక గంట గడిచిన తర్వాత 'అరే నీతో మాట్లాడుతుంటే నా తలనొప్పి ఇట్టే పోయిందే అని అంటే రెండవ అతను అది ఎక్కడికీ పోలేదు నా దగ్గరకు వచ్చింది అంటాడు.' ఈ జోక్ ని మనసులో తనకి తాను అన్వయించుకుంటూ పైకి ధరణిని నవ్వించాలని ప్రయత్నించాడు. నగలవిలువే గాని నవ్వుల విలువ తెలియని ధరణి నవ్వలేదు.

ధరణీ! రా ప్లీజ్ సినిమాకెళదాం. అక్కడకు వెళితే నీ మూడ్ కాస్త మారి నీ కోపం తగ్గుతుంది అన్నాడు శ్రీధర్.

నేను రానంటే రాను. మిమ్మల్ని పెళ్ళి చేసి కొని ఎంతో నష్టపోతున్నాను. రోడ్డుమీద ఎన్నో జంటలు ఎంతో సంతోషంతో తిరుగుతున్నాయి. మీరు ఎన్నిసార్లు గుడికో, ఫంక్షన్ కో, సినిమాకో తీసుకెళతానని ఆఫీసుపనంటూ ఎగ్గొట్టలేదు పెళ్ళంటే ఎంతో మధురానుభూతి అని ఊహించుకున్నాను. నా ఊహలన్నీ తల్లక్రిందులయ్యాయి. మా పుట్టింట్లో నేను ఆడింది ఆట, పాడింది పాటాను. ఇక్కడంతా ఎదురు దెబ్బలాట. ఇప్పుడు ఏడ్చి ఏం లాభం. గతాన్ని వెనక్కు తీసుకొనిరాలేను కదా. ఇలా ఏ సంతోషమూ లేక జీవితాన్ని గడపాల్సిందే. ధరణి సాధింపు మొదలుపెట్టింది. నిజానికి ఆరోజు శ్రీధర్ ఆఫీసు నుండి త్వరగానే వచ్చాడు. అయినా ఆమె ధోరణి ఆమెదే. శ్రీధర్ కు తాను టీవీలో చూసిన ఒక సరదా సన్నివేశం

గుర్తుకొచ్చింది. ఇద్దరు భార్యాభర్తలు ఒక ఊరికి వెళ్ళాల్సి వచ్చి అక్కడ హోటల్ లో ఉండడానికి గదికోసం హోటల్ కు వెళతారు. ఆ రిసెప్షనిస్టు మీరిద్దరూ భార్యాభర్తలే అని గ్యారంటీ ఏమిటీ అంటుంది.

– – –

మీ మొహం చూసి అతను మీరు నా భర్త అనుకోవడం లేదు. మా పెద్దమ్మ పెళ్ళికి ముందే చెప్పింది. అతన్నిపెళ్ళిచేసుకోవద్దే అని నేను వినలేదు అంటూ పురాణం విప్పగానే ఆ రిసప్షనిస్టు మీరు భార్యాభర్తలని నమ్మానులెండి అంటాడు.

అంటే పెళ్ళయిన తరువాత భార్య తన భర్తను అన్ని విధాల తన చేతిలో పట్టుకుని ఆడిస్తుంది. అసలు ఎక్కడ చూసినా స్త్రీలే బాధపడిపోతున్నారని అంటారు గాని శ్రీధర్ లాంటి మగవాళ్ళకు జీవితం దినదిన గండం, ఓ సుడిగుండం.

మొత్తానికి ప్రతీరోజూ లాగే ఇద్దరూ ఎడమొహం పెడమొహం వీడలేదు. ధరణి సంతోషానికి చేతులుకలపదు, కలహానికి మాత్రం కలుపుతుంది.

సరే, నీవు రాకపోతే నేను సినిమాకు ఒక్కడినే వెళుతున్నాను. నీ టికెట్టు ఇక్కడ పెడుతున్నాను. మనసు మార్చుకుని వస్తానంటే రా., సినిమా హాలు దగ్గర ఎదురుచూస్తుంటాను అనేసి టిక్కెట్టు అక్కడ పెట్టేసి వెళ్ళిపోయాడు.

నాకోసం ఎదురుచూడనక్కరలేదు. నేను రాను. అంటూ టిక్కెట్టు చింపిపారేసింది ధరణి.

శ్రీధర్ సినిమాకు బయలుదేరాడు. కానీ ఎందుకో సినిమాకు వెళ్ళబుద్ధి కాలేదు. భార్య టిక్కెట్టు చింపకపోతే ఇదివరకటిలా తాను విడిగా ఆటోలో వస్తుందలే అనుకునేవాడు. ప్రశాంతతకోసం క్లబ్బుకి వెళదామనుకున్నాడు. ఇలా ఆలోచిస్తూ పార్కువైపు వెళుతుంటే అక్కడకు విశ్వతేజ గారి ఉపన్యాసం వినబడుతోంది. విశ్వతేజ గారు మంచి ఆధ్యాత్మిక ఉపన్యాసాలిస్తారని శ్రీధర్ కి తెలుసు. అతనికాళ్ళు అటువైపు నడిచాయి. అక్కడకి వెళ్ళి కూర్చున్నాడు. చాలమంది జనాలు వచ్చారు. పరవాలేదు. మనుషులకు టి.వి.ల మీద నుండి, సినిమాల మీద నుండి దృష్టి ఇటు మరలింది. ఇది శుభసూచకమే అనుకున్నాడు.

విశ్వతేజ గారు ఉపన్యాసం మొదలుపెట్టారు. ఈ రోజు నేను విశ్వశాంతి, విశ్వప్రేమ గురించి మాట్లాడతాను.. నా పేరు విశ్వతేజ, నాకు ఇద్దరమ్మాయిలు. వారి పేర్లు శాంతి, ప్రేమ. అందుకే నేను విశ్వశాంతి, విశ్వప్రేమ అనే విషయం మీద ప్రజలందరిని ఉత్తేజితుల్ని చేయాలనుకుంటున్నాను. వాటిపేర్లు పెట్టుకోగానే వాటిని సాధించినట్లు కాదు. మెట్లు ఎక్కాలంటే మెట్లను చూస్తూ కూర్చుంటే కుదరదు. వాటిని కాళ్ళకు పనిచెప్పి కష్టపడి ఎక్కాలి. నేను ప్రస్తుతం అదే ప్రయత్నంలో ఉన్నాను. ఏదైనా ఆచరణలో పెట్టడం అంత సులువు కాదని మనకు తెలుసు. కాని అది కష్టమూ కాదు అన్న విషయం మనం తెలుసుకోవాలి. దానికి ప్రయత్నం కావాలి. అశాంతి, మలిన ప్రేమ అనే 'రాయి' చీమ నడిస్తే అరిగిపోదు మనిషి తుడిస్తే కరిగిపోదు దాన్ని అరగ గొట్టాలన్నా, విరగ్గొట్టాలన్నాగొడ్డలి అనే ఆయుధం

కావాలి. అలాగే శాంతిని నెలకొల్పాలంటే గొడ్డళ్ళను, కత్తులను పక్కకు పారేయాలి. వాటి స్థానంలో మృదుత్వం కోమలతత్వాలను చేరదీయాలి.

విశ్వశాంతి, విశ్వప్రేమను సాధించాలంటే ఎన్నో ఒడిదుడుకులు ఎదురవతాయి.మనం ఏరంగంలోనూ ముఖ్యంగా ఇటువంటి విషయాల్లో నూరుశాతం విజయం సాధించలేము. ఇది ఏ ఒక్కరితోనూ కూడుకున్నది కాదు. సమిష్టి కృషి కావాలి దీనికి. మనుషులందరూ ఒక్కలాగా ఉండరు. అంతెందుకు మనం ఆరాధించే ప్రకృతి కూడా ఎప్పుడూ ఒకేలా ఉండదు. ప్రశాంతంగా ఉన్నట్లే ఉండి భీభత్సం సృష్టిస్తుంది. అలాంటి ప్రకృతిని మనం ఎలా కాదనుకోవడం లేదో, ఈ ప్రయత్నాన్ని కూడా విడనాడకూడదు. ఆ మనమేం చేయగలం అనుకోకండి ఉడత సాయంలా మొదలుపెట్టండి. ఉడుం సాధనలా పట్టుబట్టండి.బొట్టు బొట్టు కలిస్తే గ్లాసునిండుతుంది మాటా, మాటా కలిస్తే శాంతి పండుతుంది. విశ్వశాంతి , విశ్వప్రేమ ప్రక్రియలో వెనకడుగు వేయకూడదు. ఓపిక పట్టాలి. ఒకేసారి ప్రపంచం మారిపోదు అందుకే మెల్లగా సాధనచేయాలి. అయిదు కేజీలు మోయలేనివాడు ఏభయి కేజీలు మోయడానికి ప్రయత్నించకూడదు. ఆ బరువును మెల్లమెల్లగా అలవాటుచేసుకోవాలి. అలాగే సాధనకూడా. మనిషి తన జ్ఞానంతో కంప్యూటర్ లు, సెల్ ఫోను, టివిల లాంటివి కనిపెట్టాడు. అలాగే అజ్ఞానంతో అణుబాంబులు, మత్తు పదార్థాలు కనిపెడుతున్నాడు. అగ్గిపుల్ల దీపం వెలిగించడానికి ఉపయోగించాలి కానీ, ఇళ్ళు కాల్చడానికి కాదు.

విశ్వశాంతి, విశ్వప్రేమ అనేవి కవలలు. వాటి సంతానంలా అవి కావాలి చిలవలు, పలవలు. ముందుగా ఇది ప్రతి ఒక్కరి ఇంటి నుండి మొదలు కావాలి. ఇంట గెలిచి రచ్చగెలువు అన్నారు.

సోక్రటీస్ లాంటి వారు ఇంట గెలిచి రచ్చగెలిచారు. కొన్నిచోట్ల కుడి ఎడమైనా పర్వాలేదు. ఇక్కడ నేను ఒక జోక్ చెబుతాను ఇది నేను ఎక్కడో చదివాను. ఒక అబ్బాయి స్కూలుకి లేటుగా వెళతాడు. టీచర్ ఆ అబ్బాయిని స్కూలుకు ఎందుకు ఆలస్యమయిందని అడిగితే నా 'షూ' కనబడలేదు అంటాడు. మీ అమ్మగారినైనా, నాన్నగారినైనా అడగకపోయావా అని టీచర్ అంటే ఆ రెండూ మా అమ్మా, నాన్నా చేతుల్లో చెరొకటి ఉన్నాయి. వాటితో వాళ్ళు కొట్టుకుంటున్నారు అంటాడు. ఆ 'షూ'తో ఆ ఇద్దరూ కొట్టుకునేకంటే ఆ బాబు ఒక్కకాలికి ఒక్కొక్కరు ఆ 'షూ' తొడిగితే ఆ బాబు ఎంత ఆనందపడతాడు. అందుకే ఏమంచి పని అయినా ముందు మన ఇంటినుండి మొదలుకావాలని పదేపదే చెబుతున్నాను..... ఇలా విశ్వతేజ గారి ఉపన్యాసం జరుగుతూనే ఉంది. శ్రీధర్ లేచి 'ఇంటికి వెళ్ళాలి. ధరణి అసలే కోపంగా ఉంది. ఇప్పుడు ఏం రగడ చేస్తుందో అనుకుంటూ వెళ్ళి స్కూటర్ స్టార్ట్ చేస్తుంటే.. 'ఏమండీ, నేనూ ఇక్కడె ఉన్నాను. ఇద్దరం కలిసే వెళదాం అంటూ స్కూటర్ వెనకసీట్లో కూర్చుంటున్న ధరణిని ఆశ్చర్యంగా, ఆనందంగా చూశాడు శ్రీధర్.' ..

Well begun is half done.

★★★

# విశ్వశాంతి - విశ్వప్రేమ

- పిల్లలమర్రి కృష్ణ కుమారు

విశ్వశాంతి కావాలని మనం కోరుకుంటే మన సనాతన ధర్మంలో చెప్పబడిన బ్రహ్మతత్వాన్ని బాగా అర్ధం చేసుకుని, దాన్ని ప్రేమతో అందరికీ చెప్పి, విశ్వప్రేమ – విశ్వశాంతి ఒకే నాణానికి బొమ్మ – బొరుసు వంటివని గ్రహించాలి.

|| మత్తకోకిల ||

విశ్వమంతట నిండియున్నది బ్రహ్మతత్వమె కాదరా?
విశ్వశాంతిని దైవరూపుగ విశ్వమంతయు చాటరా!
విశ్వశాంతియె క్షేమకారణ మన్న నిజముంజెప్పరా,
విశ్వశాంతిని మన్నవించిన భావితరముల పెంపురా!

లోకంలో అన్ని దేశాలవారూ విశ్వప్రేమతో వ్యవహరిస్తే, విశ్వశాంతి పెంపొందుతుంది. శాంతి నెలకొన్న వాతావరణమే ధర్మ పాలనకి, ధర్మమైన ఆర్జనకి, తద్వారా తరిగిన తారతమ్యాలకి దారి తీస్తుంది.

|| మత్తకోకిల ||

విశ్వప్రేమయె నశ్వరంబుగ విశ్వశాంతిని పెంచురా!
నశ్వరంబుగ శాంతియుండిన ధర్మపాలన యుండురా!
ధర్మ పాలన వృద్ధి చెందిన తారతమ్యము లొగ్గురా!
విశ్వప్రేమతొ సర్వమానవ ధర్మ ఆర్జన కావరా!!

ధర్మంతో వ్యవహరించాలి అని కర్మలను మానరాదు. అధర్మాన్ని ఒప్పుకునే ప్రవర్తన బడుగుజీవుల జీవితాలని ఇంకా కష్టతరం చేస్తుంది. అందుకని ప్రతి ఒక్కరూ ధర్మమైన కర్మలే చెయ్యాలని కంకణం కట్టుకోవాలి.

|| మత్తకోకిల ||

ధర్మ ఆర్జన మానవాళికి దాన మానస కారిరా!
ధర్మహీనము బీదుజీవుల నష్టమున్ మరి పెంచురా!
కర్మచేయుట మానకు, సరి కర్మధర్మమె నీదిరా
మర్మమే ఇది సోదరా, మరి ముందు చూపుతొ సాగరా!

మనం ధర్మంగా బతుకుతున్నా, పక్క వాళ్ళని కూడా కనిపెట్టుకుని ఉంటూ, వాళ్ళకి కూడా ధర్మార్జన లభించేలాగా సహాయం చెయ్యాలి. తోటి మానవుడికి సహాయ పడేదే జీవనం. ఎప్పుడూ మంచి పనులే చెయ్యాలని ధర్మం చెపుతుంది. దీని వలన ఆత్మ శాంతి, ఆత్మ స్థైర్యం చేకూరుతాయి.

|| మత్తకోకిల ||

నీదు ధర్మము చేయునప్పుడు తోటివారిని చూడరా!
వాదులాడుతు ఉన్నకాలము పాడుచేయక యుండురా!
కాదు కాదన పక్కవారల కెన్నొ ఆపద లొచ్చురా!
సాధు కార్యము చేయ రమ్మురా, చేదు మాటలు వద్దురా!

మనందరం ఇలా బతికితే విశ్వ శాంతి, విశ్వ ప్రేమ నిజమౌతాయి. అందరి జీవనాల్లో వెలుగు పండగలు నిండుతాయి. అందుకే ధర్మ జీవనం ముఖ్యం. వేద రహస్యం ఇదే.

|| మత్తకోకిల ||

విశ్వశాంతి, విశ్వప్రేమలు వింత కాంతులు నింపురా!
విశ్వ ప్రజలకు జీవనమ్ములు పండగల్లుగ సాగురా!
విశ్వరూపుడు నిశ్చయంబుగ వీను విందుగ జేయురా!
విశ్వమంతయు కల్సినప్పుడు మారు మాటలు లేవురా!!

**హరి ఓం తత్సత్!**